శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM



రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ
పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం
ఇద్దరు పిల్లల మృతి
ఆర్‌టిసి ఎలక్ట్రిక్ బస్సు దగ్ధం 03



సంపుటి 09, సంచిక: 202 | సోమవారం | 22-06-2026 | మహబూబ్‌నగర్
Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## ‘విబి–జి రామ్‌జీ’ని వ్యతిరేకిస్తూ

# ‘సుప్రీం’ను ఆశ్రయిద్దాం

● విపక్ష పాలిత రాష్ట్రాలు వేర్వేరుగా కాకుండా ఉమ్మడిగా నిరసన వ్యక్తం చేయాలి ● కర్నాటక, కేరళ, జార్ఖండ్, తమిళనాడు, పంజాబ్‌తో చర్చించి ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలి ● రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం ● సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తున్నదని మండిపాటు



ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘విబి–జి రామ్‌జీ’ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రాలు వేర్వేరుగా కాకుండా ఉమ్మడిగా తమ నిరసనను వ్యక్తం చేయాలని, అవసరమైతే అన్ని రాష్ట్రాలు కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని కూడా పరిశీలించాలని రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయపడింది. న్యాయనిపుణుల అభిప్రాయాలను సేకరించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోవాలని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పాటు విపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలతో కూడా సంప్రదింపులు చేపట్టాలని, కర్నాటక, కేరళ, జార్ఖండ్, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలతో మాట్లాడి ఉమ్మడి కార్యాచరణను రూపొందించాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. ‘విబి–జి రామ్‌జీ చట్టం–2025’ అమలుతో ఏర్పడే ప్రభావాలు, రాష్ట్రాలపై పడుతున్న ఆర్థిక భారం, గ్రామీణ ఉపాధి హామీ పథకం భవిష్యత్తు తదితర అంశాలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం తొలి సమావేశం తరువాయి 12లో



ఇళ్లు, ఇళ్ల స్థలాల సాధనే లక్ష్యం

## విద్యుత్ ఉద్యమ తరహా

# మరో పోరాటం

శ్రీకారం చుట్టనున్నట్లు వామపక్ష పార్టీల నేతల ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్


రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు ఇళ్లు, ఇంటి స్థలం సాధించడమే లక్ష్యంగా వామపక్షపార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమం తరహాలో మరో పోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు వామపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. ఇందులో భాగంగా గుండ్ల సింగారం, గోపాల్ పూర్‌లో తొలగించిన గుడిసెల స్థానాలలో పేదలకు ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఐ(ఎం) ఇతర వాపపక్ష పార్టీల ఆధ్వర్యంలో 10 వేల మందితో ఈ నెల 27న హనుమకొండలో భారీ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హనుమకొండ జిల్లాలోని గుండ్ల సింగారంలో పేదలు నిలువ నీడ కోసం వేసుకున్న గుడిసెలను అధికారులు బందిపోటు దొంగలల చొరబడి రాత్రికి రాత్రి వాటిని తొలగించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యుత్సాహంతో అధికారులు ఎక్కడెక్కడ గుడిసెలు తొలగించారో అక్కడే తిరిగి గుడిసెవాసులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని లేకపోతే ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తామని వారు హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహా, కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం,హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, వరంగల్ జిల్లా సెక్రటరీ బాషా మియా, హనుమకొండ జిల్లా పార్టీ కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ , సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కె.గోవర్ధన్, ఎంసిపిఐ నాయకులు సుధాకర్, ఎస్‌యుసిఐ నాయకులు భరత్ పాల్గొన్నారు. సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని నిరు పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు దక్కేలా కమ్యూనిస్టు పార్టీలు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని వామపక్ష పార్టీలు చారిత్రాత్మక నిర్ణయం తరువాయి 8లో

● హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం, గోపాల్‌పూర్‌లో తొలగించిన గుడిసెల స్థానాల్లో పేదలకు ఇళ్లు కట్టించాలని డిమాండ్ ● 10వేల మందితో ఈనెల 27న హనుమకొండలో భారీ ప్రదర్శన ● జులై 1న రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయాల ముట్టడి, నిరసన ప్రదర్శనలు ● ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం అర్హులైన పేదల నుంచి దరఖాస్తుల స్వీకరణ ● జులై 6న ఇందిరాపార్క్ వద్ద వేలాది మందితో ధర్నా
● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడి

## గుడిసెల కూల్చివేత

# అమానుషం

ఖండించిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి



హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలో పేదల గుడిసెలను కూల్చివేయడం అత్యంత దుర్మార్గమైన, అమానుష చర్య అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు అదే స్థలంలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.గడిచిన ఐదేళ్లుగా గుండ్ల సింగారంలోని ప్రభుత్వ భూమిలో సుమారు 360 మందికి పైగా పేదలు గుడిసెలు వేసుకుని ఉంటూ తమకు ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని బాధితులు అనేకసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఇదేక్రమంలో శనివారం తరువాయి 12లో



## అమ్మోనియా లీక్

● ఇద్దరు మృతి, 60 మందికిపైగా అస్వస్థత ● తమిళనాడు తిరువళ్లూరులోని ఓ ప్రైవేటు రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో ప్రమాదం
● విచారణకు ఆదేశించిన ముఖ్యమంత్రి విజయ్

**తిరువళ్లూరు :** తమిళనాడు తిరువళ్లూరులోని ఓ ప్రైవేటు రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో తీవ్ర ప్రమాదం చోటు చేసుకుంది. పెరియపాలయం సమీపంలోని మంజనగరనై వద్ద ఉన్న ఒక ప్రైవేట్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో భారీగా అమ్మోనియా గ్యాస్ లీక్ అయింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మందికి పైగా కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే స్థానిక వైద్య కేంద్రాలకు తరలించినట్లు తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఎస్. కవిత ఆదివారం తెలిపారు. క్షతగాత్రుల్లో కొంతమందికి వెల్స్ ఆసుపత్రిలో, మరి కొంత మందికి తరువాయి 12లో

# బిజెపి, ఇసి లాలూచీ

● అందుకే నా నామినేషన్ తిరస్కరణ ● ఈ వ్యవహారంలో బిజెపిది తప్పుడు ప్రచారం ● లీగల్ నోటీస్ క్రిమినల్ కేసు ఎలా అవుతుంది? ● తెలంగాణ నుంచి రాజ్యసభ సీటు తీసుకోను ● మీనాక్షి నటరాజన్



కాంగ్రెస్ పార్టీలో కుట్రలు చేయాల్సిన అవసరం ఎవరికీ లేదు. నా కోసం మరొకరితో రాజీనామా చేయించి తెలంగాణలో రాజ్యసభ సీటు తీసుకోలేను. ఎవరూ రాజీనామా చేయాల్సిన అవసరం లేదు. మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని కాబట్టే అక్కడి నుంచే సీటు కోరుకుంటా.
– మీనాక్షి నటరాజన్

ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపి, ఎన్నికల కమిషన్ లాలూచీపడి తన నామినేషన్ ను తిరస్కరించారని ఎఐసిసి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. తన సీటు చోరీ జరిగిందని విమర్శించారు. బిజెపి చేస్తున్న కుట్రలు సమాజానికి తెలియజేయాలనే పోరాడుతున్నామన్నారు. తన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో బిజెపి ఉద్దేశ్యపూర్వకంగానే తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. తనపై లీగల్ కేసులేమీ లేవని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తి ఇచ్చిన కేసులో తనకు లీగల్ నోటీస్ వచ్చిందని, లీగల్ నోటీస్ క్రిమినల్ కేసు ఎలా అవుతుందని ప్రశ్నించారు. నామినేషన్ పత్రంలో లీగల్ నోటీస్ అనే కాలమ్ లేదని ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్ సంఘటన్ సృజన్ అభియాన్, ఎస్ఐఆర్‌పై సమీక్ష సమావేశం ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరా భవన్‌లో జరిగింది. సమావేశంలో ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, టిపిసిసి ట్రైనింగ్ ఇన్‌చార్జి రాంమోహన్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మీనాక్షి నటరాజన్ మీడియాతో మాట్లాడారు.

**నామినేషన్ కరెక్షన్‌కు నాకెందుకు అవకాశం ఇవ్వలేదు**

రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ అవకాశం లేదని బిజెపికి అర్థమైందని, క్రాస్ ఓటింగ్ అవకాశం లేదని ఎన్నికల అధికారులతో ఆ పార్టీ నేతలు కుమ్మక్కు అయ్యారని మీనాక్షి విమర్శించారు. పరిమళ్ నత్వానీకి ఇచ్చిన అవకాశం తనకు ఎందుకు తరువాయి 8లో



## మా ఆందోళనకు

# మద్దతివ్వండి

● రైతులకు సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విజ్ఞప్తి
● జంతర్ మంతర్ వద్ద రెండవరోజూ కొనసాగిన నిరసన
● ప్రాంగణం ఖాళీ చేయాలని పోలీసులు హెచ్చరించినా అక్కడే బైఠాయించిన విద్యార్థులు, మద్దతుదారులు

**న్యూఢిల్లీ :** పరీక్షలలో అవకతవకలు, పదేపదే పేపర్ లీక్‌లతో విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన నిరసన ప్రదర్శన రెండవ రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఈ ఆందోళనకు రైతుల మద్దతు ఇవ్వాలని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విజ్ఞప్తి చేశారు. తమ హక్కుల కోసం రైతులు చేస్తున్న పోరాటంలో విద్యార్థులు వారికి అండగా నిలిచారని, ఇప్పుడు వారికి రైతుల సంఘీభావం అవసరమని ఆయన అన్నారు. రెండవ విడతగా శనివారం ప్రారంభమైన ఈ నిరసనలో వందలాది మంది యువకులు పాల్గొన్నారు. అయితే సాయంత్రం పోలీసులు అక్కడున్న ప్రాంగణాన్ని ఖాళీ చేయమని పలుమార్లు హెచ్చరికలు చేశారు. ఈ సమావేశానికి ఇచ్చిన అనుమతి సాయంత్రం 5 గంటలకే ముగిసిందని పోలీసులు తెలిపారు. అయినప్పటికీ, దీప్కే, పలువురు ఇతర నిరసనకారులు రాత్రంతా అక్కడే కూర్చుండిపోయారు. విద్యాశాఖ మంత్రి తరువాయి 8లో



## కట్టుదిట్టంగా

# నీట్ పునఃపరీక్ష

● దేశవ్యాప్తంగా 551 నగరాలు, 5,440 కేంద్రాల్లో నిర్వహణ
● 20 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరు

**న్యూఢిల్లీ :** నీట్ యుజి పునఃపరీక్షఆదివారం నాడు దేశవ్యాప్తంగా, విదేశాలలో ఉన్న కేంద్రాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య జరిగింది. ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై జరుగుతున్న దర్యాప్తు నేపథ్యంలో మే 3న జరిగిన పరీక్షను రద్దు చేసిన తర్వాత, ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఈ పునఃపరీక్షను నిర్వహించింది. భారత్‌లోని 551 నగరాల్లోని 5,440 కేంద్రాలలో, విదేశాలలో 14 కేంద్రాలలో ఈ పరీక్ష జరిగింది. ఈ పునఃపరీక్షకు 20 లక్షల తరువాయి 12లో



## బొగ్గు సరఫరాకు కాంట్రాక్టు

# రూ.5 కోట్ల మోసం

అంతర్రాష్ట్ర మోసగాళ్ల గ్యాంగ్‌పై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు బొగ్గు సరఫరా కాంట్రాక్టులు ఇప్పిస్తామని నమ్మబలికి కోట్ల రూపాయలు వసూలు చేసిన అంతర్రాష్ట్ర మోసగాళ్ల గ్యాంగ్‌పై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో తొమ్మిది మందిపై భారతీయ న్యాయ సంహిత లోని పలు సెక్షన్ల కింద క్రిమినల్ కేసు తరువాయి 12లో

## ప్రపంచ శాంతికి

# ఉత్ప్రేరకం యోగా


యోగాను జీవితాంతం ఆచరించాలి : ప్రధాని మోదీ



**కోల్‌కతా :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం కోల్‌కతాలో జరిగిన రెండు ప్రధాన బహిరంగ కార్యక్రమాలలో భారతదేశ భవిష్యత్తు కోసం విస్తృత దృక్పథాన్ని వివరించారు. అందులో ఒకటి యోగా ద్వారా అంతర్గత సమతుల్యత, సామూహిక శ్రేయస్సుపై ఆధారపడి ఉండగా, మరొకటి జాతీయ స్వావలంబన, సముద్ర శక్తిపై ఆధారపడి ఉంది. నగరంలోని ప్రసిద్ధ రెడ్‌రోడ్‌లో జరిగిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో, ఆ తర్వాత శ్యామా ప్రసాద్ ముఖర్జీ తరువాయి 8లో

## స్విట్జర్లాండ్‌లో అమెరికా–ఇరాన్

# చర్చలు ప్రారంభం




లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులే ఎజెండా ● ఖతార్–పాక్ మధ్యవర్తిత్వం

**జూరిచ్ :** లెబనాన్‌లో యుద్ధం నివారించడం,ఇజ్రాయెల్‌ను అదుపు చేసి తక్షణం కాల్పుల విరమణ ఒప్పందాన్ని సమర్థవంతంగా అమలు చేయడం వంటి డిమాండ్లే ప్రధాన ఎజెండాగా స్విట్జర్లాండ్ బర్గెన్‌స్టాక్ నగరంలోని ఒక విలాసవంతమైన హోటల్ సముదాయంలో అమెరికా–ఇరాన్ ప్రతినిధులమధ్య ఉన్నతస్థాయి సాంకేతిక చర్చలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు నిరసనగా హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఐ.ఆర్.జి.సి (ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్) ప్రకటించడంతో ఈ చర్యలు తక్షణ అనివార్యంగా మారాయి. దీంతోపాటు స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల విడుదల,అణు సమస్య,ఇరాన్ ఓడరేవులపై ఆంక్షల ఎత్తివేత, ఇరాన్ చమురు రంగ ఉత్పత్తులపై ఆంక్షల తొలగింపు,హోర్ముజ్ జలసంధిపై ఈ 60 రోజుల్లో చర్చలు జరుగుతాయి. ఈ చర్చల్లో ప్రతినిధులకు సహాయంగా ఒకరి సమాచారాన్ని మరొకరికి తెలియజేసేందుకు వీలుగా పాకిస్థాన్–ఖతార్ దేశాల ప్రతినిధులు మధ్యవర్తిపాత్ర వహిస్తున్నారు. ఈ చర్చల్లో ఇరాన్ తరపున ఆ దేశ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్,విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి నాయకత్వం వహిస్తున్నారు. ఈ బృందంలో ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఉప కార్యదర్శి అలీ బఘేరీ కానీ, ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దోల్‌నాసెర్ హెమ్మతి ఉన్నారు. అమెరికా ప్రతినిధి బృందానికి ఆ దేశ ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ నాయకత్వం వహిస్తున్నారు. వీరితోపాటు పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్, ఇతర ప్రతినిధులు కూడా శాంతి పునరుద్ధరణ చర్చల్లో పాల్గొనేందుకు ఆదివారం ఉదయం నాటికి స్విట్జర్లాండ్ చేరుకున్నారు. ట్రంప్ అల్లుడు–సలహాదారుడు జారెడ్ కుష్నెర్, పశ్చిమాసియాలో అమెరికా దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్ ఇప్పటికే స్విట్జర్లాండ్‌లో ఉన్నారు. తొలుత ఘాలిబాఫ్ స్పందిస్తూ,ఒప్పంద పత్రంలో పేర్కొన్నవిధంగా అవతలిపక్షం (అమెరికా) ఇజ్రాయెల్‌ను కట్టడి చేసేందుకు తరువాయి 12లో

# మనం మరచిన ‘కలం యోధుడు’ కొంపెల్ల

తెలుగు సాహిత్య చరిత్రలో కొందరు రచయితలు తమ రచనల వల్ల చిరస్థాయిగా నిలిచిపోతారు. మరికొందరు తమ వ్యక్తిత్వం, సాహిత్యంపై ఉన్న అంకిత భావం, సాహిత్య సమాజం కోసం చేసిన త్యాగాల వల్ల చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదిస్తారు. అలాంటి అరుదైన వ్యక్తుల్లో కొంపెల్ల జనార్ధనరావు పేరు అత్యంత గౌరవంతో చెప్పుకోవాల్సిందే. ఆయన రచనలు సంఖ్యాపరంగా పెద్దవి కాకపోవచ్చు. కేవలం మూడు పదుల వయసులోనే ఈ లోకం విడిచి హడావుడిగా వెడిలిపోయిన ఆయన తెలుగు సాహిత్యానికి, ముఖ్యంగా ఆధునిక సాహిత్య వికాసానికి ఆయన అందించిన ప్రేరణ అసాధారణం. ఆయన జీవన విధానం అనితర సాధ్యం. ప్రతి సంవత్సరం జులై 23 వస్తే మనం కొంపెల్ల జనార్ధనరావును స్మరించుకొని తీరాలి. ఎందుకంటే ఆయన మరణం ఒక వ్యక్తి మరణం మాత్రమే తీసుకోవడంత సమంజం కాదు గనక. ఆయన మృతి, సాహిత్యాన్ని జీవితంగా భావించిన ఒక తరం కలల పతనం కూడా. ఒక సాహిత్య పత్రిక నిలదొక్కుకోవాలని, కొత్త ఆలోచనలు ప్రజల్లోకి వెళ్లాలని, తెలుగు భాషలో నూతన చైతన్యం రావాలని తపించిన వ్యక్తి చివరికి దారిద్ర్యం, అనారోగ్యం, నిర్లక్ష్యం అనే మూడు శత్రువుల మధ్య నలిగి ప్రాణాలు కోల్పోయాడు. కొంపెల్ల మరణాన్ని గుర్తుచేసుకోవడం అంటే మన సాహిత్య సమాజం తన బాధ్యతలను ఎంతవరకు నిర్వర్తించిందో ప్రశ్నించుకోవడమే. కొంపెల్ల తూర్పు గోదావరి జిల్లా మోడేకుర్రులో, 1906లో జన్మించారు. చిన్ననాటి నుంచే ఆయనకు సాహిత్యంపై అసాధారణమైన ఆసక్తి ఉండేది. కుటుంబ నేపథ్యం సౌకర్యవంతమైనదే అయినప్పటికీ, కాలక్రమేణా ఆర్థిక పరిస్థితులు క్షీణించాయి. అయినప్పటికీ ఆయనలోని సాహిత్యాసక్తి మాత్రం తగ్గలేదు. సంస్కృత విద్యను అభ్యసించి, తెలుగు సాహిత్య సంప్రదాయాలను లోతుగా అధ్యయనం చేశారు. ఆ కాలంలో జాతీయోద్యమ ప్రభావం యువతపై ఎంతగా ఉందో ఆయన జీవితం కూడా తెలియజేస్తుంది. గాంధీజీ పిలుపునకు స్పందించి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడం ఆయనలోని సామాజిక స్పృహకు నిదర్శనం. విలాసవంతమైన బాల్యం నుంచి ఆర్థిక సమస్యల కారణంగా విద్యను మధ్యలోనే వదిలివేయాల్సి వచ్చిన యవ్వనం వరకూ ఆయన జీవితం పలు పలుపులు తిరిగింది. యువకుడిగానే ‘భారతి’ పత్రికలో ఉపసంపాదకునిగా చేరడం ఆయన ప్రతిభకు నిదర్శనం. ఆకాలంలో తెలుగు సాహిత్యం ఒక సంధికాలాన్ని అనుభవిస్తోంది. సంప్రదాయ కవిత్వం నుంచి ఆధునిక భావవ్యక్తీకరణ వైపు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అలాంటి పరిస్థితు ల్లో కొంపెల్ల తనదైన స్వరాన్ని వినిపించాడు. భావకవిత్వాన్ని ఆదరించిన ఆయన అనేక కవితా ఖండికలు రచించాడు. ఆయన రచనల్లో సున్నితత్వం, భావోద్వేగం, భాషాపట్ల ప్రేమ స్పష్టంగా కనిపిస్తాయి. ‘తాన్ సేన్’, ‘తెలుగు’ వంటి నాటికల ద్వారా కూడా తన సృజనాత్మకతను చాటుకున్నాడు. రచనలు చేయడంతో ఆగకుండా, సాహిత్యాన్ని ప్రజల మధ్యకు తీసుకెళ్లాలన్న కొంపెల్ల సంకల్పం ఆయనకు ప్రత్యేక స్థానాన్ని సంపాదించిపెట్టింది. ఈ సంకల్పమే ‘ఉదయిని’ అనే సాహిత్య పత్రికకు రూపం ఇచ్చింది. 1934 డిసెంబరులో ప్రారంభమైన ఈ పత్రిక సాధారణ ప్రచురణ కాదు. అది ఒక ఉద్యమం. కొత్త ఆలోచనలకు వేదిక కావాలని, యువ రచయితలకు అవకాశం కల్పించాలని, తెలుగు సాహిత్యంలో సృజనాత్మక చైతన్యం పెంపొందించాలని ఆయన కోరుకున్నాడు. ఒక పత్రికను నడపడం ఈ రోజుల్లోనే కష్టమైతే, అప్పట్లో అది మరింత క్లిష్టమైన పని. ప్రకటనల ఆదాయం లేదు. పెద్ద పెట్టుబడులు లేవు. సాంకేతిక సౌకర్యాలు లేవు. ఉన్నది కేవలం సాహిత్యంపై అపారమైన ప్రేమ మాత్రమే. ఆ ప్రేమతోనే కొంపెల్ల పత్రికను కొనసాగించడానికి అహర్నిశలు శ్రమించాడు. పత్రికను కొనమని, చదవమని, ఆదరించమని సాహిత్యాభిమానులను వేడుకున్నాడు. అతను ఒక సంపాదకుడు... ఒక ప్రచారకుడు... ఒక నిర్వాహకుడు... ఒక సేకరణకర్త... అంతా తానై ‘ఉదయిని’ పత్రిక కోసం అవిశ్రాంగా కృషి చేశాడు. కానీ సమాజం ప్రతిసారీ త్యాగాన్ని గౌరవించదు. సాహిత్య సేవకులను వెంటనే గుర్తించదు. అదే కొంపెల్ల విషయంలో జరిగింది.



నవ్యసాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో వెలువడిన ఇతర పత్రికలు పాఠకాదరణ పొందడంతో ‘ఉదయిని’ ఆర్థికంగా కుదేలైంది. పత్రికను నిలబెట్టేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ముద్రణ ఖర్చులు చెల్లించలేని స్థితి ఏర్పడింది. చివరికి ఏడవ సంచిక ముద్రణ దశలోనే చిత్తుకాగితాలుగా అమ్మివేయాల్సిన విషాద పరిస్థితి నెలకొంది. ఇది కేవలం ఆర్థిక నష్టం కాదు. ఒక కల ఛిద్రమవడం. ఒక జీవిత లక్ష్యం కూలిపోవడం. ఒక రచయిత హృదయం ముక్కలవడం. ఆ దెబ్బను కొంపెల్ల తట్టుకోలేకపోయాడు. అప్పటికే శారీరకంగా క్షీణించిన ఆయన మానసికంగా కూడా కుంగిపోయాడు. నిలువునా విరిగిపోయాడు. క్షయ వ్యాధి ఆయన శరీరాన్ని బలహీనపరిచినా, నిజానికి ఆయనను చంపింది వ్యాధి కాదని, దారిద్ర్యమని ఆయన సమకాలీనులు చెప్పడం యాదృచ్ఛికం ఎంతమాత్రం కాదు. సాహిత్యరంగంలో ఎందరో గొప్ప వ్యక్తులు ఉన్నప్పటికీ కొంపెల్లను ప్రత్యేకంగా నిలబెట్టిన మరో అంశం శ్రీశ్రీతో ఆయనకు న్న స్నేహం. భావపరంగా ఇద్దరూ విభిన్న ధ్రువాలు. కొంపెల్ల సంప్రదాయవాది. ప్రవర్తనలో సనాతన విలువలను విశ్వసించేవాడు. మరోవైపు శ్రీశ్రీ విప్లవాత్మక ఆలోచనల ప్రతినిధి. అయినప్పటికీ వారిద్దరి మధ్య ఏర్పడిన స్నేహం తెలుగు సాహిత్య చరిత్రలో అరుదైన ఉదాహరణ. ఆ స్నేహం విమర్శతో మొదలైంది. 1928లో శ్రీశ్రీ రచించిన ‘ప్రభవ’ను కొంపెల్ల తీవ్రంగా విమర్శించాడు. భాషలో అధిక సంస్కృత ప్రభావం ఉందని, స్వతంత్ర స్వరం అవసరమని స్పష్టంగా పేర్కొన్నాడు. సాధారణంగా రచయితలు విమర్శలను సహించరు. కానీ శ్రీశ్రీ వాటిని ఆలోచించాడు. ఆ విమర్శలలోని నిజాయితీని గుర్తించాడు. అక్కడి నుంచే వారి స్నేహం ప్రారంభమైంది. నిజమైన స్నేహం అంటే ఒకరి ఆలోచనలను మరొకరు అంగీకరించడం కాదు. ఒకరి వ్యక్తిత్వాన్ని మరొకరు గౌరవించడం. కొంపెల్ల, శ్రీశ్రీల స్నేహం అలాంటిదే. ఇద్దరూ త రచూ వాదించుకునేవారు. కానీ సాహిత్యంపై ఉన్న ప్రేమ వారిని కలిపేది. ఆలోచనల్లో భేదాలు ఉన్నా లక్ష్యంలో సామ్యం ఉండేది. తెలుగు సాహిత్యం ఎదగాలని ఇద్దరూ కోరుకున్నారు. ఈ నేపథ్యంలో ఒక ఆసక్తికరమైన విషయం గుర్తు చేసుకోవాలి. తరువాత కాలంలో విప్లవాత్మక సాహిత్యానికి చిహ్నంగా నిలిచిన శ్రీశ్రీ రచనలకు తొలినాళ్లలో అం దరూ మద్దతివ్వలేదు. ఆయన ‘జయభేరి’ వంటి రచనలకు వేదికలు నిరాకరించిన సందర్భాల్లో కొంపెల్ల తన ‘ఉదయిని’ ద్వారా ఆ రచనలకు స్థానం కల్పించాడు. అంటే కేవలం తన అభిరుచికి నచ్చిన రచనలనే కాదు, కొత్త ఆలోచనలకు కూడా వేదిక కల్పించగల విశాల దృష్టి ఆయనకు ఉందని తెలుస్తుంది. కొంపెల్ల మరణం శ్రీశ్రీని తీవ్రంగా కదిలించింది. ఆ బాధే తరువాత ‘మహాప్రస్థానం’ అంకితంలో ప్రతిఫలించింది. తెలుగు సాహిత్యంలో అంకితగీతాల చరిత్రలో అది ఒక విశిష్ట స్థానం పొందింది. ‘తలవంచు కు వెళ్ళిపోయావా నేస్తం’ అనే ఆవేదన వెనుక ఒక యుగపు నిరాశ దాగి ఉంది. కొంపెల్ల మరణించినప్పుడు చాలా కొద్దిమంది మాత్రమే విచారించారని శ్రీశ్రీ పేర్కొనడం మన సాహిత్య సమాజానికి అద్దం పడుతుంది. మ నం గొప్ప రచయితలను వారి జీవితం ఉన్నప్పుడు ఆదరిస్తామా? లేక మరణానంతరం మాత్రమే మహిమలు కట్టిపెడతామా? అనే ప్రశ్నను అది ముందుకు తెస్తుంది. ఇ క్కడ ఒక పెద్ద పాఠం ఉంది. సాహిత్యం గురించి మాట్లా డే సమాజం, సా హిత్యకారులను గౌరవిస్తున్నామని చెప్పే వ్యవస్థ, వాస్తవంగా సృజనకారుల జీవన భద్రత గురించి ఎంత ఆలోచిస్తోంది? కొంపెల్ల కథ ఈ ప్రశ్నకు అసౌకర్యకరమైన సమాధానం ఇస్తుంది. ప్రతిభను ప్రశంసించడం సుల భం. కానీ ఆ ప్రతిభ బతికేలా చేయడం కష్టం. మనం తరచూ మొదటిదే చేస్తాం... రెం డోదాన్ని విస్మరి స్తాం.... నేటి పరిస్థితులను పరిశీలించినా ఈ సమస్య పూర్తిగా తొలగిపోలేదని స్పష్టమవుతుంది. అనేక చిన్న పత్రికలు ఆర్థిక ఇబ్బందులతో మూతపడుతున్నాయి. స్వతంత్ర రచయితలు తమ రచనలతో జీవించలేకపోతున్నారు. సాహిత్య ప్రచురణలు వాణిజ్య ఒత్తిడులకు లోనవుతున్నాయి. కొత్త రచయితలకు అవకాశాలు తగ్గుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో కొంపెల్ల జీవితం మనకు హెచ్చరికగా కనిపిస్తుంది. సాహిత్యం కేవలం పుస్తకాల సమాహారం కాదు. అది ఒక సమాజపు మేధో జీవితం. ఆ జీవితం కొనసాగాలంటే రచయితలు, సంపాదకులు, చిన్న పత్రికలు, సాహిత్య వేదికలు బలంగా ఉండాలి. వాటిని నిలబెట్టే బాధ్యత పాఠకులపై కూడా ఉంటుంది. కొంపెల్ల కాలంలో పాఠక మద్దతు కొరవడింది. అదే విషాదానికి కారణమైంది. ఈ రోజు కూడా అలాంటి పరిస్థితులు పునరావృతం కాకూడదంటే సాహిత్యాన్ని వినోద వస్తువుగా కాక, సామాజిక అవసరంగా చూడాలి. కొం పెల్ల జీవితాన్ని పరిశీలిస్తే, ఆయన వ్యక్తిగత కీర్తికోసం పనిచేయలేదనే మరో గొప్ప గుణం కనిపిస్తుంది కూడా సాక్షాత్కారమవుతుంది. కొంపెల్ల తన రచనల ప్రచారంకోసం పరితపించలేదు. సాహిత్యానికి ప్రజాభిమానం సంపాదించాలన్న లక్ష్యంతో పని చేశాడు. తన ఆరోగ్యం క్షీణిస్తున్నా విశ్రాంతి తీసుకోలేదు. తన కష్టాల గురించి పెద్దగా మాట్లాడలేదు. ఒక ఆదర్శం కోసం జీవించాడు. అందుకే ఆయన జీవితం మనకు కేవలం చరిత్రగా కాకుండా, ఒక నైతిక పాఠంగా మన ముందు ఉంటుంది. మనం విశ్వసించే విలువల కోసం ఎంతవరకు త్యాగం చేయగలమన్న ప్రశ్నకు సమాధానం. సమాజం గుర్తించకపోయినా, ఫలితం కనిపించకపోయినా, ఒక లక్ష్యం కోసం పనిచేయడం ఎంత గొప్పదో చెప్పే ఉదాహరణ.

– విశ్వ


‘కృష్ణాపత్రిక’ ఆయనకు ప్రదానం చేసిన ‘చండ ప్రచండ శిలాభినవ కొక్కొండ’ అనే బిరుదు కేవలం అలంకార పదజాలం కాదు. ఆయనలోని ధైర్యానికి, పట్టుదలకు, మేధస్సుకు ఇచ్చిన గుర్తింపు. కానీ బిరుదుల కంటే ఆయనకు అవసరమైనది జీవన భద్రత. అది లభించలేదు. అదే మన సాంస్కృతిక వ్యవస్థ వైఫల్యం. కొంపెల్ల మరణించి దాదాపు తొమ్మిది దశాబ్దాలు కావస్తోంది. అయినప్పటికీ ఆయన కథ ఇప్పటికీ సజీవంగా అనిపించడం వెనుక కారణం అదే. ఆయన ఎదుర్కొన్న సమస్యలు పూర్తిగా గతానికి చెందినవి కావు. సాహిత్యరంగంలో ఆర్థిక అస్థిరత, పాఠక మద్దతు కొరత, చిన్న పత్రికల సంక్షోభం, రచయితల నిర్లక్ష్యం వంటి సమస్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అందుకే ఆయన వర్ధంతి రోజున కేవలం నివాళులు అర్పించడం సరిపోదు. ఆయన కలలను గుర్తు చేసుకోవాలి. సాహిత్య పత్రికలను ఆదరించాలి. కొత్త రచయితలను ప్రోత్సహించాలి. సృజనాత్మకతకు విలువనిచ్చే వాతావరణాన్ని నిర్మించాలి. రచయితల శ్రమకు తగిన గౌరవం, ఆర్థిక భద్రత కల్పించే మార్గాలను అన్వేషించాలి. శ్రీశ్రీకి ‘మహాప్రస్థానం’ ఎంత గొప్ప కీర్తిని తెచ్చిందో అందరికీ తెలుసు. కానీ ఆ మహాప్రస్థాన అంకితంలో నిలిచిపోయిన కొంపెల్ల పేరు మనకు మరో విషయాన్ని గుర్తు చేస్తుంది. గొప్ప రచయితల వెనుక కనిపించని ఎన్నో వ్యక్తులు ఉంటారు. వారే సాహిత్య సంస్కృతికి నిజమైన సారథులు. కొంపెల్ల అలాంటి సారథి. తన స్నేహితుడిలోని మహాకవిని ముందుగానే గుర్తించిన విమర్శకుడు. కొత్త ఆలోచనలకు వేదిక కల్పించిన సంపాదకుడు. సాహిత్యాన్ని జీవిత లక్ష్యంగా మలిచుకున్న ఆదర్శవాది. చివరికి ఆ సాహిత్యానికే తన జీవితాన్ని అర్పించిన త్యాగధనుడు. తెలుగు సాహిత్య చరిత్రలో కొంపెల్ల పేరు ఒక వ్యక్తి పేరుగా కుచించుకుపోకూడదు. సాహిత్య నిబద్ధతకు ప్రతీకగా నిలవాలి. ఆయన జీవితం మనకు ఒక హెచ్చరిక, ఒక ప్రేరణ, ఒక బాధ, ఒక బాధ్యత. సాహిత్యాన్ని ప్రేమిస్తున్నామని చెప్పుకునే ప్రతి తరమూ ఆయనను స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే కొంపెల్లను గుర్తు చేసుకోవడం అంటే ఒక మనిషిని గుర్తు చేసుకోవడం కాదు.. సాహిత్యం కోసం జీవించిన, సాహిత్యం కోసం మరణించిన ఒక మహోన్నత ఆత్మను గౌరవించడం.

## చదవాల్సిన పుస్తకం

# రస్కిన్ రచనల్లో ‘మహారాణి’



రస్కిన్ బాండ్ రచనలలో ఒక ప్రత్యేక ఆకర్షణ ఉంటుంది. అతని కథలు ఎంత చిన్నవైనా, వాటి అంతర్భావం మనిషి స్వభావం, ప్రదేశాల వాతావరణం, కాలచక్రం, మానవ బలహీనతలు వంటి అంశాలను సున్నితంగా ముట్టుకుంటుంది. మహారాణి కూడా అలాంటి కథే. ఇది పెద్ద నవల కాదు.. ఒక నవెల్లా. కానీ దానిలో పుట్టే ప్రశ్నలు, పాత్రల భావజాలం, శిథిలమవుతున్న రాజరికం గురించి విస్తరిస్తున్న ప్రతిపాదనలు పాఠకుడిని చాలా కాలం ఆలోచింపజేస్తాయి. ఈ నవల భారతదేశం స్వాతంత్ర్య అనంతర దశలో రాజరికం ఏం అయింది, అప్పుడు ఆ వ్యవస్థకు చెందిన వ్యక్తుల మానసిక ప్రపంచం ఎలా దిగజారింది, ప్రతిష్ట నుండి పతనానికి వెళ్ళే ప్రయాణం ఎలా ఉంటుంది అనే దాన్ని వ్యక్తిగత కోణంలో చూపిస్తుంది. కథ దాదాపు మొత్తం మసూరీ కొండల్లో జరుగుతుంది. రస్కిన్ బాండ్ అచ్చం తన శైలిలో ప్రకృతి దృశ్యాలను పాత్రలా మార్చేస్తాడు. కథను విన్నప్పుడు మసూరీ కాలువల్లో నడిచినట్టుగా అనిపిస్తుంది. మహారాణి, పేరు అమృత కావచ్చు, కానీ బాండ్ చాలా సందర్భాల్లో ఆమెను కేవలం మహారాణి అని మాత్రమే సూచిస్తాడు. ఒకప్పుడు మహారాజుల కుటుంబానికి చెందిన ఆమె, స్వాతంత్ర్యం తర్వాత పాత సౌభాగ్యం, శక్తి, విలాసం అన్నీ నెమ్మదిగా కరిగిపోతున్నాయి. ఆ సంపూర్ణ క్షీణత మధ్య, ఆమె జీవితం పూర్తిగా అసమన్వితంగా మారిపోతుంది. ఆమె చుట్టూ ఉండే సేవకులు, ఆమె మీద ఆధారపడే వ్యక్తులు, ఆమెతో అసహనంతో ఉన్నవారు, అలాగే ఆమెని ప్రేమించాల్సిన కుటుంబ సభ్యులు అందరూ ఆమెకే తెలియని ఒక ప్రపంచాన్ని నిర్మించుకుంటారు. బాండ్ ఈ ప్రపంచాన్ని ఒక విచిత్రమైన శూన్యతతో నిండినట్టుగా చిత్రిస్తాడు. మహారాణిలో రాజరిక పతనం కేవలం చారిత్రక ఘటన కాదు. అది ఒక వ్యక్తి జీవితంలో జరుగుతున్న మానసిక వాడిపోవడం. శక్తి ఉన్నప్పుడు చేసుకునే స్వేచ్ఛలు, దురాగతాలు, ఆడంబరాలు అంతా కాలంతో కలిసి కూలిపోతాయి. మిగిలేది ఒక విచిత్రమైన నిశ్శబ్దం మాత్రమే. మహారాణి పాత్ర ద్వారా రాజరిక జీవనశైలిని ఒకే గాట్టుతో విమర్శించడం కాకుండా, దాని శోచనీయతను బాండ్ ఒక విధమైన హాస్యంతోపాటు దయతో చూపిస్తాడు. కథను చెప్పేది రచయితను పోలిన ఒక రచయితే. బాండ్ తరచూ తన రచనల్లో ఇలా చేస్తాడు. కథనకర్త మహారాణిని పరిశీలించే ఒక బాహ్య ప్రపంచ ప్రతినిధి. అతని దృష్టి వల్ల మహారాణి జీవితంలోని విషాదం మరింత స్పష్టమవుతుంది. మహారాణి నిబంధనలు పాటించని జీవితం గడుపుతుంది. ఆమె మద్యం సేవిస్తుంది, తాత్కాలిక స్నేహాలు ఏర్పరచుకుంటుంది, కొద్దిపాటి అవగాహనతో నిర్ణయాలు తీసుకుంటుంది. కానీ వీటన్నింటి వెనుక ఉన్న నిజమైన భావన ఒంటరితనం. బాండ్ ఈ ఒంటరితనం మీద తీర్పు ఇవ్వడు. దయతో చూడగలిగే ఆలోచనా విధానం మనిషి మనుగడకు అత్యవసరమని సూచిస్తాడు. రస్కిన్ బాండ్ శైలిలో ఒక ప్రత్యేకమైన తేలిక ఉండేను, కానీ అది లోతైన ఆవేదనను మోస్తుంది. మహారాణి దీనికి అద్భుత ఉదాహరణ.



కథలో సంభాషణలు తక్కువ, పరిశీలనలు ఎక్కువ. ప్రకృతి, వాతావరణం, కిటికీలోంచి కనిపించే కొండల పొగమంచు అన్నీ కథనంలో చైతన్యంగా పాల్గొంటాయి. పాత్రల విషయానికి వస్తే ‘మహారాణి’ పాత్ర కీలకం. కథలో ఆమే కేంద్రం. కానీ ఆమె మనసులోని అస్తవ్యస్తాన్ని బాండ్ సోకులేవు లేకుండా చిత్రిస్తాడు. ఒకప్పుడు అధికారంలో మునిగిపోయిన ఆమె ఇప్పుడు తన వ్యక్తిగత ప్రపంచంలో బంధించబడి ఉంది. ఆమె చర్యలు, మాటలు, తీరు అన్నీ ఆమె అస్థిరతకు అద్దం పట్టుతున్నాయి. కథనకర్త మహారాణితో స్నేహం చేస్తాడు, కానీ ఆ స్నేహం ఏంటి అని అతనకే పూర్తిగా తెలియదు. అతను ఒక ఆయవాస్తువు కాదు, అలాగే సన్నిహితుడు కూడా కాదు. కానీ అతడే మహారాణి ప్రపంచానికి సాక్షి. అతని గమనికల వల్లే ఈ కథ అంతగాఢంగా అవుతుంది. అనుబంధ పాత్రల్లో సేవకులు, గత స్నేహితులు, మహారాజు పరివారానికి సంబంధించిన వ్యక్తులు, అధికారుల రాకపోకల నీడలు అన్నీ కథలో వాతావరణమే అవుతాయి. వారి పాత్రలు మహారాణి పతనాన్ని మరింత స్పష్టంగా చూపిస్తాయి. ‘మహారాణి’లో ఎలాంటి క్లిష్టమైన నిర్మాణం లేదు. ఇది వరుసగా చెప్పే ఘటనల కథనం. పెద్ద ట్విస్ట్‌లు లేవు. బాండ్ కథలలో సాధారణంగా జరిగేదే ఇక్కడా జరుగుతుంది. కానీ అతని శక్తి ఇదే. చిన్న చిన్న పరిశీలనల్లోనే ఆయన మహత్తర భావజాలాన్ని నెమ్మదిగా ప్రవహింపజేస్తాడు. కథ చివర్లో వచ్చే మలుపు, మహారాణి జీవితం ఏ దిశలోకి వెళుతున్నదో తెలిపే ఘట్టం, చాలా మృదువుగా మరియు విషాదకరంగా ఉంటుంది. రాజరికం పతనాన్ని వ్యక్తిగత జీవితం ద్వారా ప్రతిబింబించడం, శైలిలోని స్వచ్ఛత, కథాను ముందుకు నడిపించడానికి అవసరమైన వాతావరణ నిర్మాణం, మానవ బలహీనతల చిత్రణ, వ్యంగ్యానికి, దయకూ సామాన ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలు ‘మహారాణి’కి ప్రపంచ సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానం కలిగిస్తాయి. కథ చాలా నెమ్మదిగా సాగుతుందని, కథా మలుపులు తక్కువని, మహారాణి వ్యక్తిత్వం గురించి పాఠకుడు మరింత తెలుసుకోవాలనుకునే చోట బాండ్ సంక్షిప్తంగా వదిలేస్తాడని విమర్శలు ఉన్నప్పటికీ, ‘మహారాణి’లో ఆలోచనలను రేకెత్తించే కథనం ఉంది. ఇది రాజరిక పతనం గురించి, శక్తి లేని జీవితం గురించి, వ్యక్తిగత విచ్ఛిన్నం గురించి, మానవ మనస్తత్వపు రహస్యాల గురించి ఒక నెమ్మదిగానేగానీ, విస్పష్టంగా వివరిస్తుంది. లోతైన భావనను అందించే ఈ నవల రస్కిన్ బాండ్ సాహిత్యంలో మణిరత్నం.

# ఆధునిక కవితా విప్లవం వచన కవిత


తెలుగు సాహితీ వనంలో సాంప్రదాయ ఛందోబద్ధ కవిత్వం నుండి ఆధునిక వచన కవిత్వం వైపు సాగిన ప్రయాణం ఒక గొప్ప చారిత్రక పరిణామం. పద్యం యొక్క కట్టుబాట్లను, ప్రాస నియమాలను తెంచుకుని, సామాన్యుడి భాషలో, సమకాలీన సామాజిక అంశాలను వస్తువుగా చేసుకుని పుట్టుకొచ్చిందే ‘వచన కవిత’. ఇది కేవలం ఒక ప్రక్రియ మాత్రమే కాదు; భావ ప్రకటన స్వేచ్ఛకు, సామాజిక చైతన్యానికి నిదర్శనం. నిరక్షరాస్యులకు సైతం సులభంగా అర్థమై, వారి హృదయాలను కదిలించగల శక్తి వచన కవితకు ఉంది. తెలుగులో వచన కవితా పితామహుడిగా కుందుర్తి ఆంజనేయులు గారిని పేర్కొంటారు. ఆయన వచన కవితా ఉద్యమాన్ని ఒక బలీయమైన శక్తిగా మార్చారు. అంతకుముందు గురజాడ అప్పారావు గారు ముత్యాల సరాలతో ఛందస్సును సరళతరం చేయగా, శ్రీశ్రీ ‘మహాప్రస్థానం’ ద్వారా కవిత్వ వస్తువును, శైలిని పూర్తిగా మార్చివేశారు. ఆ తర్వాత వచ్చిన కవులు పద్య నియమాలను పూర్తిగా పక్కనబెట్టి, వచన రూపంలోనే అద్భుతమైన కవిత్వాన్ని పండించవచ్చని నిరూపించారు. వచన కవితలో మాత్రా ఛందస్సు గానీ, గణ నియమాలు గానీ, ప్రాస నియమాలు గానీ ఇందులో ఉండవు. గ్రాంథిక భాషకు బదులుగా, ప్రజలు నిత్య జీవితంలో మాట్లాడే వాడుక భాషను (శిష్టవ్యవహారికం) ఇందులో ఉపయోగిస్తారు. రాజుల వంశ చరితలు, దేవుళ్ళ లీలల స్థానంలో... సామాన్యుడి కష్టం, ఆకలి, నిరుద్యోగం స్త్రీవాదం, దళిత సమస్యలు, ప్రపంచీకరణ వంటి సమకాలీన అంశాలు కవిత్వ వస్తువులయ్యాయి. పైకి వచనంలా కనిపించినా, చదివేటప్పుడు ఒక అంతర్గతమైన లయ మరియు భావ తీవ్రత వచన కవితకు ప్రాణం పోస్తాయి. వచన కవిత తెలుగు సాహిత్యాన్ని ‘సార్వజనీనం’ చేసింది. ఒకప్పుడు కవిత్వం రాయాలన్నా, చదవాలన్నా పండితులకు మాత్రమే సాధ్యమయ్యేది. కానీ వచన కవిత ద్వారా కవిత్వం సామాన్యుడి ఆయుధంగా మారింది. ‘కాదేదీ కవితకనర్హం’ అన్న శ్రీశ్రీ సూక్తిని వచన కవులు అక్షరాలా నిజం చేశారు. కుక్కపిల్ల, అగ్గిపుల్ల, రొట్టెముక్క... ఇలా ఏదైనా కవిత్వానికి వస్తువు కాగలదని నిరూపించారు. వివిధ కాలాల్లో వచ్చిన సామాజిక ఉద్యమాలకు వచన కవిత అద్దం పట్టింది. అభ్యుదయ కవిత్వం శ్రామికుల కష్టాలను, పెట్టుబడిదారీ వ్యవస్థపై తిరుగుబాటును చాటింది, దిగంబర కవిత్వం సమాజంలోని కుళ్లును, నైతిక పతనాన్ని నిలదీసింది.స్త్రీవాద, దళితవాద కవిత్వాలు సమాజంలో శతాబ్దాలుగా అణచివేతకు గురైన వర్గాల గొంతుకగా మారి, హక్కుల కోసం పోరాడే చైతన్యాన్ని రగిల్చాయి. యుగయుగాలుగా వస్తున్న పద్య సంకెళ్లను తెంచుకుని, స్వేచ్ఛా విహంగంలా ఎగిరిన వచన కవిత, ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రక్రియగా నిలిచింది. కాలంతో పాటు మారుతూ, సరికొత్త ధోరణులను సంతరించుకుంటూ నేటికీ సమాజంలోని అన్యాయాలపై అక్షర శరాలను సంధిస్తూనే ఉంది. కేవలం రూపంలోనే కాదు, భావంలోనూ విప్లవాన్ని తెచ్చిన వచన కవిత తెలుగు వారి ఆలోచనా సరళిని ఆధునీకరించడంలో కీలక పాత్ర పోషించిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

సుధాకర్ ఏ.వి, 9000674747

## ‘బయోగ్రాఫియా లిటెరేరియా’లో

# కోల్రిడ్జ్ లోతైన తాత్విక విశ్లేషణ

సాహిత్యంలో ‘రొమాంటిక్’ యుగానికి చెందిన ప్రముఖ కవి శామ్యుయేల్ టేలర్ కోల్రిడ్జ్ 1817లో రాసిన విమర్శాత్మక గ్రంథం ‘బయోగ్రాఫియా లిటెరేరియా’. దీనిని ఆయన తన జీవిత కథపై ఆధారంగా రాసినప్పటికీ, కవిత్వం, కల్పనశక్తి, మానవ మనస్సు స్వభావంపై చేసిన లోతైన తాత్విక విశ్లేషణగా ఈ పుస్తకం నిలుస్తుంది. కోల్రిడ్జ్ అభిప్రాయం ప్రకారం, కవులు తమ ప్రారంభ దశలో అత్యంత సుదీర్ఘమైన, క్లిష్టమైన పదాలు వాడతారు. కానీ సాహిత్యంలో పరిపక్వత సాధించిన తర్వాత సరళమైన, సహజమైన, స్పష్టమైన భాష వైపు మారుతారు. ఇందుకు ఉదాహరణగా జాన్ మిల్టన్, షేక్స్పియర్ లాంటి గొప్ప కవుల రచనలను పేర్కోవచ్చు. అయితే, తాను యువకవిగా ఉన్నప్పుడే సూటిగా, పారదర్శకంగా ఉన్న భాషనే ఇష్టపడేవాడినని కోల్రిడ్జ్ చెబుతాడు. అతిగా అలంకారభరితమైన పదప్రయోగాన్ని నిరాకరించాడు. ఈ అభిరుచి తనకు ప్రాచీన గ్రీకు కవుల ప్రభావం వల్ల ఏర్పడిందని చెప్పుకొస్తాడు. అదే విధంగా విద్యపై అభిప్రాయం చెప్పే సమయంలో, ‘క్రైస్ట్స్ హాస్పిటల్ స్కూల్’లో తన విద్యాభ్యాసాన్ని గుర్తు చేసుకుంటా డు. అక్కడి సంప్రదాయ విద్యావిధానం, కంఠస్థం చేసే పద్ధతి, కఠిన నియమాలు, ‘ఎందుకు?’ ‘ఏమిటి?’ అని ప్రశ్నించనీయకుండా సహజ జిజ్ఞాసను అణిచివేయడం వంటి లోపాలతో ఉండేదని విమర్శిస్తాడు. నిజమైన విద్య ప్రకృతిలో జరుగుతుందని, పిల్లలు స్వయంగా అనుభవాల ద్వారా నేర్చుకోవడమే ఉత్తమమని ఆయన విశ్వసించాడు. ప్రకృతి ఆధారిత విద్య, పుస్తక కేంద్రిత విద్య కంటే గొప్పదని భావించాడు. ప్రారంభం లో ప్రముఖ తత్త్వవేత్త డేవిడ్ హార్ట్లీ సిద్ధాంతాన్ని కోల్రిడ్జ్ సమర్థించాడు. హార్ట్లీ ప్రకారం, పాత అనుభవాల పునాదులపైనే కొత్త ఆలోచనలు ఉద్భవిస్తాయి. తొలుత ఈ సూత్రాన్ని అంగీకరించినప్పటికీ, ఆ తర్వాత కోల్రిడ్జ్ దీనిని తిరస్కరిస్తాడు. అతని అభిప్రాయం ప్రకారం మనస్సు అనేది యంత్రం కాదు. అది స్వయంగా సృజనాత్మక ఆలోచనలు ఉత్పత్తి చేస్తుంది. ప్రకృతి, మనిషి మధ్య సంబంధమే కొత్త ఆలోచనలకు మూలం. ఈ పుస్తకంలో కోల్రిడ్జ్ అత్యంత ముఖ్యమైన కల్పన శక్తి సిద్ధాంతాన్ని వివరిస్తాడు. ఇందులో మొదటిది ప్రాథమిక కల్పన. అంటే ప్రతి మనిషిలో ఉండే సహజ శకి లేదా ప్రపంచాన్ని గ్రహించడానికి అవసరమైన మౌలిక మానసిక శక్తి. రెండోది ద్వితీయ కల్పన. కవులు, కళాకారుల్లో కనిపించే ఉన్నత స్థాయి కల్పన, దానిని వాస్తవాన్ని కొత్త రూపంలో మలచగల శక్తి ఈ దశలో ఉంటుంది. సృజనాత్మక రచనకు ఈ గుణం అత్యవసరం. ఇక చివరిగా జ్ఞాపకాలలోని ఆలోచనలను కేవలం కలపడం మాత్రమే మిగిలి ఉంటుంది. ఈ దశలో కొత్త సృష్టి అంటూ ఏదీ ఉండదు. సృజనాత్మకత చాలా తక్కువ. ఈ పుస్తకం ద్వారా అతను కవుల మానసిక అభివృద్ధిని, కల్పనశక్తి ప్రాధాన్యతను, ప్రకృతి–మనస్సు సంబంధాన్ని, విశ్వ ఆధ్యాత్మిక ఏకత్వాన్ని లోతుగా విశ్లేషిస్తాడు. ఈ గ్రంథం రొమాంటిక్ సాహిత్య విమర్శలో మైలురాయి.




## ఈ వారం కవితలు

### చందమామా.....

చందమామా ఓఓఓ
చందమా
చందమామా ఓఓఓ
చందమామా

ఎర్ర ఎర్రని జెండమ్మ చందమామ
ఎంత అందంగ ఉందమ్మ చందమామ
ఎన్ని గుండెల్లో నిండివుందో
చందమామ

ఎన్ని వెన్నెల్లు చల్లుకుందో చందమామ
భూగోళాన్ని బందీ చేసే
కుట్రలను కూల్చిన జెండా
స్వప్నాలన్నీ తగలడుతుంటే
సాయుధమై పొడిచిన జెండా
లాల్ లాల్ జెండా హై
ఓ ఓ ఓ ఓ ఓ ఓ
జాన్ సీభీ ప్యారా హై

ఓ ఓ ఓ ఓ ఓ ఓ
అరె.... జాన్ సీబీ ప్యారా హై ...
విముక్తి కోసం పెనుగులాడేటి.
పీడిత జనాల ధిక్కారం
॥చందమామ॥

ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా
ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా
స్వేచ్ఛ కోసమై తెగిన సంకెళ్ళు.
ఆలపించేటి జననం
ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా
ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా

సగం నింగి ఈ నేలకు ఒంగి
ఎర్రజెండాను ముద్దాడే
నేల తల్లి తన చేతిని చాచి

జెండా కర్రగా అలరారే
అది జనం గుండెగా వర్ధిల్లే !
॥ చందమామ॥
వాన చినుకులు రాలినప్పుడు
విత్తనాలయ్యే భూతల్లి
ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా
ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా
గులాబి పువ్వులు నవ్వినప్పుడు
రాలిపడే తేనె తడి.
॥ చందమామ॥
ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా
ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా
శిశిర శాపాలు గ్రీష్మ తాపాలు
కసిగా కాటే వేస్తుంటే
వసంతమల్లె దూసుకు వచ్చి
పరిమళ మిసిరిన సుగంధము



అది పతాకమైన అరుణ వర్ణము !
॥ చందమామ॥
మార్కెట్ అనేటి టెర్రరిజంపై
మార్క్సిజం అనే ప్రతిఘటన
ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా
ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా
సామ్రాజ్య వాదపు వ్యభిచారానికి
సమాధి కట్టే సంఘటన

ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా
ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రజెండా
మూడో ప్రపంచ మట్టి మనుషుల
మనో ఫలకమే మన జెండాని
వీరులు రాసిన
పోరు పుస్తకం మన జెండా
చిగురించు సంతకం మన జెండా!
॥ చందమామ॥

– బాబ్జీ

### ‘సర్’ వద్దంటూ.. యుద్ధం జేద్దాం రండి..

కేంద్రంలో సర్కారు
నాటకాలు సూడరా
సర్ అనే సాకుతోని
ఓట్లను తొలగించెరా

నీ ఓటును తొలగించి
నీ హక్కును దొంగిలిస్తే
దండోరా మోగించి
తిరుగుబాటు చెయ్యరా

కుట్రలు కుతంత్రాలతో
రాజ్యమేలుతున్నరు
నిగ్గదీసి ప్రశ్నిస్తే
అర్బన్ నక్సలైటంటున్నరు

రాజ్యాంగం కల్పించిన
హక్కును కాజేస్తున్నరు
ప్రశ్న పత్రాల
లీకులకుఅదుపు లేదు
నీట్ పేపరు నేడు
నీటుగా లీకై
విద్యార్థుల జీవితాలు
గంగాలోన మునిగిపోయే
జీవించే హక్కును
కాలరాస్తున్నరు
ఎస్ఐఆర్ (సర్) నడ్డుకుంటే
ఎఫ్ఐఆర్ అంటున్నరు

జీవించే హక్కుపై
ఉక్కు పాదమేస్తున్నరు
పెరుగుతున్న ధరలపై
నోరు మెదపకున్నరు

అడుగుతున్న గొంతులపై
నిషేధమంటున్నరు

ఓటు హక్కు తొలగించే
హక్కు నీకు ఎక్కడని
ఉక్కు పిడికిలెత్తి మనం
ఒక్కటై పోరుదాము
ఎస్ఐఆర్ వద్దంటూ
యుద్ధం జేద్దాం రండి
తొలగించిన ఓట్లను
సాధించి తీరుదాము
సాధించిన ఓట్లతోనే
మోడీ సర్కారును
దించుదాము

జి.చంద్రమోహన్ గౌడ్
9866510399.

# సింగరేణిలో అత్యంత పకడ్బందీగా బొగ్గు రవాణా

- ప్రతీ టన్ను బొగ్గుపై అత్యాధునిక సాంకేతికతతో పారదర్శక రవాణా వ్యవస్థ, పటిష్ట పర్యవేక్షణ
- సింగరేణి యాజమాన్యం స్పష్టీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి బొగ్గు చోరీకి గురైందని, కనిపించడం లేదని విషయంలో ఎలాంటి వాస్తవం లేదని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ స్పష్టం చేసింది. సంస్థలో బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, రవాణా, విక్రయాలకు సంబంధించిన అన్ని ప్రక్రియలు అత్యంత పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతున్నాయని తెలియజేసింది. సింగరేణిలో అమలులో ఉన్న బొగ్గు రవాణా, భద్రతా వ్యవస్థలు, సాంకేతిక పర్యవేక్షణ విధానాలను సింగరేణి యాజమాన్యం ఒక ప్రకటనలో తెలియజేసింది. గనుల్లో బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశ డిజిటల్‌గా నమోదవుతోందని, బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా సరఫరా జరుగుతుందని సింగరేణి ఆపరేషన్స్ విభాగం ఉన్నతాధికారులు తెలిపారు. బొగ్గు కేటాయింపులు ఎస్ఎపి ఆధారిత సమగ్ర వ్యవస్థ ద్వారా జరుగుతున్నాయని, వినియోగదారుడు, గని, పరిమాణం, సరఫరా తేదీ తదితర వివరాలు ముందుగానే డిజిటల్‌గా మోదవుతాయని, ప్రతి టన్ను బొగ్గుకు సంబంధించిన సమాచారం కోల్ నెట్, ఎస్ఎపి ఇతర ఆన్‌లైన్ వ్యవస్థల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా చేసే ప్రతి వాహనం ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్ వద్ద తూకం వేసిన అనంతరం రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడి) ఆధారిత బూమ్ బ్యారియర్లు, జిపిఎస్, జిపిఆర్ఎస్, ట్రాకింగ్, జియోఫెన్సింగ్ వ్యవస్థల ద్వారా వాహనాల కదలికలపై రియల్ టైమ్‌లో పర్యవేక్షణ కొనసాగుతోందని ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారులు వివరించారు. రైల్వే మార్గంలో కూడా ప్రతి వ్యాగన్ లోడింగ్, డిస్పాచ్ వివరాలు డిజిటల్‌గా నమోదవుతున్నాయన్నారు. గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు (సిహెచ్‌పి)లు, వెయిబ్రిడ్జ్‌లు, రైల్వే సైడింగ్‌లు, స్టాక్ యార్డులు, ఎంట్రీ/ఎగ్జిట్ పాయింట్ల వద్ద సిసి కెమెరాలు, ఆర్ఎఫ్ఐడి వ్యవస్థలు, చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, భద్రతా సిబ్బంది 24 గంటలూ పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు బొగ్గు రవాణా విభాగం ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఆకస్మిక తనిఖీలు, ప్రత్యేక గస్తీలు నిరంతరం కొనసాగుతున్నాయన్నారు. ఇంత పకడ్బందీగా ఆర్ఎఫ్ఐడి, జిపిఎస్, సిసిటివి, కోల్ నెట్, ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్, సింగరేణి సెక్యూరిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, హోలోగ్రామ్ చలానాలు, టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షణ వంటి బహుళ స్థాయి భద్రతా వ్యవస్థల మధ్య జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి, రవాణా ప్రక్రియలో బొగ్గు చోరీకి గురికావడం, కనిపించకపోవడం వంటి ఆరోపణలు అవాస్తవమని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది.

# రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్పోర్ట్స్ యూనివర్సిటీని రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో మరుగున పడుతున్న ప్రతిభను వెలికితీసి ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఉప్పల్ స్టేడియంలో ప్రారంభమైన టిజి20 క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భట్టి ఈ మేరకు వెల్లడించారు. తెలంగాణలో క్రీడల అభివృద్ధికి కొత్త దిశగా అడుగులు వేస్తున్నామని, భవిష్యత్ ఒలింపిక్స్‌ను లక్ష్యంగా పెట్టుకుని అత్యాధునిక వసతులతో కూడిన స్పోర్ట్స్ యూనివర్సిటీని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అవకాశాల లేమితో మరుగున పడిపోతున్న ప్రతిభావంతులను గుర్తించి, వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించి ప్రపంచానికి పరిచయం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉప్పల్ స్టేడియంలో అత్యంత వైభవంగా ప్రారంభమైన టిజి20 క్రికెట్ లీగ్ మెగా టోర్నమెంట్‌లో పాల్గొన్న భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, యువ క్రీడాకారుల భవిష్యత్తుకు ఈ లీగ్ బలమైన వేదికగా నిలుస్తుందని అన్నారు. గతంలో క్రికెట్ నగరాలకే పరిమితమనే అభిప్రాయం ఉండేదని, అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతి జిల్లాలోని యువ ప్రతిభను గుర్తించి జిల్లాల వారీగా జట్లను ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి ఆడిన ఉప్పల్ స్టేడియం సాక్షిగా హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి వసతులతో కూడిన స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు కానుందని వెల్లడించారు. ఒలింపిక్స్ స్థాయి శిక్షణ అందించేలా బలమైన క్రీడా వ్యవస్థను రాష్ట్రంలో నిర్మిస్తున్నామని చెప్పారు. మొత్తం 21 రోజుల పాటు జరగనున్న టిజి20 క్రికెట్ లీగ్ రాష్ట్ర క్రీడాభిమానులకు పండుగ వాతావరణాన్ని తీసుకురానుందని, టోర్నీ విజయవంతానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# నీట్‌కు 208 పరీక్షా కేంద్రాలు.. 73,058 మంది విద్యార్థులు హాజరు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పటిష్టమైన నిఘా, బయోమెట్రిక్ వెరిఫికేషన్, సిసిటివి కవరేజ్, ప్రత్యేక తనిఖీల మధ్య 'నీట్‌యుజి 2026' పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలోజాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టిఎ), రాష్ట్ర ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించింది. రాష్ట్రంలోని నీట్ పరీక్ష కేంద్రాలను హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ బోర్డ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సిసిటివి సర్విలెన్స్‌తో అనుసంధానం చేశారు. రాష్ట్రంలోని 24 జిల్లాలలో 208 పరీక్ష కేంద్రాలలో జరిగిన నీట్ పరీక్షకు 73,058 మంది విద్యార్థులు హాజరయ్యారని వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న పరీక్ష తీరును మంత్రి దామోదర్ రాజనర్సింహ కమాండ్ కంట్రోల్ రూమును సందర్శించి, పరీక్ష కేంద్రాలను, పోలీసు బందోబస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా నీట్ పరీక్ష ఏర్పాట్లను కమాండ్ కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జ్ అధికారులు, రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, కేంద్ర విద్యా శాఖ డైరెక్టర్ రవీందర్, డిఐజి నాయక్‌తో మంత్రి దామోదర రాజనర్సింహ చర్చించారు. కాగా పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అధికారులు అనుమతించలేదు. దీంతో వారు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. సోమాజిగూడలోని రాజభవన్ ప్రభుత్వ హైస్కూల్ నీట్ పరీక్షా కేంద్రానికి ముగ్గురు, సికింద్రాబాద్ కీస్ స్కూల్ పరీపక్ష కేంద్రానికి ఇద్దరు ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని పరీక్షకు అనుమతి ఇవ్వకుండా వెనక్కి పంపించారు. అలాగే బాగ్‌లింగంపల్లి పరీక్ష కేంద్రానికి రావాల్సిన విద్యార్థి పొరపాటున శేరిలింగంపల్లికి వెళ్లింది. జరిగిన పొరపాటును గుర్తించి తిరిగి బాగ్‌లింగంపల్లి పరీక్ష కేంద్రానికి వచ్చేసరికే గడువు ముగిసింది.

# పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం

ఇద్దరు కుమారులు మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మంలో దారుణం చోటు చేసుకుంది. ఫాదర్స్‌డే రోజున పిల్లలతో సరదాగా గడపాల్సిన ఆకుటుంబంలో తీరని విషాదం నెలకొంది. కుటుంబ కలహాలతో కన్నతల్లి పిల్లలకు ఎలకలమందు తాగించి తాను సేవించి ఆత్మహత్యకు యత్నించిన ఘటన త్రీటౌన్ ప్రాంతంలోని గాంధీనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం ఖమ్మం రూరల్ మండ లం గుర్రాలపాడుకు చెందిన గోపాల లింగరాజు, స్వాతి దంపతులకు రెండేళ్ల కిందట ఖమ్మం గాంధీనగర్‌కు వచ్చి జీవిస్తున్నారు. వీరికి వేదిక్ కుమార్ (7), తనిష్క్ (5) ఇద్దరు కుమారులు ఉన్నారు. లింగరాజు స్థానికంగా సెల్‌పాయింట్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో స్వగ్రామం గుర్రాలపాడుకు వెళ్లిపోవాలని నిర్ణయించుకున్న లింగరాజు ఈ విషయం భార్య స్వాతికి చెప్పాడు. అందుకు ఆమె నిరాకరించడంతో వీరి మధ్య వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. శనివారం ఇదే విషయంలో భార్యభర్తల మధ్య గొడవ కావడంతో లింగరాజు పని నిమిత్తం గుర్రాలపాడుకు వెళ్లగా రాత్రి సమయంలో స్వాతి ఇంటికి కూల్‌డ్రింక్ తీసుకువచ్చి అందులో ఎలకల మందు కలిపి పిల్లలకు తాగించి తాను సేవించింది. ముగ్గురు అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో పక్క ఇంటి వారు గమనించి భర్త లింగరాజుకు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఇంటికి వచ్చిన లింగరాజు తలుపు తెరిచి చూడగా అప్పటికే కొడుకులిద్దరు మృతి చెందగా అపస్మారక స్థితిలో ఉన్న స్వాతిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. స్వాతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సమస్యలపై అవగాహన పెంచుకోవాలి



- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ నల్లగొండ జిల్లా సమితి సభ్యులకు రాజకీయ శిక్షణ శిబిరాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని గిరిప్రసాద్ భవన్‌లో ప్రారంభించారు.ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ నాయకత్వం నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనల రూపంలో ముందుండాలన్నారు. అందుకు మార్క్సిజమ్ లెనినిజం సిద్ధాంతాన్ని పాటించాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ అంటే పేద ప్రజల పార్టీ అన్నారు. శ్రమజీవుల సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వాటి పరిష్కారానికి ఛాంపియన్‌గా ఉండాలని, నాయకత్వం ఎప్పటికప్పుడు స్టడీ చేస్తూ వాటి పరిష్కారానికి మార్గాన్వేషణ చేయాలని పార్టీ నాయకత్వానికి ఉద్బోధించారు. ప్రస్తుత బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ధరల పెరుగుదలతో ప్రజలపై విపరీత పన్నుల భారం పడుతుందన్నారు. చాప కింద నీరులాగా హిందూ మతోన్మాదాన్ని అన్నిరంగాల్లో ప్రవేశపెడుతూ రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగపరుస్తుందన్నారు. విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆర్‌టిసి ఎలక్ట్రిక్ బస్సు దగ్ధం



- షార్ట్ సర్క్యూట్‌తో అంటుకున్న మంటలు
- డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెను ప్రమాదం

**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ ఆర్టీసీ కరీంనగర్ టూ డిపోకి చెందిన సూపర్ లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సుకు ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ బస్సు 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయల్దేరగా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ శివారులోని కాకతీయ కాలువ సమీపంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సులో నుంచి పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ ప్రశాంత్ వెంటనే అప్రమత్తమై వాహనాన్ని రోడ్డు పక్కన ఆపాడు. సిబ్బంది సహాయంతో డోర్లు, ఎమర్జెన్సీ గేట్లు తెరచి ప్రయాణీకులందరినీ సురక్షితంగా బయటకు దింపారు. అనంతరం బస్సులో ఉన్న అగ్నిమాపక పరికరాలతో మంటలను అదుపు చేసి ప్రయత్నం చేసినప్పటికీ మంటలు వేగంగా వ్యాపించడంతో ఫలితం లేకపోయింది. కేవలం 5 నిమిషాల్లోనే మంటలు బస్సు మొత్తాన్ని ఆవరించడంతో వాహనం పూర్తి గా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాతంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చినా బస్సు పూర్తిగా కాలిపోవడంతో భారీ ఆస్తినష్టం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా భావిస్తున్న అధికారులు ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై విచారణ చేపట్టారు. ఘటన కారణంగా కరీంనగర్–హైదరాబాద్ మార్గంలో కొంత సమయం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**ఎలక్ట్రిక్ బస్సుల వినియోగంపై ప్రభుత్వం పునరాలోచించాలి: సిపిఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్**

తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థ టిఎస్ ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగంపై పునరాలోచించాలని కరీంనగర్‌లో ఎలక్ట్రిక్ బస్సు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన నేపథ్యంలో ఈ బస్సుల సేఫ్టీపై పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించాకే బస్సులను అనుమతించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కరీంనగర్ టు హైదరాబాద్ రూట్‌లో ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రయాణం ప్రయాణీకులకు తీవ్ర అసౌకర్యంగా ఉందన్నారు. ఆర్టీసీని జేబిఎం లాంటి ప్రైవేట్ కంపెనీలకు అప్పజెప్పి ప్రభుత్వం ప్రయాణీకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని ఎలక్ట్రిక్ బస్సుల్లో సేఫ్టీపై చర్యలు తీసుకునేవరకు ప్రయాణీకులను రవాణాకు అనుమతించవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీకి సొంత బస్సులు కొనుగోలు చేయకుండా అద్దె బస్సులు, కంపెనీ బస్సులతో నడుపుతూ పూర్తిస్థాయి ప్రైవేట్ సంస్థగా మార్చేశారని శ్రీనివాస్ విమర్శించారు.

# అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును ప్రశ్నించిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్రంలోని బిజెపి 12 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావును టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బిజెపి ప్రకటించిన నల్లధనం వెలికితీత, ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాల కల్పన వంటి హామీల అమలు గురించి రాంచందర్ రావు మాట్లాడాలని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ సమయం ఇస్తే, బిజెపి గత మూడు ఎన్నికల మేనిఫెస్టోలలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తామని, ఆ తర్వాతే రాహుల్ గాంధీ సమయం గురించి చర్చిద్దామని ఆయన అన్నారు. ముందు బిజెపి తన హామీల అమలుపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఈ నెల 25 నుంచి ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బస్సు యాత్ర పోస్టర్‌ను ఆదివారం గాంధీ భవన్‌లో మహేష్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎస్‌టి రిజర్వేషన్ల అమలుకు శ్రీకారం చుట్టి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ హక్కులు, సంక్షేమ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే యాత్ర ప్రధాన ఉద్దేశ్యమని వారు పేర్కొన్నారు.

**ఓటు హక్కు రక్షణకు నాయకులు అప్రమత్తం**

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. కాంగ్రెస్ సంఘటన్ సృజన్ అభియాన్, ఎస్ఐఆర్‌పై సమీక్ష సమావేశం ఆదివారం ఇందిరా భవన్‌లో జరిగింది. మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్, టిపిసిసి ట్రైనింగ్ ఇన్చార్జ్ రాంమోహన్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జులు పాల్గొన్నారు. సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు అయ్యేలా చూడాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. సంస్థాగత పార్టీ బలోపేతమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని, ప్రతి కార్యకర్త ప్రజలతో నిరంతరం మమేకం కావాలన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. కాంగ్రెస్ సంస్థాగత విస్తరణకు సమన్వయంతో పనిచేయాలన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్‌ను విజయవంతం చేయాలని నాయకులకు సూచించారు.

# లోక్ అదాలత్‌తో సైబర్ బాధితులకు భారీ ఊరట

ఒక్కరోజులోనే రూ.45.21 కోట్లు రీఫండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో సైబర్ నేరాల బారిన పడిన వేలాది మందికి లోక్ అదాలత్ ద్వారా భారీ ఉపశమనం లభించింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి), తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ , బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ సేవల సంస్థలు, రాష్ట్రంలోని పోలీస్ కమిషనరేట్లు, జిల్లా పోలీసు యూనిట్ల సమన్వయంతో జూన్ 20న నిర్వహించిన లోక్ అదాలత్‌లో 6,303 మంది బాధితులకు మొత్తం రూ.45.21 కోట్లను తిరిగి అందించారు. సైబర్ మోసాల వల్ల నష్టపోయిన బాధితులకు వేగంగా న్యాయం అందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాలకు ఆర్థిక ఊరట లభించింది. అత్యధిక రీఫండ్ చేసిన యూనిట్లు ఇలా.. సైబరాబాద్ కమిషనరేట్ 2,232 మంది బాధితులకు రూ.21.91 కోట్లు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో 77 మందికి రూ.6.83 కోట్లు, మల్కాజిగిరి పోలీసు యూనిట్ 779 మందికి రూ.4.04 కోట్లు, హైదరాబాద్ కమిషనరేట్ 755 మందికి రూ.3.22 కోట్లు, సంగారెడ్డి జిల్లా 167 మందికి రూ.1.69 కోట్లు ఉన్నాయి. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన లోక్ అదాలత్‌ల ద్వారా మొత్తం 59,953 మంది సైబర్ నేర బాధితులకు రూ.445. 41 కోట్లను తిరిగి ఇప్పించినట్లు అధికారులు వెల్లడించారు. సంవత్సరాల వారీగా రికవరీలు పరిశీలిస్తే 2023లో రూ.8.36 కోట్లు, 2024లో రూ.183.90 కోట్లు, 2025 లో రూ.182.90 కోట్లు, 2026 (జూన్ 20 వరకు) రూ.70.07 కోట్లు ఉన్నాయి. యూపీఐ మోసాలు, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌లు, ఇంపర్సనేషన్ మోసాలు తదితర డిజిటల్ నేరాల్లో బాధితులకు త్వరిత గతిన డబ్బు తిరిగి అందించేందుకు న్యాయవ్యవస్థ, బ్యాంకులు, పోలీసు యంత్రాంగం మధ్య సమన్వయంతో రూపొందించిన టిజిసిఎస్‌బి లోక్ అదాలత్ విధానం దేశంలోనే ఒక సమర్థవంతమైన బాధిత పరిహార వ్యవస్థగా మారిందని అధికారులు పేర్కొన్నారు. ఒటిపిలు, పిన్‌లు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దు అని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ సూచించారు. కస్టమర్ కేర్ నంబర్లను అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే ధృవీకరించాలని తెలిపారు. ఎస్ఎంఎస్, ఇమెయిల్, వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని ప్రజలకు సూచించారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్'లోపు 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయడం ద్వారా డబ్బు రికవరీ అయ్యే అవకాశాలు పెరుగుతాయని అధికారులు సూచించారు. తెలంగాణను సైబర్ నేరాలకు చెక్ పెట్టే సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సాంకేతికత ఆధారిత పాలన, బాధితులకు త్వరిత న్యాయం, సంస్థాగత సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడించింది.

# ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చాలి

- సిఎంకు జాన్‌వెస్లీ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చాలని, ఖాళీగా ఉన్న డాక్టర్, ఇతర సిబ్బంది పోస్టులను భర్తీ చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం సిఎంకు ఆయన లేఖ రాశారు. ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న భద్రాచలం ఏజెన్సీ ప్రాంతానికి ఈ ఆసుపత్రి ఎంతో కీలకమైనదని, ఈ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే వారిలో 80 శాతం మంది ఆదివాసీలే అయినప్పటికీ, ఐటిడిఎ నిధులు కూడా ఈ ఆసుపత్రికి కేటాయించడం లేదన్నారు.పేరుకే 200 పడకల సామర్థ్యం ఉన్న ఈ ఆసుపత్రి అని ఇందులో సరిపోను డాక్టర్ల, సిబ్బంది లేకపోగా కనీస మౌలిక సదుపాయాలు కూడ లేవని పేర్కొన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రాచలం ఏరియా ఆసుపత్రిని తక్షణమేసూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఖాళీగా ఉన్న అన్ని రకాల వైద్య, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఆసుపత్రికి కావలసిన అన్ని రకాల మందులను సరఫరా చేసి, ఆధునిక వైద్య యంత్రాలను సమకూర్చాలని, శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనాలు తగిన సౌకర్యాలు కల్పించాలని, అత్యవసర వైద్య సేవల కోసం భద్రాచలంలో ఒక అడ్వాన్స్ ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన ప్రాంత ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ సమస్యపై స్పందించి, భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తగిన నిధులు కేటాయించి అభివృద్ధి చేయవలసిందిగా జాన్ వెస్లీ లేఖ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నెరవేరని కాంగ్రెస్ గ్యారంటీలపై.. రాహుల్‌గాంధీకి వినతిపత్రం ఇస్తాం

- అపాయింట్‌మెంట్ ఇప్పించండి
- సిఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలు వ్యక్తిగతంగా ఇచ్చిన హామీలు, గ్యారంటీల ఆధారంగానే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో అధికారం అప్పగించారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, నెరవేరని గ్యారంటీలపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి వినతి పత్రం అందచేసేందుకు అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరుతూ రాంచందర్ రావు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ నాయకత్వం స్పందించకపోతే, అది తెలంగాణకు, ఇక్కడి ప్రజలకు చేసిన తీవ్ర ద్రోహాన్ని స్పష్టం చేస్తుందని లేఖలో విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందుతుందని ఆశించిన వారు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15,000 అందుతుందని భావించిన రైతులకు కూడా నిరాశే మిగిలిందన్నారు. కౌలు రైతులు, రైతు కూలీలు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలు కూడా ఆశించిన ఫలితాలు పొందలేకపోయారన్నారు. విద్యా భరోసా పథకం కింద ఇస్తామన్న రూ.5 లక్షల సహాయం ఇంకా కార్యరూపం దాల్చలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా, నిరుద్యోగులు నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారన్నారు. వృద్ధులకు రూ.4,000 పెన్షన్, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పెంచిన ఆర్థిక సహాయం, కాలేజీ విద్యార్థినులకు ఉచిత స్కూటర్లు, నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్, ఉపాధి అవకాశాలు వంటి హామీలు అమలు కాలేదన్నారు. ప్రజల ఆందోళనలు, సమస్యలను నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా వీలైనంత త్వరగా అపాయింట్‌మెంట్ ఇప్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాంచందర్ రావు కోరారు.



## అక్రమ ఇసుక తరలింపును అడ్డుకున్న చిట్టెం

సెలవు దినాల్లోనూ జెసిబిలతో డంపింగ్ చేస్తున్న రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులకు బ్రేక్

**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూర్ పెద్దవాగు నుంచి మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పేరుతో జరుగుతున్న అక్రమ ఇసుక తరలింపును మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అడ్డుకున్నారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు ఆదివారం సెలవు దినమైనప్పటికీ రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ జెసిబి యంత్రాల ద్వారా పెద్దవాగులో ఇసుకను అక్రమంగా డంప్ చేస్తోందని తెలుసుకున్న రామ్మోహన్ రెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పనులను నిలిపివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం పనులు ప్రజా ప్రయోజనం కోసమే తప్ప, సహజ వనరులను దోచుకోవడానికి కాదు. సెలవు దినాల్లో ఇసుక తవ్వకాలు, తరలింపు పూర్తిగా నిషేధం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. అధికారులు స్పందించి అక్రమ తరలింపును నిలిపివేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

## బిఆర్ఎస్ సమావేశంలో చర్చకు రానున్న పలు అంశాలు

**ప్రజాపక్షం/వంగూర్ :** నేడు అచ్చంపేట పట్టణంలో నిర్వహించనున్న బిఆర్ఎస్ సమావేశాన్ని విజయవంతం చేద్దామని బిఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు గణేష్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమావేశానికి మాజీ మంత్రి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హరీష్ రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు పలు అంశాలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు హాజరుకావాలని గణేష్ రావు పేర్కొన్నారు.

## 420 హామీలతో మోసం

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**ప్రజాపక్షం/వెల్దండ :** ఎన్నికల ముందు సబ్బండ వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం అధికారం చేపట్టిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ శ్రేణులతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాక ముందు అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజల మద్దతు పొంది అధికారంలోకి వచ్చిందని, అధికారంలో వచ్చినంక తుంగలో తొక్కారని గుర్తు చేశారు. రైతులకు అధికారంలోకి వస్తే ఒకేసారి 2 లక్షలను రుణమాఫి చేస్తామని చెప్పివారికి రెండు రూపాయలు కూడా తమ ఖాతాలు జమ చేయలేదని విమర్శించారు. అదే విధంగా రాష్ట్రంలో రోజురోజుకు సమస్యలు జఠిలమవుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు విసుకు చెందుతున్నారన్నారు. కెసిఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర ప్రజలకు ముందు చూపు కోసం అనేక సంక్షేమాభివృద్ధి పథకాలను అమలుచేసి, అందులో భాగంగా రైతులకు రైతు బంధు పేరిటి ఎకరాకు రూ.5వేల రూపాయల చొప్పున సంవత్సరానికి మూడు పంటలు సాగుచేసుకునేందుకు ముందే రైతుల ఖాతాలో జమచేసేవారని, రేవంత్ రెడ్డి సర్కార్ చేపట్టినప్పటికి రైతు భరోసా పేరుతో రెండున్నర సంవత్సరాల్లో ఏకరాకు మూడు దఫాల రైతు భరోసా డబ్బులను ఏగనామంపెట్టారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం, బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి,బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు బచ్చలకూర శ్రీనివాసులు, తగుళ్ల కొండల్ యాదవ్, మాజీ సర్పంచులు వెంకటేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ ఎంపీటీసీ రాములు, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు జంగిలి యాదగిరి,పార్టీ నాయకులు హన్మంత్‌నాయక్, జంగిలి ప్రవీణ్, పాల్గొన్నారు.

## యువత అభివృద్ధే ప్రాంతీయ అభివృద్ధికి పునాది

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు టాస్క్ సి.ఒ.ఒ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి యువత అభివృద్ధి ప్రాంత అభివృద్ధికి పునాది అని, గ్రామీణ ప్రాంతాల యువతకు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన శిక్షణ లభిస్తే ఉన్నతస్థాయికి చేరుకోగలరని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, టాస్క్ సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 50 రోజులుగా కల్వకుర్తి పట్టణంలో విజయవంతంగా నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణ తరగతులను ఆదివారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, టాస్క్ సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా గత 50 రోజులుగా కొనసాగుతున్న ఈ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో శిక్షణలో వారికి అందుతున్న బోధనా విధానం, శారీరక శిక్షణ, పరీక్షల సన్నద్ధత తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు చూపిస్తున్న కృషిని అభినందిస్తూ, ఉద్యోగ సాధన కోసం వారు పడుతున్న శ్రమ తప్పకుండా ఫలిస్తుందని భరోసానిచ్చారు. పోలీస్ నియమాక పరీక్షల్లో విజయం సాధించేందుకు శారీరక ధృడత్వంతో పాటు మానసిక స్థైర్యం కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుల బృందంతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీపతి, శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/వనపర్తి :** ఖిల్లా గణపురం మండలం రుకన్న పల్లి గ్రామంలో వాల్మీకి బోయ యువజన సంఘం వారు యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారని ఫౌండేషన్ అధ్యక్షులు కాగితాల మధు తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వాల్మీకి చైర్మన్ గట్టు తిమప్ప, వైస్ చైర్మన్ నాగేష్, ఎస్సై వెంకటేష్ పాల్గొన్నారు. గట్టు తిమప్ప మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం. ప్రతిరోజు ఎంతోమందికి రక్తం అవసరం పడుతుంది. ఇలాంటి మంచి పుణ్య కార్యక్రమం నిర్వహించిన రుకన్నపల్లి గ్రామ వాల్మీకి బోయ యువజన సంఘాని ప్రత్యేకంగా అభినందించారు. ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ వాల్మీకి యువజన సంఘం యువత యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం చేయడం చాలా గొప్ప విషయం అని యువతని ప్రశంశించారు. మీరు ఇచ్చే రక్తం ఆపదలో ఉన్న ఎవరో ఒకరికి కచ్చితంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర వాల్మీకి చైర్మన్ గట్టు తిమప్ప, ఎస్సై వెంకటేష్, సర్పంచ్ కేతావత్ నరేష్, వాల్మీకి అధ్యక్షులు కుమార్, యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు కాగితాల మధు, వాల్మీకి యువత, గ్రామ ప్రజలు, వనపర్తి ప్రభుత్వ హాస్పిటల్ టెక్నిసియన్స్ పాల్గొన్నారు.

# యోగా, వ్యాయామంతో ఆరోగ్య సమస్యలు పరిష్కారం

ఆయుష్ యునాని వైద్యాధికారి డా.సరిత

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జడ్పీహెచ్ఎస్ కల్వరాలలో ఆయుష్ శాఖ యునాని విభాగం ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ యునాని వైద్యాధికారి డా.సరిత, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ మాట్లాడుతూ, ప్రపంచంలో అనేక రకాల వ్యాధులకు మందులే పరిష్కారం కాదని, క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేయడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. యోగాసనాలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా కలిగిస్తాయని ఆమె పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని, నేడు ప్రపంచ దేశాలన్నీ యోగాను ఆచరిస్తూ దాని ప్రాముఖ్యతను గుర్తిస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచు బండారు రాముడు, ఉపసర్పంచ్ తడకల రంగమ్మ, యోగా ఇన్‌స్పెక్టర్లు జ్యోతి, ఆయుష్ ఇన్‌స్పెక్టర్లు, ఎం.డి.ఇర్ఫాన్, అంజనమ్మ, శివప్రసాద్, జానకమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు జితేందర్, మధుసూదన్, బక్కన్న, పి.గోపాల్ నాయక్, పిడి శ్రీకాంత్, గీతాంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలంలోని తూంకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యా శాఖ పిలుపులో భాగంగా ఆదివారం యోగా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు గంట పాటు యోగ ప్రాముఖ్యత తెలియజేసి, యోగా చేయించారు. యోగా వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడి మానసిక ప్రశాంతత మెరుగుపడుతుందని ప్రతి రోజు వ్యాయామం, యోగా చేయడం అలవాటు చేసుకోంటే ఆరోగ్యం కాపాడుకోవచ్చునని ఉపాధ్యాయులు క్రాంతి, మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పారిజాత, విద్యార్థులు పాల్గొన్నారు.







### శారీరకంగా, మానసికంగా ఎంతో మంచిది

**కొత్తకోట :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా అవగాహన కార్యక్రమం ఆదివారం 12వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ హోమియో వైద్యాధికారి డా.ఎం.మంజుశ్రీ బాలికల సాంఘీక సంక్షేమ పాఠశాల, కళాశాలలో యోగా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వివిధ రకాల యోగా ఆసనాలను ప్రదర్శించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. యోగా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.నిహారిక, ఎస్‌సిఎన్ తుల్జాబాయి, ప్రిన్సిపాల్ మాధవీలత, యోగా శిక్షకురాలు రాజేశ్వరి, పిడి స్వప్న, దివ్య, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడింది.

### యోగా వల్ల శారీరక, మానసిక ప్రశాంతత

### యోగాతో ఆరోగ్యం, ఆనందం

**పెద్దకొత్తపల్లి :** యోగాతో శరీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, మనిషికి ఆనందాన్ని ఇస్తుందనీ, పెద్దకొత్తపల్లి గురుకుల ప్రిన్సిపల్ అకుల్ అన్నారు. అంతర్జాతీయ మోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం యోగా డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అకుల్ మాట్లాడుతు ప్రతి ఒక్కరూ రోజు 30 నిమిషాలు యోగ చేయాలని యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, అధిక రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుధాలు వీడి.. విద్యాబాటలో విజయం

పదవ తరగతి సప్లిమెంటరీలో 383 మార్కులతో మాజీ మావోయిస్టు విజయ ప్రతిభ



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** ఒకప్పుడు అడవుల్లో తిరుగుతూ మావోయిస్టు ఉద్యమంలో భాగమైన మహిళ, నేడు విద్యా మార్గంలో అడుగులు వేస్తూ జీవితానికి కొత్త అర్థం చెబుతున్నారు. ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టు సభ్యురాలు ఎత్తం చిట్టెమ్మ అలియాస్ విజయ, ఇటీవల విడుదలైన పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో 383 మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన విజయ చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి కలిగి ఉన్నప్పటికీ, కుటుంబ, సామాజిక పరిస్థితుల కారణంగా విద్యాభ్యాసాన్ని మధ్యలోనే నిలిపివేయాల్సి వచ్చింది. అనంతరం జీవితంలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో 1995 లో మావోయిస్టు ఉద్యమంలో చేరి కొన్నేళ్లపాటు అడవుల్లో గడిపారు. అయితే తరువాత ప్రభుత్వ పునరావాస విధానాల పట్ల ఆకర్షితురాలై, అప్పటి ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పిలుపు మేరకు ఆయుధాలను విడిచిపెట్టి సాధారణ జీవితంలో తిరిగి వచ్చారు. జనజీవనంలో స్థిరపడిన తర్వాత విద్య ద్వారానే వ్యక్తిగత అభివృద్ధి సాధ్యమని భావించిన విజయ, మళ్లీ చదువుపై దృష్టి సారించారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పట్టుదలతో చదివి పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యారు. కష్టానికి తగిన ఫలితంగా 383 మార్కులు సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ విద్య మనిషి జీవితాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన ఆయుధం.

**జిల్లా మహిళా సమాఖ్యలో కోశాధికారిగా సేవలు**

ప్రస్తుతం ఎత్తం చిట్టెమ్మ అలియాస్ విజయ జిల్లా మహిళా సమాఖ్య సంఘంలో కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మహిళా సాధికారత స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కోసం పనిచేస్తూ సమాజ సేవలోనూ తన వంతు పాత్ర పోషిస్తున్నారు. విద్య, క్రమశిక్షణ, పట్టుదలతో జీవితాన్ని మలుచుకోవచ్చనే సందేశాన్ని ఆమె ప్రయాణం స్పష్టంగా తెలియజేస్తోంది.



## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** బాదేపల్లి జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆచార్య జయశంకర్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని, జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి కులసంఘాలు నివాళులర్పించారు. ఆదివారంనాడు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బిసి జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బుర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి సిద్ధాంతకర్తగా, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 15వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి. తన జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన ఆయన ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి జాగృతి సేన మండల అధ్యక్షుడు గౌడుగు నర్సిములు, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి లింగంపేట్ శేఖర్, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురభి విజయ్‌కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, జిల్లా నాయకుడు మాచారం శ్రీనివాస్, సామాజిక వేత్త గోనెల రాధాకృష్ణ, యంఆర్‌పిఎస్ నాయకుడు భీంరాజ్, శివశంకర్, కార్మిక విభాగం మండల అధ్యక్షులు ఆకుల చంద్రమౌళి, ధనుష్, మేడిపూరి చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 2న ఉప్పల్ భగాయత్‌లో భూపోరాటం

తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోరే సాయిరామ్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** 2న ఉప్పల్ భగాయత్‌లో జులై రెండవ తేదీన నిర్వహించే భూ పోరాటాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ అమరవీరుల ఆశాయాల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోరే సాయిరామ్ పిలుపునిచ్చారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణలో దగాపడ్డ కళాకారులకు తెలంగాణ ఉద్యమాన్ని ప్రపంచానికి చూపించిన జర్నలిస్టు మిత్రులకు తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి హైదరాబాద్ నడిబొడ్డున ఉప్పల్ భగాయత్‌లో 250 చదరపు గజాల స్థలాన్ని తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కమిటీ పేరుతో కాలయాపన చేస్తుందని, తెలంగాణ ఉద్యమానికి ఎలాంటి సంబంధం లేని కేశవరావును ఆ కమిటీలో పెట్టడం సరైనది కాదన్నారు. జులై 2న జరిగే భూపోరాట కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రజా సంఘాల నాయకులు తెలంగాణ ఉద్యమ కారులు తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని భూ పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఎదురుగుట్ల సంపత్ గౌడ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తెల్గమల్ల లింగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లోజుల శ్రీనివాస చారి, రాష్ట్ర కోశాధికారి వేముగంటి సురేష్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి భట్టు లింగం, జిల్లా అధ్యక్షులు గడ్డం కిరణ్ కుమార్, జిల్లా నాయకులు బాస ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## జిఓ 99ని రద్దుచేయాలి

కొప్పునూరు గ్రామ ప్రజల భూములను కాపాడాలి

**ప్రజాపక్షం/చిన్నంబావి :** చిన్నంబావి మండలం కొప్పునూరు గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో గ్రామ ప్రజల అత్యవసర సమావేశం నిర్వహించబడింది. జటప్రోలు శివారులో ఉన్నప్పటికీ కొప్పునూరు గ్రామ ప్రజల పేర్లపై పట్టాలు ఉన్న 116 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూసేకరణ చేయడానికి ప్రభుత్వం విడుదల చేసిన జిఓ ఆర్‌టి.నెం.99ను గ్రామస్తులు ఏకగ్రీవంగా వ్యతిరేకించారు. ఈ భూములు గ్రామ ప్రజల జీవనాధారం మాత్రమే కాకుండా, పశువుల మేత కోసం ఉపయోగపడుతున్న కీలక భూములని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా, గ్రామ సభ నిర్వహించకుండా, సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ చేయకుండా భూసేకరణ చేపట్టడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరూ ఏకమై జిఓ 99ను వెంటనే రద్దు చేయాలని, కొప్పునూరు గ్రామ ప్రజల భూములను రక్షించాలని, కొప్పునూరు గ్రామ ప్రజల భూములను రక్షించాలని డిమాండు చేస్తూ రేపు సోమవారం చలో కలెక్టరేట్ కు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/అయిజ :** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) లోని విద్యార్థులకు యోగాలో భాగంగా ఆసనాలు, ప్రాణాయామం ప్రస్తుతం వాటి యొక్క ప్రాముఖ్యత గురించి యోగా శిక్షకులైనటువంటి జి.సూర్య ప్రకాష్, రమాదేవి తెలియజేయడం జరిగింది. మానసిక శారీరక సమస్యలను అధిగమించడానికి యోగా మంచి పరిష్కారాన్ని చూపుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రాములు వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిమ్మప్ప, రాజేంద్ర, లక్ష్మీ నారాయణ, రామకృష్ణ, వెంకటస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## క్రీడల్లో గెలవడం కాదు.. పాల్గొనడమే ముఖ్యం

ఒలంపిక్ డే రన్ నిర్వహణ కమిటీ చైర్మన్ బి.గోపాలం




**ప్రజాపక్షం/మక్తల్ :** తెలంగాణ రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎపి.జితేందర్‌రెడ్డి, పి.మల్లారెడ్డి ఆదేశాల మేరకు (జూన్ 23న, ఇంటర్నేషనల్ ఒలంపిక్ డే)ను పురస్కరించుకుని ఒలంపిక్ డే రన్ నిర్వహణ కమిటీ చైర్మన్ బి.గోపాలం ఆధ్వర్యంలో మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్ నుండి పురవీధుల గుండా 250 మంది క్రీడాకారిణులు, క్రీడాకారులు అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవం ప్రాముఖ్యతను ప్రజల్లో అవగాహన కల్పించుటకు ఘనంగా ఒలంపిక్ డే పరుగును నిర్వహించారు. ఈ ఒలంపిక్ డే పరుగును డాక్టర్ మణికంఠ గౌడ్, బి.గోపాలం క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం స్టేడియం గ్రౌండ్లో జరిగిన సమావేశంలో బి.గోపాలం, డా.మణికంఠ గౌడ్ మాట్లాడుతూ ఆధునిక ఒలంపిక్ క్రీడల వ్యవస్థాపకుడు డిక్యూ బర్టన్ ద్వారా 1948 జూన్ 23 నుండి ప్రపంచమంతటా ప్రతి సంవత్సరం జూన్ 23న ఒలంపిక్ డే పరుగును నిర్వహించుకుంటున్నామని, క్రీడల ద్వారా ప్రజలను ఏకతాటిపైకి తేవడం, శాంతిని పెంపొందించడం, చురుకైన జీవనశైలిని ప్రోత్సహించడము, ఆత్మవిశ్వాసాన్ని నింపడం, ఒలంపిక్ విలువలైన శ్రేష్టత, గౌరవము, స్నేహము, ఐక్యత, సంఘీభావము, పట్టుదల, క్రీడల పట్ల ఆసక్తిని పెంచడం, క్రీడలలో గెలవడం కాదు పాల్గొనడమే ముఖ్యం. జీవితంలో జయించడం కాదు పోరాడటమే ముఖ్యం. ప్రయత్నించకపోతే గెలువలేరని, క్రీడలలో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని వారు తెలిపారు. ఒలంపిక్ డే పరుగును విజయవంతం చేసినందుకు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బి.గోపాలం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జాతీయ స్థాయి 50 మంది క్రీడాకారిణులను, పిఇటీలను మెడల్స్, శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బి.గోపాలం, తాన్ సింగ్, డా.మణికంఠగౌడ్, కోళ్ల వెంకటేష్, జి.శివకుమార్, వాకిటి హనుమంతు, రహీంపటేల్, హెచ్‌ఎం.కురుమయ్య, తాయప్ప, అంబదాస్, రవూఫ్, మూర్తి, పిడి, పిఇటిలు అమ్రేష్, దామోదర్, స్వప్న, రమ్య చంద్రకళ, అవంతి, రేణుక, శ్రీనివాస్ 250 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

## విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ రిజ్వాన్ బాషా



**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈనెల 23వ తేదీ నుంచి 30 వ తేది వరకు ప్రతి మండలంలో విత్తన మేళాలను నిర్వహిస్తున్నందున అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ అధ్వర్యంలో ప్రతి మండలంలో రెండు రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళాలలో సంబంధిత విత్తన అధికృత డీలర్లు వివిధ రకాల విత్తనాలను విక్రయించడం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటి సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం 1638, కేఎన్ఎం 7715, డబ్ల్యూజిఎల్ 44 రకాల వరి విత్తనాలకు మాత్రమే బోనస్ చెల్లించడం జరుగుతుందని, రైతులు ఈ రకాలను మాత్రమే కొనుగోలు చేసేందుకు మేళాలో అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. వీటితో పాటు, కందులు, మినుములు, పెసర్లు, నువ్వులు, పత్తి, మిరప, వివిధ రకాల కూరగాయల విత్తనాలు, నానో యూరియా, నానో డిఏపీ లను సరసమైన ధరలకే విక్రయించడం జరుగుతుందని పేర్కొన్నారు. అన్నదాతలకు తమ పరిధిలోని రైతు వేదికల్లో నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచడమే ఈ మేళాల ప్రధాన ఉద్దేశమన్నారు. మేళాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, వ్యవసాయ శాఖ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తారన్నారు. ఈ మేళాలలో ఆయా గ్రామాల సర్పంచులు, అభ్యుదయ రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామాల పెద్దలు, అధిక సంఖ్యలో పాల్గొని, రైతులకు సహకరించి విజయవంతం చేయాల్సిందిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.



## ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుండాలి : బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : ఆలేరు నియోజకవర్గంలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుండాలని, పేద కుటుంబాలకు అండగా అభివృద్ధి లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండలంలోని బిల్యానాయక్ తండా, మాదాపూర్, రుస్తాపూర్, రాంపూర్, తిరుమలాపూర్ గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు నిర్వహించారు. అనంతరం ములకలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ వచ్చే సంక్రాంతి నాటికి కాలువల ద్వారా నియోజక వర్గంలోని చెరువులన్నింటినీ నింపే బాధ్యత నాదని, ప్రతి చెరువును జలక ళతో నింపి ఆలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే మా లక్ష్యం అని స్పష్టం చేశారు. రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్య క్రమాల్లో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేం దర్ రెడ్డి, సర్పంచులు దొంకేన రేణుక వెంకటేష్ యాదవ్, మోతీరాం నాయక్, సొన్నాయిల రఘు, సీత రాజు, బద్దు నాయక్, రాజారాం నాయక్, బులి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్** : నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకుంటే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత సంపూర్ణ ఆరోగ్యం లభి స్తుందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొ న్నారు.ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వీవీఎం పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొ న్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు,ఉపాధ్యాయులతో కలిసి ఆయన యోగాసనాలు వేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశై లిలో పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఎంతగానో దోహద పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యా యులు భద్రయ్య,పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్ రావు నాయ కులు చౌగొని శ్రీనివాస్ పాల్గొన్నారు.

**అయిటిపాముల లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలి**

కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పను లను వేగవంతం చేసి రైతులకు త్వరగా సాగునీరు అందించాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. ఆది వారం స్థానిక పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారు లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రాజెక్టు పూర్తయితే కట్టంగూర్ మండలంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన తెలిపారు. పెండింగ్ పనులకు నిధుల కొరత లేదని, నాణ్యతతో నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచిం చారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 5,108 కేసులు పరిష్కారం

**ప్రజాపక్షం/సూర్యాపేట** : జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్ నందు న్యాయశాఖతో సమన్వయంగా పని చేసి సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 5108 కేసులను పరి ష్కరించడం జరిగిందని జిల్లా ఎస్పి కె. నరసింహ ఒక ప్రకటనలో తెలి పారు. సైబర్ మోసాలకు సంబంధించిన 75 కేసుల్లో రూ.27లక్షల 78వే లను బాధితుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. 1298 క్రిమినల్ కేసులు, 1907 ఈపెట్టి కేసులు, 1903 యం.వి యాక్ట్, డ్రంకన్ డ్రైవ్ కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. పోలీస్ శాఖ కోర్టులతో సమన్వ యంగా పటిష్టంగా పనిచేయడం వల్ల ఈ కేసులు పరిష్కరించడం సాధ్య మైందని తెలిపారు. దీనికోసం ప్రణాళికతో పనిచేసి పరిష్కరించదగిన కేసు లను ముందుగానే గుర్తించామన్నారు. అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, జిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరో సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారని పేర్కొన్నారు.

## యాదయ్య జీవితం యువతకు ఆదర్శం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : గొర్రెల కాపరిగా జీవితాన్ని ప్రారం భించి,ప్రాథమిక పాఠశాల దశలోనే పేదరికం కారణంగా డ్రాపౌట్ అయిన ప్పటికీ చదువుకోవాలనే పట్టుదలతో కష్టపడి చదివి డాక్టరేట్ సాధించి అంచె లంచెలుగా ఎదిగిన ప్రొఫెసర్ బెల్లి యాదయ్య జీవితం అందరికీ ఆదర్శ మని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం రాత్రి నల్లగొండ జిల్లా కేంద్రంలో డాక్టర్ బెల్లి యాదయ్య ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా వారి ఆత్మీయ మిత్రబృందం ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ప్రొఫసర్ బెల్లి యాదయ్య ఒక ప్రైవేటు స్కూల్ ఉపాధ్యాయు నిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి, అనంతరం ప్రభుత్వ జూనియర్ లెక్చ రర్‌గా, డిగ్రీ లెక్చరర్‌గా, వివిధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్‌గా పనిచేసి ప్రతి చోటా కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్నార న్నారు.ఎంతోమంది పేద విద్యార్థులకు ఆర్థికంగా కూడా చేయూతనిస్తున్నా రని కొనియాడారు.ఎంజీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కె. అంజిరెడ్డి మాట్లా డుతూ విద్య, సాహిత్యం సమాజాన్ని మార్చగల శక్తివంతమైన సాధనాలని, విద్యార్థులు మంచి విలువలు, సామాజిక బాధ్యతతో ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెంది సమానత్వం నెలకొన్న సమసమాజం ఏర్పడుతుందన్నారు. తరాల పరమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో తెలంగాణ సాహిత్యవేత్త డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి,కవి మునాసు వెంకట్,నూక సత్తయ్య,సీని యర్ జర్నలిస్టులు క్రాంతి, కృష్ణ,డి.అక్కనపల్లి మీనయ్య,ఎడ్ల సైదులు, కృష్ణ కౌండిన్య,బకరం నరసింహ, ఎంఈఓలు మేక నాగయ్య, అంబటి అంజయ్య,గాయకుడు అంబటి వెంకన్న, సాగర్ల సత్తయ్య,గోపాలకృష్ణ,బెల్లి ఆంజనేయులు,ఆత్మీయులు పాల్గొని బెల్లి యాదయ్యను సన్మానించారు.

## ధరలు, నిరుద్యోగం రైతు కార్మిక సమస్యలపై సిపిఐ నిరంతర పోరు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : సిపిఐని గ్రామస్థాయి నుంచి మరింత బలో పేతం చేసేందుకు నాయకులు కార్యకర్తలు సమ ష్టిగా కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణం ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తలను ఆయన సూచించారు. స్థానిక విలే కరులతో మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం రైతు కార్మిక సమస్యలపై సిపిఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేయా ల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణే సిపిఐ లక్ష్యమని ప్రజా సమస్యలపై ప్రజలను మమేకం చేసి ప్రజా పోరాటాలు ఆక ర్షించేలా చేపట్టాలని సూచించారు. ఈ సమావే శంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, నరేష్, సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి బద్దుల పెంటయ్య, పల్లె సత్తిరెడ్డి , పల్లె గోపాల్ రెడ్డి,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



**పల్లె సరళ శేఖర్ రెడ్డి కుటుంబానికి పరామర్శ**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు లింగం వారి గూడెం గ్రామంలో పల్లె సరళ శేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. ఇటీవల పల్లె సరళ తండ్రి, శేఖర్ రెడ్డి ల మామ చిట్యాల సత్తిరెడ్డి ఇటీవల అనారోగ్య చని పోవడంతో విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు వారి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి , ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సంద ర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లా డుతూ కష్ట కాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. వారి యోగ క్షేమరణం అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు.

## నల్లగొండలో నీట్‌కు 283మంది డుమ్మా

7 కేంద్రాల్లో 1,782 మంది హాజరు

కేంద్రీయ విద్యాలయ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ చంద్రశేఖర్







**ప్రజాపక్షం/నల్లగొండ** : జిల్లా కేంద్రంలో నిర్వహించిన నీట్ (యూజీ) 2026 రీఎగ్జామినేషన్ ప్రశాంతంగా ముగిసింది.నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, రెవెన్యూ,పోలీస్, సంబంధిత శాఖల అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలు, ప్రణాళిక ద్వారా పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో నీట్ పరీక్ష కోసం జిల్లా యంత్రాంగం 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కేంద్రీయ విద్యాలయలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు చేసిన ఏర్పాట్లు, హాజరు, గైర్హాజరు, పోలీస్ బందోబస్తు, తనిఖీ తదితర అన్ని అంశాలను పరిశీలించడంతో పాటు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకు న్నారు.ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షకు మొత్తం 2,065 మంది హాజరు కావాల్సి ఉండగా, 1,782 మంది హాజరయ్యారని, 283 మంది గైర్హాజరయ్యారని నీట్ పరీక్ష కోఆర్డినేటర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలి పారు.



**ఎన్‌జీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పి శరత్ చంద్ర పవార్**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : జిల్లాలో నిర్వహి స్తున్న నీట్ (యూజీ) రీఎగ్జామినేషన్ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఎన్‌జీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ పరిశీలిం చారు. పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచే సుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 అమల్లో ఉన్నందున ఎవరూ గుంపులుగా నిలబడకూడదని, పరీక్ష కేంద్రాల వద్ద అనవసర రద్దీ సృష్టించవద్దని సూచించారు.

**ప్రశాంతంగా నీట్ పరీక్ష : జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : నీట్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. జిల్లాలో మొత్తం ఐదు సెంటర్లలో పరీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 908 మంది విద్యార్థులకు గాను 763 మంది విద్యార్థులు హాజరు కాగా 145 మంది విద్యా ర్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించి నట్లు తెలిపారు.

**సూర్యాపేటలో ఎస్పి కె. నరసింహ్మ పరిశీలన**

**ప్రజాపక్షం/సూర్యాపేట** : సూర్యాపేట పట్టణంలో నీట్ పరీక్ష నిర్వ హిస్తున్న తెలంగాణ రెసిడెన్షియల్ సోషల్ వెల్ఫేర్ గురుకుల మహిళా కళా శాల నందు పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పి కె. నరసింహ ఆదివారం పరిశీ లించారు. ఈ సందర్భంగా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరి శీలించడంతో పాటు, పరీక్షకు హాజరౌతున్న విద్యార్థులతో మాట్లాడి శుభా కాంక్షలు తెలిపారు. బందోబస్తు వివరాలు, విద్యార్థుల హాజరు వివరాలను స్థానిక డిఎస్పి ప్రసన్నకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష అనం తరం పరీక్షా పత్రాలను తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.



## తల్లిదండ్రులు చూసి గర్వపడే స్థాయికి ఎదగాలి

సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జెడి లక్ష్మి నారాయణ

**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థులు జీవితంలో గొప్ప విజయాలు సాధించాలంటే నిర్దిష్టమైన సూత్రాలు పాటించాలని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జెడి లక్ష్మి నారాయణ అన్నారు. ఆదివారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో కత్రం చారిట్రబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కత్రం శ్రీకాంత్‌రెడ్డి, అభిజ్ఞ దంపతులు 2026 పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కత్రం యంగ్ ఇండియా మెరిట్ స్కాలర్‌షిప్‌ను పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరై 39 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.4,20,000 నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదవడమే కాకుండా పాఠ్యాంశాల సారాం శాన్ని గ్రహించాలన్నారు. మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాం చెప్పినట్లు లక్ష్య సాధన కోసం నిద్రపట్టకుండా చేసే కలలను కాని సాకారం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు గర్వపడేలా చదివిన పాఠశాలలకే రేపు ముఖ్య అతిథిగా వెళ్లేలా మీ సంతకాన్ని ఒక ఆటోగ్రాఫ్‌గా మార్చుకునేలా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకో వాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. శ్రీకాంత్‌రెడ్డి గ్రామీణ విద్యార్థుల పాలిట అణిముత్యాలను వెలికితీస్తూ ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సలీంషరీఫ్, శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షులు కత్రం సీతారాంరెడ్డి, కార్యదర్శి పోటు రంగారావు, నాని, సీనియర్ న్యాయవాది నాగార్జున, జితేందర్‌రెడ్డి, బడుగుల సైదులు, బంధం వెంకటేశ్వర్లు, శ్రీనివాస రెడ్డి, తీగల నరేష్, కత్రం కిరణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటాలే మార్గం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ(గుర్రంపోడు):** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని,కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు శ్రమ దోపిడీని మరింత పెంచుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి విమర్శించారు.ఆది వారం గుర్రంపోడులో నిర్వహించిన ఏఐటీయూసీ మండల 5వ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, దశాబ్దాల పోరాటాల ఫలి తంగా కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో తీసుకొ చ్చిన విధానాలు యాజమాన్యాలకు అధిక అధికారాలు కల్పించగా, కార్మికు లను బానిసల మాదిరిగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు.44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మిక వర్గానికి శాపంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఈ కోడ్‌లను వెంటనే రద్దు చేసి కార్మికులకు భద్రత, హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మి కుల కోసం సమగ్ర చట్టం అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థలను రద్దు చేసి శాశ్వత ఉద్యోగాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా జూలై 19న నల్లగొండ జిల్లా ఏఐటీయూసీ మహాసభ గుర్రంపోడులో నిర్వహిం చనున్నట్లు ప్రకటించారు.ఈ మహాసభలో ఎస్‌కే అమీర్,జాల పెదనరసింహ,టీ బిక్షం,వెంకన్న,జాల చిన్న నరసింహ,నారాయణ,పి.సత్తయ్య, కె.మహేష్, బి.శ్రీను,షఫీ,కోటేష్,జానీ,లింగయ్య, ఖలీల్ పాల్గొన్నారు.

**మండల నూతన కమిటీ ఎన్నిక** : గౌరవ అధ్యక్షుడు ఆర్.లక్ష్మీపతి,అధ్యక్షుడు ఎస్.కే. అమీర్,ఉపాధ్యక్షులు జాల నరసింహ, కుందనపల్లి నారాయణ, కొండ మహేష్,ప్రధాన కార్యదర్శి: జాల పెదనరసింహ,సహాయ కార్యదర్శులు డి.శ్రీను, పోలేని సత్తయ్య,కోశాధికారి తవిటి వెంకన్నతోపాటు 15 మందిని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

## త్వరలో మిర్యాలగూడలో అతి పెద్ద టోర్నమెంట్

రూ.10లక్షల ప్రైజ్ మనీతో క్రికెట్ పోటీలు

క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** త్వరలో మిర్యాలగూడలో తెలంగాణ స్థాయిలో అతిపెద్ద టోర్నమెంట్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి ప్రకటించారు. పట్టణంలోని రాజీవ్ గాంధీ స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రైజ్ మనీ అందించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే కనీవినీ ఎరుగని రీతిలో దసరా పండుగ నాటికి మొదటి బహుమతి రూ.10లక్షలు, రెండవ బహుమతి రూ.5 లక్షల ప్రైజ్ మనీతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ టోర్నమెంట్ ఉపయోగ పడుతుందన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడల వల్ల క్రీడాకారుల్లో స్నేహ భావం పెంపొందించబడుతుందని, మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. గెలుపు ఓటమిలు సహజమని, ఆట తీరులో మెళకువలను మెరు గుపరుచుకోవాలన్నారు.

**ముగిసిన ఛైర్మన్ కప్ పోటీలు..** ఈనెల 4న ప్రారంభమైన ఛైర్మన్ కప్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ టోర్నమెంట్లో 40కు పైగా జట్లు పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్ సీబీకే, అజార్ 11 జట్లు తలపడగా ముందుగా బ్యాటింగ్ చేసిన సీబీకే జట్టు పది ఓవర్లలో 89 పరుగులు చేసింది. 90 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన అజార్ 11 జట్టు 11పరు గులు మిగిలి ఉండగానే ఆల్ ఔట్ అయింది. దీంతో విజేతగా నిలిచిన సీబీకే జట్టుకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీషనవీన్ సహకా రంతో రూ.1లక్షల ప్రైజ్ మనీ, రన్నర్కు వర్షిత ఆసుపత్రి ఎండి కె. రాంబాబు సహకారంతో రూ.50వేల ప్రైజ్ మని అందించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మహేష్‌కు రూ.10వేలు వాగ్దేవి పాఠశాల యాజమాన్యం అందించింది. ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలు కూరి బాలకృష్ణ, జిల్లా నాయకులు గుడిపాటి నవీన్, కౌన్సిలర్లు జావిద్, ఎండి. సలీం, బంటు శ్రీను, బూడిద సైదులు, నాయకులు ఆలగడప గిరి ధర్, అబ్దుల్లా, అయూబ్, మణి, శ్రీను, చక్రి, నిర్వాహకులు, పర్వేజ్ఖాన్, మహమూద్, అతిక్, శేఖర్, ఎస్ఎస్వి, రఫీ పాల్గొన్నారు.



## మిర్యాలగూడ ట్రిపుల్ మర్డర్ మిస్టరీ ఛేదన

సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్ట్ - పోలీసులకు ఎస్పి ప్రశంసలు





**ప్రజాపక్షం/నల్లగొండ** : మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడలో ఈ నెల4న జరిగిన అగ్నిప్రమాద ఘటన వెనుక ఉన్న ట్రిపుల్ మర్డర్ మిస్టరీని నల్ల గొండ జిల్లా పోలీసులు ఛేదించారు. తొలుత ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్ర మాదంగా భావించిన ఈ ఘటన వాస్తవానికి పథకం ప్రకారం చేసిన హత్యగా తేలిందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి మాట్లాడుతూ డీసీఆర్‌బీ డిఎస్పి జి. రవి పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుడిని గుర్తించి అరెస్టు చేశాయని తెలి పారు.దర్యాప్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్ళపాలెం గ్రామానికి చెందిన కాళహస్తి శిరీష్ కుమార్ ఈ ఘాతు కానికి పాల్పడినట్లు నిర్ధారణ అయిందన్నారు. నిందితుడికి గతంలోనే వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు, మోసాలకు పాల్పడిన చరిత్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైందని చెప్పారు.వివాహ సంబంధాల కోసం ఉపయోగించే ఆన్‌లైన్ వేది కలు, ముఖ్యంగా మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ల ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుని, వారి నమ్మకాన్ని సంపాదించి ఆర్థిక లాభాలు పొందడం నింది తుడి అలవాటుగా మారిందని పోలీసులు గుర్తించారు. ఇదే విధంగా బాధిత రాలు ధనలక్ష్మితో పరిచయం ఏర్పరుచుకుని వివాహం చేసుకున్నాడని తెలి పారు.అయితే కాలక్రమేణా ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో ధనలక్ష్మి అత డిని దూరం పెట్టిందన్నారు. హాజీపూర్‌లో నమోదైన ఓ మోసం కేసులో జైలులో ఉన్న సమయంలో తనకు ఎలాంటి సహాయం చేయకపోవడం, బెయిల్ కోసం ప్రయత్నించకపోవడం పట్ల నిందితుడు తీవ్ర ఆగ్రహం పెంచు కున్నాడని తెలిపారు.ఈ నేపథ్యంలో ధనలక్ష్మి కుటుంబంపై ప్రతీకారం తీర్చు కోవాలని ముందుగానే ప్రణాళిక రచించినట్లు విచారణలో తేలింద న్నారు.ఘటన జరిగిన రోజు ఉదయం తన ఇంటి సమీపంలో ఉన్న యాక్టివా స్కూటీని దొంగిలించిన నిందితుడు మిర్యాలగూడకు బయలుదేరాడని, మార్గ మధ్యంలో ప్లాస్టిక్ క్యాన్ కొనుగోలు చేసి పెట్రోల్ నింపించుకున్నాడని చెప్పారు.అనుమానం రాకుండా రోజంతా పలు ప్రాంతాల్లో తిరుగుతూ రాత్రి వరకు వేచి ఉన్నాడన్నారు.ఘటన జరిగిన సమయంలో బాధితురాలు ధనలక్ష్మి ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడగా, ఆమె తల్లి వనం చంద్రమ్మ (48), కుమారుడు లక్ష్మణ్ (17),కుమార్తె ప్రణతి (15)మంటల్లో చిక్కుకుని సజీవదహనమై మృతి చెందినట్లు ఎస్పి తెలిపారు.సంఘటన స్థలంలో లభించిన సూక్ష్మ ఆధారాలు, కాలిపోయిన ఇంటి వెనుకభాగంలో లభించిన పెట్రోల్ వాసన ఉన్న బకెట్, వివిధ ప్రాంతాల సీసీటీవీ ఫుటేజీలు, ప్రయాణ మార్గానికి సంబంధించిన సమాచారం, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుడి కదలికలను గుర్తించి అరెస్టు చేసినట్లు వివరించారు. వివాహ సంబంధాల కోసం ఉపయోగించే ఆన్‌లైన్ వేదికల ద్వారా పరిచయ మయ్యే వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పూర్తిస్థాయి వివరాలు తెలుసుకున్న తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ఈ క్లిష్టమైన కేసును అత్యంత వేగంగా ఛేదించిన డీసీఆర్‌బీ డిఎస్పి జి. రవి, మిర్యాలగూడ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగభూషణరావు, ప్రొబేషనరీ ఎస్ఐ వెంకటేశ్వర్లు,హెడ్ కానిస్టేబుళ్లు జి. రాజారాం, నల్లగంతుల శ్రీను, ఎస్.వెంక టేశ్వర్లు,హుస్సేన్, బి వీరబాబు,జి.నర్సింహా,బి.ప్రసాద్‌లను జిల్లా ఎస్పి ప్రత్యే కంగా అభినందిస్తూ ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులు ప్రకటించారు.

## బడంగ్ పేట్‌లో భారీ పేలుడు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** బాలాపూర్ మండలం మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బడంగ్‌పేట్‌లో పేలుడు సంభవించింది. గుర్తుతెలియని పదార్థం పేలడం తో అక్కడే నివాసం ఉంటున్నట్లుగా భావిస్తున్నా అనూప్ (43) అక్కడికక్కడే మృతిచెందాడు. పేలుడు తీవ్రతకు అతడి శరీరభాగాలు దూరంగా ఎగిరిపడ్డాయి. ఇటీవలే కోలకతా నుంచి పనుల కోసం అనూప్ హైదరాబాద్ వచ్చినట్లు సమాచారం. పేలుడుకు కారణమై పదార్థం ఏమిటన్న వివరాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

## ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలి..



**ప్రజాపక్షం/యాచారం :** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని బిఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బూడిద రాంరెడ్డి తెలిపారు. అదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సామాజిక సేవలో భాగంగా మహిళలకు జూట్ బ్యాగులను గ్రామ సర్పంచ్ అనిత శరణం అధ్వర్యంలో పంపిణి చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంగ కృష్ణ, వార్డు సభ్యులు అంజయ్య, పాషా, మస్కు యాదగిరి, శ్రీనాధ్, శ్రీకాంత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర టిక్కి లీగల్ సేల్ రాష్ట్ర కార్యదర్శిగా మోతీలాల్‌నాయక్




**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మంథనిగౌరేల్లి గ్రామానికి చెందిన బాణావత్ మోతీలాల్ నాయక్ అడ్వకేట్ ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ అఫ్ కామర్స్ ఇండస్ట్రియల్(టిక్కి) తెలంగాణ రాష్ట్ర లీగల్ సేల్ కార్యదర్శిగా నియమితులైనారు. అదివారం సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ శ్రీనివాస్ నాయక్ నియామక పత్రం అంద జేశారు.

## అర్థిక సహాయం అందజేత




**ప్రజాపక్షం/యాచారం :** స్నేహితుడి కుటుంబానికి అండగా నిలుస్తూ 50 వేల రూపాయల అర్థిక సహాయం అందజేశారు. మిరఖాన్ పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన పూర్వ విధ్యార్థులు, మిత్రులు కలిసి ఆర్థిక సహాయాన్ని అదివారం అంద జేశారు. భీమనమోని సోమయ్య ధనలక్ష్మి సంతానమైన అక్షయ, తరుణ్ కుటుంబానికి పూర్వ తోడుగా ఉంటామని వారు హామీ ఇచ్చారు.

## మృతుడి కుటుంబానికి చేయూత



**ప్రజాపక్షం/కేశంపేట:** మండలం వేములనర్వ గ్రామానికి చెందిన శ్యామల సాయికిరణ్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో అతివేగంగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. విషమం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పల్లెమోని సువర్ణ నరసింహులు మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేసి 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మల్లేష్ చంద్రయ్య, ఉపసర్పంచ్ కాట్రావత్ రమేష్, గ్రామస్తులు మనోహర్‌గౌడ్, చిర్ర శ్రీను, ఆనంద్‌రెడ్డి, చిర్ర రాజు, కటిక రమేష్, కటికే యాదయ్య పాల్గొన్నారు.

## జయశంకర్ సార్ ఆశయసాధనకు కృషి




**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని షాద్‌నగర్ పొలిటికల్ జెఏసి నేత టిజి శ్రీనివాస్ కోరారు. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్థంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో నేతలు అర్జునప్ప, రామారావు, రవీంధ్రనాథ్, యూటిఎఫ్ కృష్ణయ్య, మందారం నరసింహులు, టెలిఫోన్ సత్యనారాయణ, క్రాంతికుమార్, రవి, వెంకట్‌రాంరెడ్డి, దిలీప్, వెంకటేష్ ముదిరాజ్, నర్సింలు ముదిరాజ్, ఆర్టీసి రాములు, కృష్ణ, వీరేష్ పాల్గొన్నారు.

## రైతుల పట్ల నిర్లక్ష్యం తగదు



**ప్రజాపక్షం/కొందుర్గు:** రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పోరాటాలు తప్పవని బిఆర్ఎస్ శ్రేణులు హెచ్చరిస్తున్నారు. ఆదివారం కొందుర్గు మండల కేంద్రంలో ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్థంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రాజేష్ పటేల్, రామకృష్ణ, సర్పంచ్ ప్రభాకర్, ఉపసర్పంచ్ చంద్రశేఖర్, పోతురాజు గోపాల్, ఆకుల మాణేయ్య, కారకొండ యాదగిరి, రామగల సుందర్, జగదీశ్వర్ గౌడ్, బుజ్జిగారి వాసూరి, గంట్ల రాజు, సచిన్ పాల్గొన్నారు.

# మూడు కార్పొరేషన్‌లపై 'పర్యవేక్షణ' ఎక్కడ ?

కనిపించని స్పెషల్ ఆఫీసర్ మార్క్ పాలన
స్థాయిసంఘం సమావేశాలకే పరిమితం
ప్రజలకు అందుబాటులోలేని ప్రత్యేకాధికారి జయేష్ రంజన్






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ట్రై మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో పాలన కుంటుపడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిహెచ్‌ఎంసిని మూడు ముక్కలుగా పునర్విభజించి, నూతన వ్యవస్థను తీసుకువచ్చిన నాటి నుంచి స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన జయేష్ రంజన్ కేవలం స్థాయిసంఘం సమావేశాలకే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో కోర్ అర్బన్ రీజియన్‌లోని మూడు మున్సిపల్ కార్పొరేషన్‌లకు నియమించిన స్పెషల్ ఆఫీసర్ వ్యవహారశైలి ఇప్పుడు మున్సిపల్ వర్గాల్లోనే చర్చనీయాంశంగా మారింది. గత ఫిబ్రవరి 11న జిహెచ్‌ఎంసిని మూడు కార్పొరేషన్‌లుగా విభజించిన తర్వాత ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, వంద రోజులు దాటిపోయినా ఇప్పటివరకు కోర్ అర్బన్ రీజియన్‌లో తనదైన ముద్ర వేసేలా ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు మున్సిపల్ కార్పొరేషన్‌ల స్థాయిసంఘం సమావేశాలకు హాజరవడమే తప్ప, సాధారణ రోజుల్లో ఎక్కడా కనిపించరని, అధికారులకు కూడా అందుబాటులో ఉండరని మున్సిపల్ అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మూడు కార్పొరేషన్‌లకు ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్నప్పటికీ, ఆయా కార్పొరేషన్‌లలో ఉన్న ప్రత్యేకాధికారి కార్యాలయాల్లో కనీసం సమయం కేటాయించని పరిస్థితి నెలకొంది. సందర్శన వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం సర్వత్ర విస్మయం వ్యక్తం అవుతోంది. కేవలం స్థాయిసంఘం సమావేశాలకే హాజరుకావడం, అజెండాలోని అంశాలను ఆమోదించడం వరకే ఆయన పాత్ర పరిమితమావడం గమనర్హం. మూడు కార్పొరేషన్‌లకు స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన ఉన్నతాధికారి పాత్ర కేవలం సమావేశాలకు హాజరై అజెండా అంశాలను ఆమోదించడం వరకే పరిమితమైందా?, నగరాభివృద్ధి, పౌర సేవలు, నిధుల వినియోగం, విభాగాల సమన్వయం వంటి కీలక అంశాలపై ప్రత్యక్ష పర్యవేక్షణ ఎందుకు కనిపించడం లేదు? అన్న ప్రశ్నలు ఇప్పుడు మున్సిపల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

### గత స్పెషల్ ఆఫీసర్‌ల ప్రత్యేక మార్క్..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్, స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసిన సివిఎస్‌కె శర్మ తన చురుకైన పాలనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పగలు రాత్రులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అభివృద్ధి పనులు, పౌరసేవలపై సమీక్షలు చేపట్టేవారు. ఆ తర్వాత స్పెషల్ ఆఫీసర్‌గా వచ్చిన ఎస్.పి.సింగ్ కూడా తనదైన శైలిలో వ్యవహరించారు. అయితే అప్పట్లో కమిషనర్‌గా స్పెషల్ ఆఫీసర్లుగా ఒకరే ఉండేవారు. దీంతో త్వరితగతిన నిర్ణయాలు తీసుకునేందుకు అస్కారం ఉండేది. ప్రస్తుతం కోర్ అర్బన్ రీజియన్‌కు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయేష్ రంజన్‌ను ఆయన్ను ఆ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవికే పరిమితం చేసి, ప్రస్తుతం మూడు కార్పొరేషన్‌ల కమిషనర్‌లకే ప్రత్యేక అధికారి హోదా కల్పించడం ద్వారా పరిపాలన వ్యవహారాల్లో వేగం తీసుకరావచ్చు అనే అభిప్రాయాలు అధికార వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. శివారులోని 12 మున్సిపాల్టీలు, 8 గ్రామపంచాయతీల విలీనం తో మున్సిపల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా మారింది. 2007 నుంచి ఇప్పటి వరకు జిహెచ్‌ఎంసికి ముగ్గురు ఉన్నతాధికారులు స్పెషల్ ఆఫీసర్‌లుగా వ్యవహరించారు. వారిలో సివిఎస్‌కె శర్మ, ఎస్‌పి.సింగ్, ప్రస్తుతం ఫిబ్రవరి నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్న జయేష్ రంజన్ ఉన్నారు.

### సమీక్షలు లేవు.. పర్యటన లేవు..!

జిహెచ్‌ఎంసి, ఎంఎంసి, సిఎంసి కార్యాలయాలకు కూడా స్థాయిసంఘం సమావేశాలు ఉంటేనే స్పెషల్ ఆఫీసర్ వస్తున్నారు. సాధారణ రోజుల్లో నగరాభివృద్ధి పనులపై పర్యటనలు, విభాగాల వారీగా సమీక్షలు, పౌరసేవల నిర్వహణపై తనిఖీలు నిర్వహించిన సందర్భాలే లేవని, ప్రభుత్వ పరంగా నిర్వహించే అధికారిక కార్యక్రమాలకే సైతం ఆయన ముఖం చాటేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మూడు కార్పొరేషన్‌ల కమిషనర్లను మినహాయిస్తే మిగిలిన అధికారుల్లో చాలామందికి ఆయన అందుబాటులో లేరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సందర్శన వేళల్లో సామాన్య ప్రజలకు ముఖం చాటేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముగ్గురు మున్సిపల్ కమిషనర్లు మినహా మిగిలిన అధికారులెవ్వరికీ ఆయన దొరకడం లేదని సమాచారం.

## 'సభ్యత్వ నమోదు, సర్' పట్ల బిఆర్‌ఎస్ సన్నాహక సమావేశాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సభ్యత్వ నమోదు కార్యక్రమం, 'సర్' పట్ల బిఆర్ఎస్ శ్రేణులతో రాష్ట్రవ్యాప్తంగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నామని బిఆర్‌ఎస్ఎల్‌పి విప్ కె.పి. వివేకానంద తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మన్నె క్రిశాంక్, నందికంటి శ్రీధర్‌తో కలిసి వివేకానంద మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, స్కాములను ఆధారాలతో సహా ప్రజల ముందుకు తీసుకొస్తున్నామన్నారు. మాజీ ఎంఎల్‌ఏ మైనంపల్లి హనుమంతరావు మతి స్థిమితం కోల్పోయారని ఎద్దేవా చేశారు. పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన కేసుల నమోదుకు, సిట్లకే పరిమితమైందని ఆరోపించారు.

## ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కార చర్యలు

కెబిఆర్ పార్కు పరిసరాల్లో
7 ఫ్లైఓవర్లు, 7 అండర్‌పాస్‌లు
వన్ వే 'ట్రయల్ రన్' పరిశీలించిన సిపి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెబిఆర్ పార్కు పరిసరాల్లో సుమారు 7 ఫ్లైఓవర్లు, 7 అండర్‌పాస్‌లు రాబోతున్నాయని హైదరాబాద్ సిపి సజ్జనార్ వివరించారు. వన్ వే విధానం వల్ల ప్రయాణ దూరం స్వల్పంగా పెరిగిన కూడా ట్రాఫిక్ జామ్‌లు లేకుండా సాఫీగా ప్రయాణించవచ్చని చెప్పారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్ సిటీ) ప్రాజెక్టు నిర్మాణ పనుల నేపథ్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పరిధిలోని కెబిఆర్ పార్కు చుట్టూ ఆదివారం హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం రెండో వన్ వే ట్రయల్ రన్ చేపట్టింది. ఇక్కడ జరుగుతున్న స్టీల్ ఫ్లైఓవర్, అండర్‌పాస్ పనులను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ట్రయల్ రన్‌ను ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డెవిస్, డిసిపిలు కాజల్, రమణారెడ్డి, తదితర అధికారులతో కలిసి సిపి సజ్జనార్ స్వయంగా క్షేత్రస్థాయిలో కెబిఆర్ పార్కు మెయిన్ గేట్, బసవతారకం ఆసుపత్రి, అగ్రసేన్ జంక్షన్, ఫిలింనగర్, రోడ్ నంబరు 45 మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు గల ప్రధాన కూడళ్లను సందర్శించి, వాహనాల రాకపోకలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిపి సజ్జనార్ మాట్లాడుతూ భవిష్యత్తులో పెరగనున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ట్రయల్ రన్ చేపట్టినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. సోమవారం ఉదయం నుంచి వాహనాల రాకపోకలు యథావిధిగా సాగుతాయన్నారు. ట్రయల్ రన్ సమయంలో తలెత్తే ఇబ్బందులపై నిరంతరం అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. వాహనదారులు రోడ్లపై అకస్మాత్తుగా లేన్‌లు మార్చడం వల్ల కొంత గందరగోళం ఏర్పడుతోందన్నారు. అందువల్ల పోలీసులు జారీ చేసే అడ్వైజరీలు, సూచిక బోర్డులను తప్పనిసరిగా పాటించాలని కోరారు. జోయల్ డెవిస్ మాట్లాడుతూ ప్రస్తుతం డ్రోన్‌ల ద్వారా ఈ జంక్షన్లలో ట్రాఫిక్ విధానాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, పూర్తిస్థాయిలో సమాచారం సేకరించిన తర్వాతే ఇక్కడ శాశ్వత మార్పులు చేపడతామని, సాఫీ ప్రయాణానికి ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

## రూ.95 లక్షల ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం

కేసు ఛేదించిన సైబరాబాద్ పోలీసులు
ఏడుగురు నిందితుల అరెస్ట్,
రూ.26.57 లక్షల నగదు స్వాధీనం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రూ.95 లక్షల ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం కేసును ఛేదించి,7 గురు నిందితుల అరెస్ట్ చేయడంతోపాటు రూ.26.57 లక్షల నగదు స్వాధీనంచేసుకున్నట్లు సైబరాబాద్ సైబర్ క్రైమ్ డిసిపి టి సాయి మనోహర్ తెలిపారు. కేసు వివరాలు... బాధితుడు శ్రీకాంత్ రెడ్డి అలియాస్ సురేష్ రెడ్డిని "ఏలేరా క్యాపిటల్ డెస్క్" పేరుతో నిర్వహిస్తున్న నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్,ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫారమ్‌లో పెట్టుబడులు పెట్టేలా నిందితులు ప్రలోభపెట్టారు.వాట్సాప్ గ్రూపులు,ఇతర ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి పెట్టుబడులు పెట్టించారు. బాధితుడు తొలుత రూ.46 లక్షలు పెట్టుబడి పెట్టగా, ట్రేడింగ్ ఖాతాలో రూ.2,04,54,000 లు లాభం వచ్చినట్లు నకిలీగా చూపించారు.ఆ మొత్తాన్ని ఉపసంహరించుకునేందుకు (విత్ డ్రా ) ప్రయత్నించినప్పుడు ట్యాక్స్, సెక్యూరిటీ డిపాజిట్, ప్రాసెసింగ్ ఫీజు,ఇతర చార్జీల పేర్లతో మరింత డబ్బు చెల్లించాలని నిందితులు కోరారు.ఈ విధంగా వివిధ ట్యాక్సులు,ఛార్జీల పేరుతో మరో రూ.49 లక్షలు వసూలు చేసి,మొత్తంగా బాధితుడి నుండి రూ.95 లక్షలు కాజేశారు. డబ్బు ఉపసంహరణ జరగకపోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలు, బ్యాంకింగ్ లావాదేవీలు,మనీ ట్రైల్‌ను విశ్లేషించి మోసపూరిత సొమ్ము ప్రవాహాన్ని గుర్తించినట్లు ఆయన వివరించారు.దర్యాప్తులో నేరగాళ్లు మోసపూరిత సొమ్మును 45 లేయర్ బ్యాంక్ ఖాతాల ద్వారా తరలించినట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. ప్రత్యేక పోలీసు బృందాలు విశాఖపట్నంలోని గాజువాక ప్రాంతంలో ఆపరేషన్ నిర్వహించి ఈ కేసులో ప్రమేయం ఉన్న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు అదనపు సి పి తెలిపారు.ఈ కేసు ఛేదనలో ఇన్‌స్పెక్టర్ మధు అత్యంత కీలకపాత్ర పోషించారు. డిజిటల్ ఆధారాలను సేకరించడం, మనీ ట్రైల్‌ను శా)యంగా విశ్లేషించడం, నిధుల ప్రవాహాన్ని స్థాపించడం, నిందితుల పాత్రను నిర్ధారించడంలో ఆయన విశేష కృషి చేశారు.

అదేవిధంగా ఎస్ఐ శ్రీనివాస్, వారి బృందం ఆపరేషన్ సమయంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నిందితుల అరెస్టు,నగదు రికవరీ, ఇతర ఆధారాల స్వాధీనంలో సమర్థవంతంగా పనిచేశారని చెప్పారు. ఈ కేసును పర్యవేక్షించిన ఎసిపి రవీందర్ రెడ్డి మార్గదర్శకత్వంలో దర్యాప్తు విజయవంతంగా పూర్తయిందని,కేసు ఛేదనలో విశేష కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ మధు,ఎస్ఐ శ్రీనివాస్, వారి బృందాన్ని,అలాగే కేసును సమర్థవంతంగా పర్యవేక్షించిన ఎసిపి రవీందర్ రెడ్డి లని సైబర్ క్రైమ్ డిసిపి టి.సాయి మనోహర్ అభినందించారు. డబ్బు ఉపసంహరణ కోసం అదనపు ట్యాక్సులు, ఛార్జీలు చెల్లించాలని కోరితే వెంటనే అనుమానించాలని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు నమోదు చేయాలని సైబర్ క్రైమ్ డిసిపి టి.సాయి మనోహర్ పేర్కొన్నారు.


## 13.6 కిలోల బంగారంతో పరార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలోని ప్రముఖ ఆభరణాల వ్యాపారులను నమ్మించి 13.6 కిలోల బంగారు ఆభరణాలు తీసుకుని రూ.20.59 కోట్ల మేర మోసానికి పాల్పడిన జ్యువెలరీ వ్యాపారి, అతడి కుటుంబసభ్యులు, సిబ్బందిపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) పోలీసులు కేసు నమోదు చేశారు. బంగారం తీసుకున్న తర్వాత కుటుంబంతో కలిసి పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బంజారాహిల్స్‌కు చెందిన నవ్యా జెమ్స్ అండ్ జ్యువెల్స్ యజమాని సుధీర్ అగర్వాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఈవోడబ్ల్యూ టీమ్6 ఎసిపి ఎం.వెంకటరామయ్యకు దర్యాప్తు అప్పగించారు. ఫిర్యాదు ప్రకారం, సోమాజిగూడలో కెవి జ్యువెలర్స్, నితిన్ జ్యువెలర్స్ పేరుతో వ్యాపారం చేస్తున్న నితిన్ గులాబానీ, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, కళ్యాణ్ జ్యువెలర్స్, పీఎన్ గాడ్గిల్ వంటి ప్రముఖ సంస్థలతో వ్యాపార సంబంధాలు ఉన్నాయని చెప్పి నగరంలోని పలువురు వ్యాపారుల విశ్వాసాన్ని సంపాదించాడు. తొలుత లావాదేవీలు సక్రమంగా నిర్వహించి, ఆ తర్వాత భారీ మొత్తంలో బంగారు ఆభరణాలను తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏప్రిల్2025 నుంచి జూన్2026 తొలి వారంలో సుధీర్ అగర్వాల్, నీరజ్ అగర్వాల్, గణేష్ లాల్, రాకేష్ అగర్వాల్‌లు కలిపి మొత్తం 13.649 కిలోల బంగారు ఆభరణాలు నితిన్ గులాబానీకి అందజేశారు. వీటి మార్కెట్ విలువ సుమారు రూ.20.59 కోట్లుగా పేర్కొన్నారు. సుధీర్ అగర్వాల్ – 3 కిలోలు (రూ.4.50 కోట్లు), నీరజ్ అగర్వాల్ – 5.110 కిలోలు (రూ.7.50 కోట్లు), గణేష్ లాల్ – 2.586 కిలోలు (రూ.4.03 కోట్లు), రాకేష్ అగర్వాల్ – 2.953 కిలోలు (రూ.4.56 కోట్లు) ఉన్నాయి. బంగారం విలువకు సంబంధించి హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ, యాక్సిస్ బ్యాంకుల చెక్కులు ఇచ్చి బాధితుల్లో విశ్వాసం కల్పించిన నితిన్ గులాబానీ, తర్వాత డబ్బు చెల్లించకుండా, సమాన పరిమాణంలో బంగారం తిరిగి ఇవ్వకుండా తప్పించుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఉద్యోగులు హరీష్, ధన్‌రాజ్, సాయి కూడా స్పష్టమైన సమాచారం ఇవ్వలేదని తెలిపారు. తర్వాత నితిన్ గులాబానీ చెప్పిన ప్రముఖ జ్యువెలరీ సంస్థలతో తనకు ఎలాంటి వ్యాపార సంబంధాలు లేవని బాధితులు గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం నితిన్ గులాబానీ తన భార్య దివ్యా గులాబానీ, సోదరుడు విపిన్ గులాబానీ, వదిన హర్షా గులాబానీతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి సెల్‌ఫోన్లు స్విచ్చాఫ్ చేసి హైదరాబాద్ నుంచి పరారైనట్లు ఆరోపించారు.ఈ వ్యవహారంలో నితిన్ గులాబానీతో పాటు ఆయన భార్య దివ్యా గులాబానీ, సోదరుడు విపిన్ గులాబానీ, హర్షా గులాబానీ, ఉద్యోగులు హరీష్, ధన్‌రాజ్ పాత్రపై కూడా విచారణ చేపట్టిన సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## రాష్ట్రం కోసం జీవితాన్నే అంకితం చేసిన మహోన్నతుడు జయశంకర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ ఎంపిడిఓ కార్యాలయం ముందు ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి జెఎసి, ఉద్యమకారులతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కొత్తగా నిర్మిస్తున్న అమరవీరుల స్థూపాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సమాజం ఎన్నటికి మరువ లేదని ఉద్యమకారులు ప్రొఫెసర్ జయశంకర్ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్ అప్ప, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, కౌన్సిలర్ దిలీప్, పట్టణ కాంగ్రెస్ నల్లమోని శ్రీధర్, నేతలు మహ్మద్ ఇబ్రహీం, రఘునాయక్, బాలునాయక్, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, మసూద్‌ఖాన్, ఎలికట్ట శ్రీశైలం, రాజేష్ గౌడ్, లింగారెడ్డి గూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని ప్రతి పోలీసు అధికారి యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సిపి)డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. ఆదివారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సిపి కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. "యోగ ఫర్ వెల్నెస్, రీడినెస్ అండ్ రెసిలీన్స్ " అనే థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరు కాగా కూకట్‌పల్లి డిసిపి రితిరాజ్, హెడ్‌క్వార్టర్స్ డిసిపి సంజీవ్ తోపాటు సుమారు 250 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సిపి రమేష్ మాట్లాడుతూ యోగా అనేది భారతీయ నాగరికత ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమన్నారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు.





**షాద్‌నగర్:** ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు యోగా అమూల్యమైందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో యోగా దినోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అసనాలు చేశారు. యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని 16వ అదనపు జిల్లా , సెషన్స్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని కోర్డు సముదాయంలో హైకోర్టు ఆఫ్ స్టేట్ ఆఫ్ తెలంగాణ ఆదేశానుసారం మండల న్యాయ సేవాధికార సంస్థ షాద్‌నగర్ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కోర్టు సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ మల్యాల సాహితి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి, సూరం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓటుహక్కును ప్రాథమిక హక్కుగా మార్చాలి

## మోదీ, షా ఆదేశానుసారం ఇసి పనిచేస్తోంది : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా మార్చాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. 'సర్' ప్రక్రియ పేరుతో వివిధ రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో ఓటర్లను అణచివేయడం లేదా ఏకపక్షంగా అనర్హులుగా ప్రకటించడం వంటి వాటిని అడ్డుకోవడంలో ఈ చర్య ఉపయోగపడుతుందని పేర్కొంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు భారత ఎన్నికల సంఘం స్పష్టమైన పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు. ఈ తరుణంలో ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా మార్చాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దీని వల్ల ఆ హక్కుకు అత్యున్నత స్థాయి న్యాయ సమీక్ష, రక్షణ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌పై నడిచే హక్కును రాజ్యాంగం ప్రకారం ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు ధర్మాసనం (ఇద్దరు న్యాయమూర్తులు) గత శుక్రవారం ప్రకటించిందని రమేష్ గుర్తుచేశారు. సర్దార్ పటేల్ అధ్యక్షతన రాజ్యాంగ పరిషత్ 'ప్రాథమిక హక్కులు, మైనారిటీలు, గిరిజన/ప్రత్యేక ప్రాంతాల'పై ఒక సలహా సంఘాన్ని ఏర్పాటు చేసింది. 1947 ఏప్రిల్ 2122 తేదీల్లో జరిగిన సమావేశంలో ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా మార్చడంపై విస్తృత చర్చ జరిగిందని, డాక్టర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ దీనికి అనుకూలంగా గట్టిగా వాదించారని ఆయన గుర్తుచేశారు. అయితే, ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా మారిస్తే స్వదేశీ సంస్థానాలు భారత యూనియన్‌లో చేరడానికి వెనుకాడుతాయని, రాజ్యాంగంలో సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించడం సరిపోతుందని సర్దార్ పటేల్, సి. రాజగోపాలాచారి, మరికొందరు అభిప్రాయపడ్డారని రమేష్ తెలిపారు. 'సార్వత్రిక వయోజన ఓటు హక్కు అనేది అంతర్లీనంగా ఒక ప్రాథమిక హక్కు అని స్వయంగా సర్దార్ పటేల్ భావించారు. సార్వత్రిక వయోజన ఓటు హక్కు ఆధారంగా ఎన్నికలు జరగాలని నిర్దేశించే ఆర్టికల్ 326 వెనుక ఉన్న నేపథ్యం ఇదే అని ఆయన అన్నారు. 'సర్' ప్రక్రియ కింద వివిధ రాష్ట్రాల్లో భారీ సంఖ్యలో జరుగుతున్న ఓటర్ల అణచివేత లేదా ఏకపక్ష అనర్హతలకు వ్యతిరేకంగా రక్షణ కల్పించడంలో ఓటు ప్రాథమిక హక్కు అనేది ఒక శక్తివంతమైన ముందడుగు అవుతుందని, దీనివల్ల ఎన్నికల సంఘం పనితీరుపై సుప్రీంకోర్టు నిఘా కూడా పెరుగుతుందని రమేశ్ అన్నారు. గుర్తించబడిన ఫుట్‌పాత్‌పై నడిచే హక్కు ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో భారత ప్రజాస్వామ్యాన్ని దాని ప్రస్తుత మరణ వలయం నుండి కాపాడటానికి ఓటు హక్కు అత్యంత కీలకమైనది కాబట్టి, దానిని కూడా ప్రాథమిక హక్కుగా ప్రకటిస్తే ఎలా ఉంటుందని రమేశ్ ప్రశ్నించారు.

## భారత సంస్కృతి ఇచ్చిన

# అమూల్య బహుమతి యోగా

**• కోల్‌కతా–జబల్‌పూర్,ఢిల్లీ సహా దేశ,విదేశీవ్యాప్తంగా యోగా డే • రాష్ట్రపతి,ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి మోదీ యోగాసనాలు**

**కోల్‌కతా/జబల్‌పూర్:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హిమాలయాల నుండి హిందూమహా సముద్ర ప్రాంతం వరకూ ఆదివారం యోగాసన కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, గవర్నర్లు, ఉన్నతాధికారులు, భారీ సంఖ్యలో సాయుధబలగాలు, ప్రముఖులు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలలో యోగా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని యోగాసనాలు వేశారు. దేశంలోని త్రివిధ బలగాలకు ఉన్న మూడు ప్రధాన కేంద్ర కార్యస్థానాలలో,దేశ రాజధానిలో ఈ వార్షిక కార్యక్రమాన్ని సైనిక బలగాలు ఘనంగా నిర్వహించాయి. జాతీయస్థాయితోపాటు అంతర్జాతీయస్థాయిలో అనేక దేశాలలో ఈ కార్యక్రమాలు జరిగాయి. టోక్యోలోని చరిత్రాత్మకమైన ఆలయాలు మొదలుకొని మిలాన్‌లోని ఆర్కోడెల్లా పేస్ వరకూ ఈ యోగా డే జరిగింది. అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, జపాన్, బంగ్లాదేశ్, ఆస్ట్రియా, ఇండోనేసియా,తదితర దేశాలలోని ప్రముఖ నగరాలలో, భారత దౌత్యకార్యాలయాలలో వందలమందితో ఈ కార్యక్రమాలు జరిగాయి. ప్రపంచ ప్రజలకు భారతదేశ వారసత్వ సంస్కృతి అందించిన ఒక అమూల్యమైన బహుమతి యోగా అని ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అన్నారు. జబల్‌పూర్‌లో ద్రౌపదీముర్ము తెల్లటి సల్వార్–కుర్తా ధరించి నీలం రంగు చాపమీద కూర్చుని యోగాసనాలు వేశారు. ''మానవాళికి ఆరోగ్యకరమైన,సమతుల్యమైన,అర్థవంతమైన జీవన మార్గాన్ని అందించిన భారతదేశ మనోన్నతమైన వారసత్వ ఉత్సవాన్ని ఈరోజు మనం చేసుకుంటున్నాం'' అని రాష్ట్రపతి తన ప్రసంగంలో చెప్పారు. ఇది మన రుషులు,సాధువులు,తాత్వికులు వేల సంవత్సరాలుగా చేసిన కృషి ఫలితమని అన్నారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోల్‌కతా రెడ్ రోడ్‌లో 35,000 మంది ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. ఆసనాలు వేస్తున్న పౌరులను తిలకిస్తూ అటు ఇటూ తిరుగుతూ యోగా గురువులా కొద్దిసేపు పర్యవేక్షణ చేశారు. యోగాసనాలు వేస్తున్న పౌరుల భంగిమలను చక్కదిద్దారు. మోదీతోపాటు బెంగాల్ ముఖ్యమంత్రి సువేందుకు అధికారి కూడా యోగాసనాలు వేశారు. అదేసమయంలో ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ లధఖ్‌లోని స్పితుక్ బౌద్ధకేంద్రంలో ఉన్న ఆస్ట్రో టర్ఫ్ స్టేడియంలో ఎంతో ఉత్సాహంగా అందరితో కలిసి యోగాసనాలు వేశారు. హిమాలయ పర్వత సానువుతో నిండిన రమణీయ దృశ్యాలమధ్య ప్రశాంత వాతావరణంలో వందలమంది యోగాసనాలు వేశారు.



కాగా దేశ రాజధాని న్యూఢిల్లీలో విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ అసోం రాష్ట్రం గువహటి నగరంలోని బ్రహ్మపుత్ర నదీతీరంలో జరిగిన యోగా కార్యక్రమంలో యోగాసనాలు వేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కూడా పాల్గొన్నారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మేఘాలయ ఎగువ షిల్లాంగ్‌లోని భారత వైమానికదళానికి చెందిన అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్‌లో యోగాసనాలు వేశారు. అనేకమంది ప్రజలు ఆసనాలు వేశారు. కేవలం ఆరోగ్యకరమైన శరీరం కోసం మాత్రమేకాకుండా ఒక సమతుల్యమైన,క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని కొనసాగించడానికి యోగాసనాలు ఎంతో బాగా ఉపయోగపడతాయని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగా ఆదిత్యనాథ్ ఝాన్సీలోని ఝాన్సీ ఫోర్ట్ కాంప్లెక్స్‌లో యోగాసనాలు వేశారు. ఇంఫాల్,రాంచీ,గ్యాంగ్‌టక్,చండీగఢ్, విజయవాడ,ఇటానగర్,తిరువనంతపురం, చెన్నై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, ముంబై, భువనేశ్వర్, జైపూర్, తదితర నగరాలలో కూడా యోగా కార్యక్రమాలు జరిగాయి. ముంబై,హైదరాబాద్, నాగపూర్, అమరావతి సహా పలు నగరాలలో పలువురు మంత్రులు, ప్రముఖులు, సినీనటులు, విద్యావేత్తలు,జాతీయ పురస్కార గ్రహీతలు ఈ దినోత్సవంలో పాల్గొని యోగాసనాలు వేశారు. పలు సంస్థలు, ధ్యానమందిరాలు, ఆరోగ్యకేంద్రాలు, హెల్త్ క్లబ్బులు, ఉదయపు నడక సంఘాలు వేలాదిగా ఈ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేశాయి. యోగా గురువుగా దేశంలో ప్రసిద్ధి చెందిన రామ్‌దేవ్ బాబా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలిసి విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం ప్రాంగణంలో యోగాసనాలు వేశారు. భారతదేశ యోగా ఆరోగ్య వ్యాయామ విధానాన్ని మోదీ ప్రపంచవ్యాప్తంగా విస్తరించారని ఈ సందర్భంగా పలువురు నాయకులు ప్రశంసించారు. 2015లో యోగా దినోత్సవ కార్యక్రమం దేశంలో జూన్ 21న ప్రారంభమైంది. భారతదేశం చేసిన ప్రతిపాదనను ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ స్వీకరించి తీర్మానం చేయడంతో జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవంగా క్రమంగా ఇది పలు దేశాలకు విస్తరించింది.

# ప్రజాగ్రహానికి భయపడుతున్నారు!

**• కొందరు అసమ్మతి ఎంపిలు పార్టీతో సంప్రదింపులు • శివసేన (యుబిటి) నేత సంజయ్‌రౌత్**



**ముంబయి :** మహారాష్ట్రలోని శివసేన (యుబిటి)లో కొందరు లోక్‌సభ ఎంపిలు తిరుగుబాటు చేశారు. అయితే వారు తమ తమ నియోజకవర్గాల్లోని ప్రజల ఆగ్రహానికి భయపడి కొందరు అసమ్మతి ఎంపిలు పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నారని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ తెలిపారు. ఇద్దరు ఎంపిలతో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆదివారం రౌత్ విలేకరులతో తాము తప్పు చేశామని ఆ ఎంపిలు భావిస్తే వారితో చర్చలు జరపవచ్చని, ప్రస్తుతం ఇద్దరు ఎంపిలతో చర్చలు కొనసాగుతున్నాయన్నారు. కాగా, 'ఇప్పుడు ఏ వర్గమూ లేదు, ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని ఒకే ఒక్క శివసేన ఉంది' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను రౌత్ తీవ్రంగా తప్పుబట్టారు. శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరేను, మహారాష్ట్రను షా అవమానించారని ఆరోపించిన రౌత్, ప్రస్తుతం ఉద్ధవ్ థాక్రే నాయకత్వంలోనే ఒకే ఒక్క శివసేన ఉందని స్పష్టం చేశారు. మీరు శివసేన (యుబిటి)ను ఎంతగా అవమానిస్తే, రాష్ట్ర ప్రజలు అంతగా మీకు వ్యతిరేకంగా నిలబడతారని రౌత్ అన్నారు. సాంకేతికంగా తిరుగుబాటు ఎంపిలందరూ ఇంకా శివసేన (యుబిటి)తోనే ఉన్నారని, ఈ విషయంలో స్పీకర్ ఓం బిర్లా నుండి ఎటువంటి ఆదేశాలు రాలేదని ఆయన పేర్కొన్నారు. అలాగే షిండే నేతృత్వంలోని శివసేన కూడా వారు తమ పార్టీలో చేరుతున్నట్లు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదని తెలిపారు. పార్టీ సమావేశానికి హాజరుకాకపోవడం ద్వారా 'విప్'ను ఉల్లంఘించినప్పటికీ, ఆ ఆరుగురు ఎంపిలు శివసేన (యుబిటి)ను వదిలివేస్తున్నట్లు ఎక్కడా చెప్పలేదని రౌత్ పేర్కొన్నారు. అసమ్మతి ఎంపులు అయిన సంజయ్ దినా పాటిల్, సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ జాదవ్, భాసాహెబ్ వాక్‌చౌరే, నాగేశ్ పాటిల్‌అష్టికర్, ఓంప్రకాష్ రాజే నింబాల్కర్ 17న ఢిల్లీలో జరిగిన సేన (యుబిటి) పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరుకాలేదు. దీంతో వారు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరబోతున్నారనే ఊహాగానాలు బలపడ్డాయి.

**ప్రజలతో సంప్రదించిన తరువాతే నిర్ణయం : రాజే నింబాల్కర్**

ఇదిలా ఉండగా ఆరుగురు అసమ్మతి నేతలలో ఒకరు అయిన ఓంప్రకాష్ రాజే నింబాల్కర్ ఆదివారం నాడు మాట్లాడుతూ తన నియోజకవర్గ ప్రజలతో సంప్రదించిన తర్వాతే తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. పుణెలోని బనేర్ ప్రాంతంలో ఉన్న తన నివాసం వద్ద భారీ పోలీసు భద్రత మధ్య నింబాల్కర్ తన నియోజకవర్గమైన ఉస్మానాబాద్ (ధారాశివ్)కు బయలుదేరారు. ఆయనకు 'వైప్లస్' భద్రతతో ధారాశివ్‌కు రక్షణ కల్పించారు. ఈ సందర్భంగా నింబాల్కర్ మీడియాతో మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని గోవర్ధన్‌వాడిలో ప్రజలు, పార్టీ కార్యకర్తలతో సమావేశమై రాజకీయ వైఖరిని స్పష్టం చేస్తానని, ప్రజలతో మాట్లాడిన తర్వాత, భవిష్యత్తు రాజకీయ దిశను స్పష్టంగా వివరిస్తాను అన్నారు.

## ప్రపంచ అనిశ్చితుల మధ్య...

# ఆర్థిక పరిస్థితులపై పార్లమెంటరీ కమిటీ అధ్యయనం



**న్యూఢిల్లీ :** సుంకాలకు సంబంధించిన వివాదాలు, భౌగోళిక–రాజకీయ అనిశ్చితులు, దేశీయ వృద్ధిపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో దేశ ఆర్థిక పరిస్థితులలో వస్తున్న మార్పులను పరిశీలించాలని ఒక కీలక పార్లమెంటరీ ప్యానెల్ నిర్ణయించింది.లోక్‌సభ బులెటిన్ ప్రకారం, స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ 'భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక పరిస్థితులు' అనే అదనపు అంశాన్ని 2025–26 సంవత్సరంలో వివరణాత్మక పరిశీలన కోసం ఎంచుకుంది. పార్లమెంటరీ ప్యానల్‌లు ఏర్పడిన వెంటనే తమ అంశాలను ఎంచుకుంటాయి కానీ అభివృద్ధి చెందుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అదనపు అంశాలను ఎంచుకోవడానికి వారికి స్వేచ్ఛ ఉంది. భారత ఆర్థిక వ్యవస్థ 2025–26 (ఏప్రిల్–మార్చి) నాటికి 7.7 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది. జనవరి–మార్చి త్రైమాసికంలో ఇది 7.8శాతం బలమైన వృద్ధిని నమోదు చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ జిడిపి 7.1శాతం వృద్ధి చెందింది. అయితే, పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధి 6.6 శాతానికి మందగిస్తున్నదని ఆర్‌బిఐ అంచనా వేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఎరువులు, ఇంధనంపై సంఘర్షణలు కొనసాగుతున్నాయి. భారతదేశం క్రూడ్ ఆయిల్, ముడి ఎరువు రెండింటికీ ముఖ్యమైన నికర దిగుమతిదారు. కమిటీ తన పరిశీలన సిఫార్సులను కలిగి ఉన్న నివేదికను ఖరారు చేసే ముందు, ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ), ఆర్థికవేత్తలు, ఇతర వాటాదారుల నుంచి అభిప్రాయాలను కోరే అవకాశం ఉంది. ఈ పరీక్షలో ఆర్థికవృద్ధి, ద్రవ్యోల్బణం, ఉపాధి, పెట్టుబడి పోకడలు, నిర్వహణ, బ్యాంకింగ్, ఆర్థిక నిర్వహణ, బ్యాంకింగ్ రంగ పరిణామాలు, వాణిజ్యం, భారత దేశంలోని పరిణామాలు వంటి అంశాలు ఉంటాయని భావిస్తున్నారు. భౌగోళిక , రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా గొలుసులో అంతరాయాలు, వాణిజ్య అనిశ్చితులు, వస్తువుల ధరలలో హెచ్చుతగ్గుల వలన తలెత్తుతున్న సవాళ్లను భారతదేశం ఎదుర్కొంటున్న తరుణంలో అధిక ఆర్థిక వృద్ధిని కొనసాగించడానికి ప్రయత్నించినప్పుడు ఈ కమిటీ అధ్యయనం ప్రాముఖ్యతను సంతరించుకుంది.భర్తృహరి మహతాని అధ్యక్షతన 2026–27 కాలానికి ఫైనాన్స్‌పై ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాలు, ప్రణాళిక (నీతి ఆయోగ్), గణాంకాలతో సహా పలు మంత్రిత్వ శాఖల పరిధిలోని అంశాలను ఎంపిక చేసింది.

## సమ్మెలో ఉన్నా నీట్ పరీక్ష కోసం

# 'బెస్ట్' 180 ప్రత్యేక బస్సులు



**ముంబయి:** ముబంయిలో 'బృహన్ ముంబయి ఎలక్ట్రిక్ సప్లయ్ అండ్ ట్రాన్స్‌పోర్టు (బెస్ట్) సంస్థకు చెందిన ఉద్యోగులు గత మూడు రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారు. అయితే ఆదివారం నాడు ఎన్‌టిఎ నిర్వహించిన నీట్ యుజి పునఃపరీక్షకు హాజరయ్యే విద్యార్థుల ప్రయాణ సౌలభ్యం కోసం బెస్ట్ ఆదివారం ప్రత్యేక బస్సు సేవలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా రోజులో దాదాపు 180 బస్సు ట్రిప్పులను నడపనున్నట్లు తెలిపింది. శుక్రవారం నుండి ఉద్యోగులు సమ్మెలో ఉన్నప్పటికీ, ముంబయిలోని 63 పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థుల కోసం ఈ ప్రత్యేక సేవలను ఏర్పాటు చేసినట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ఒక ప్రకటనలో పేర్కొంది. నగరవ్యాప్తంగా ఉన్న పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సులభంగా చేరుకునేలా చూసేందుకు, బెస్ట్ సంస్థ 24 మార్గాల్లో 60 బస్సులను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. కుర్లా, దాదర్, మలాడ్, ములు ఒడ్ వంటి కీలక ప్రాంతాల నుండి వివిధ పరీక్షా కేంద్రాలకు నేరుగా బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపింది.

# మోదీ–ట్రంప్ దొందూ దొందే

**• ఈయన దేశాన్ని, ఆయన ప్రపంచాన్ని నాశనం చేస్తున్నారు: ఖర్గే విమర్శ**

**బెంగళూరు:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్–భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'దొందూ దొందే' అని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ట్రంప్ ప్రపంచాన్ని నాశనం చేస్తుంటే, మోదీ దేశాన్ని నాశనం చేస్తున్నారని, ''తామిద్దరం మంచి స్నేహితులం'' అని వారిద్దరూ చెప్పుకుని తిరుగుతూ ఉంటారని విమర్శించారు. ఈ ఇద్దరు నాయకులు వారి వారి దేశాలకు చెడ్డపేరు తీసుకువస్తున్నారని విమర్శించారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడుగా బి.కె.హరిప్రసాద్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం జరిగిన భారీ కార్యక్రమంలో ఖర్గే మాట్లాడుతూ, ఏదో ఒకరోజు మోదీ ప్రభుత్వం కుప్పకూలిపోతుందని అన్నారు. వారు (ఎన్‌డిఎ ప్రభుత్వం) ఏదీ సక్రమంగా చేయడంలేదన్నారు. ట్రంప్ చమురు ధరలను విపరీతంగా పెంచేశారని ఆరోపిస్తూ, నెహ్రూ పాలనాకాలం నుండి భారతదేశం అలీన విధానాన్ని అనుసరించందని, అన్ని దేశాలతోనూ సత్సంబంధాలను కొనసాగించిందని, కానీ ఈనాడు ఈ విధానాలకు మోదీ ప్రభుత్వం స్వస్తి చెప్పిందని విమర్శించారు. ప్రతి ఒక్కరూ తన స్నేహితులే అని మోదీ చెబుతుంటారని, వాళ్ళందరినీ కౌగలించుకుంటూ ఉంటారని, ఇదే మనదేశాన్ని ఈ స్థితికి దిగజార్చిందంటూ బిజెపిపై తీవ్ర విమర్శలు,ఆరోపణలు చేశారు. అయోధ్య రామాలయ ట్రస్టు నిధులను బిజెపి నాయకులు కొల్లగొట్టారన్న ఆరోపణలు ప్రస్తావిస్తూ, మతం పేరుతో వారు దోపిడీ చేశారన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో మోదీ ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని కూడా ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయాలని అడుగుతున్నారన్నారు. దేశంలో ద్రవ్యోల్బణం,నిరుద్యోగాన్ని కూడా ప్రస్తావించారు. మోదీ ప్రభుత్వంపై మండిపడ్డారు. కొంతమంది చేతుల్లోనే అధికారాన్ని కేంద్రీకరించి ఈ ప్రభుత్వం పేదలను విస్మరించిందన్నారు. ''మనం కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలుగా ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి, ఏ ప్రభుత్వం వల్ల ఈ దేశం,ప్రజలు ప్రయోజనం పొందారనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి, ప్రజలకు మనం ఈ విషయం చెప్పాలి, ప్రజల దగ్గరకు వెళ్ళాలి, దేశంలో జరుగుతున్న పరిణామాలను వారికి అర్థమయ్యేట్టుగా వివరించాలి'' అని హితవు చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయాలని, పార్టీ మౌలిక సిద్ధాంతం, మౌలిక విలువలతో రాజీపడకుండా పార్టీని పటిష్ట పరచాలని కోరారు. ఎల్.కె.అద్వానీ రథ్‌యాత్ర తర్వాత అయోధ్యలో రామాలయ నిర్మాణంకోసం వసూలు చేసిన విరాణాలు,ఇతర వస్తువులన్నింటినీ సద్వినియోగం చేయలేదని, వాటికి జవాబు దారీ లేదని, వాటికి సరైన లెక్కలు లేకుండాపోయాయని,ఈ ఆలయానకి సంబంధించిన ఆర్థిక అవకతవకలకు సంబంధించిన నివేదికలు లేవని అన్నారు. దాదాపు రూ.5000 కోట్ల మేరకు దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలు వస్తున్నాయని, పూజారులు డబ్బు దోచుకున్నారన్నారు. రామ నామ జపం చేస్తూ ఆస్తులను తమ సొంతం చేసుకున్నారని విమర్శించారు. రాముడి పేరుతో పెద్ద దోపిడీ జరిగిందన్నారు. కోట్లాదిరూపాయలను దోచుకోవడంకోసమే ఆలయ నిర్మాణం చేశారని విమర్శించారు. ఈ విరాళాలన్నీ వేరే చోటకు తరలి వెళ్ళాయన్నారు. ఈ విషయంలో దర్యాప్తు చేయాలని, బిజెపివారే ఇదంతా చేశారా? ఇంకెవరైనా ఉన్నారా? అనే విషయాలను దర్యాప్తులో తేల్చాలని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యను డిమాండ్ చేశారు. సిట్ దర్యాప్తు పూర్తి చేయడానికి 15 రోజులు గడువు ఇవ్వాలని ప్రజలకు ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తిని ప్రస్తావిస్తూ, సాక్షాత్తూ ఆ దేవుడే మీ వెంట ఉన్నప్పుడు మీకు 15 రోజులు గడువు ఎందుకని ప్రశ్నించారు. మోదీ మీతో ఉన్నారు, మీరే ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రికదా,రాముడిపేరుతో దోచుకున్నవాళ్ళని జైల్లో పెట్టండి అని కోరారు. నీట్ పరీక్షల చుట్టూ ఉన్న వివాదాన్ని ప్రస్తావిస్తూ, నిర్వహణాలోపాలు ఈ ప్రకియ విశ్వసనీయతను దెబ్బతీశాయని, మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలని అన్నారు. వారు పరీక్షలు నిర్వహించలేరు, విద్యార్థులు,తల్లిదండ్రులకు బిజెపి,మంత్రి ప్రధాన్ ద్రోహం చేశారు, ఆయన రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు. ఇక కర్ణాటకలో సిఇటి నమూనా పరీక్ష,పియుసిని కూడా నీట్‌తో సమానంగా పరిగణించాలని, విద్యార్థులకు ఈ పరీక్ష ఎంతో భరోసా ఇచ్చిందన్నారు.

## యూనివర్సిటీలు, విద్యాసంస్థలు ఆధునికత సహా...

# భారతదేశ సంస్కృతీ, సంప్రదాయాలను పెంపొందించాలి

**• రాష్ట్రపతి ద్రౌపది ముర్ము • రాణి దుర్గావతి విశ్వవిద్యాలయ 36వ స్నాతకోత్సవంలో కీలక ఉపన్యాసం**

**జబల్‌పూర్ (మధ్యప్రదేశ్) :** ఆధునికతతోపాటు విద్యార్థులలో భారతీయ సంస్కృతిని, సంప్రదాయ స్ఫూర్తిని పెంపొందించాల్సిన ఆవశ్యకత విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలపై ఎంతైనా ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కిచెప్పారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన రాణి దుర్గావతి విశ్వ విద్యాలయ (ఆర్‌డివివి) 36వ స్నాతకోత్సవంలో ఆమె ప్రసంగించారు. విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు విద్యార్థులలో ఆధునికతతోపాటు, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కూడా పెంపొందించాలని, అంతేకాకుండా గిరిజనవర్గాలలో నైపుణ్యాలు, జ్ఞానాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు. ఆధునికత, సంప్రదాయాల సమన్వయంతో మాత్రమే దేశ సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ గుర్తింపు, సంప్రదాయాల పవిత్రతను కాపాడుకోవాలని ఆమె యువతకు పిలుపునిచ్చారు. ఈ విశ్వవిద్యాలయానికి పెట్టిన పేరు రాణిదుర్గావతి ఏదైతే ఉందో ఆమె త్యాగం, కృషి, అంకితభావానికి ప్రతీక అన్నారు. రాణి దుర్గావతిని గోండ్వానా సామ్రాజ్య గొప్ప పాలకురాలిగా గుర్తించాలి అని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. మహిళా సాధికారతకు రాణి దుర్గావతి స్ఫూర్తిదాయకంగా నిలిచారని రాష్ట్రపతి పేర్కొన్నారు. అభివృద్ధి పరుగులో వెనకబడిన వారిని ముందుకు తీసుకొచ్చి, వారిని ప్రధాన స్రవంతిలో ఏకీకృతం చేయడం చాలా ముఖ్యమని, మన విద్యార్థులు,యువత ఆధునిక అభివృద్ధిలో పాల్గొనే అవకాశం పొందేలా మనందరం కలిసి పనిచేయాలని ముర్ము పిలుపునిచ్చారు. స్నాతకోత్సవంలో స్వర్ణపతకాలు అందుకున్న వారిలో అధిక సంఖ్యలో మహిళలు ఉండటంపట్ల రాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. ఆమె దీనిని దేశం సర్వతోముఖాభివృద్ధికి చిహ్నం అని అభివర్ణించారు.భారతదేశం యువత దేశమని, జనాభాలో 65శాతం యువతే ఉన్నారని రాష్ట్రపతి చెప్పారు. ఈ యువతకు ఏదైనా సాధించగలిగే అకుంఠిత ధైర్యంఉందన్నారు. దేశం, వారి పౌరులు యువతపై గొప్ప అంచనాలను కలిగి ఉన్నారని ముర్ము నొక్కిచెప్పారు. భారతదేశ భవిష్యత్తు యువత భుజాలపై ఉందని, వారే దేశ భవిష్యత్తు రూపశిల్పులు అని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అభివర్ణించారు. సమాజ శ్రేయస్సు, సౌభాగ్యం కోసం మీ విద్యను, ప్రతిభను వినియోగించాలని ఆమె యువతకు పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్, ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కూడా స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రసంగించారు.

# అయోధ్యను విడిచివెళ్లొద్దు

**రామాలయ ట్రస్ట్ నిర్వాహకులు, ఆలయ సిబ్బందికి సిట్ ఆదేశం**

**అయోధ్య :** అయోధ్య రామమందిరానికి సంబంధి ంచిన నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ప్ర త్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు జరుపుతో ంది. ఈ నేపథ్యంలోనే ఆలయ ట్రస్ట్ నిర్వాహకు లు, ఆలయ సిబ్బందిని అయోధ్యను విడిచి వెళ్లవద్దని ఆదేశించినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఆ దివారం లక్నోకు బయలుదేరే ముందు ముగ్గురు సభ్యుల గల సిట్ ఈ ఆదేశాలను జారీ చేసింది. ఆ లయ వర్గాల సమాచారం ప్రకారం ట్రస్ట్ అధికారు లు, దర్యాప్తుతో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల వి చారణకు సంబంధించిన వివరాలతో కూడిన రో జువారీ నివేదికలు డిజిటల్ రూపంలో భద్రపరచబడ్డాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌కు సమర్పించే ముందు ఈ నివేదికకు తుది రూపు ఇ వ్వనున్నారు. అదే సమయంలో, తాము సేకరించి న వివరాలకు సంబంధించిన నివేదికలను సిట్ ప్ర తిరోజూ ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపుతో ందని వారు తెలిపారు. సిట్ దర్యాప్తు కేవలం నిధు ల దుర్వినియోగం ఆరోపణలకే పరిమితం కాకుం డా, ఆలయ ట్రస్ట్ వివిధ దశల్లో చేపట్టిన భూ కొనుగోళ్లు, ఆలయ నిర్మాణ సామాగ్రి సేకరణ అంశాల ను కూడా పరిశీలించిందని ఆ వర్గాలు పేర్కొన్నా యి. ఆలయ ట్రస్ట్ మార్కెట్ ధరల కంటే ఎక్కువ ధ రకు భూమిని కొనుగోలు చేసిందనే ఆరోపణలు వ చ్చాయి. సమాజ్‌వాదీ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీతో స హా వివిధ రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని గట్టిగా లేవనెత్తాయి. అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు రావడం తో ఆలయ ట్రస్ట్ అభ్యర్థన మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈనెల 13న సిట్ ఏర్పాటు చేసింది. వి రాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై జ రుగుతున్న సిట్ దర్యాప్తుకు, రామ మందిరంలో ఏ ర్పాటు చేసిన సిసిటివి కెమెరాల నుండి లభించిన పరిమిత కాలపు ఫుటేజ్ అడ్డంకిగా మారింది. వ ర్గాల సమాచారం ప్రకారం, ఈ కెమెరాల ఫుటేజ్ కేవలం 45 రోజులు మాత్రమే అందుబాటులో ఉం టుంది, ఆ తర్వాత అది వాటంతట అవే తొలగిపో తా యి. ఫుటేజీను తారుమారు చేసినట్లు ఆధారా లు కూడా దర్యాప్తు అధికారులు కనుగొన్నారని, తొలగించిన లేదా మార్చిన డేటాను తిరిగి పొందేందు కు ప్రయత్నిస్తున్నారని వర్గాలు తెలిపాయి. ఫోరెన్సిక్ విశ్లేషణ ద్వారా వీలైనంత పాత ఫుటేజీను తిరిగి పొందేందుకు సిట్ ప్రయత్నిస్తుందని ఓ వర్గం తెలిపింది.

# ఏడుగురు నక్సల్స్ అరెస్టు



**ఖుంటి :** జార్ఖండ్‌లోని ఖుంటీ జిల్లాలో ఆదివారం ఏడుగురు నక్సలైట్లను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో నిషేధిత సంస్థ పిఎల్‌ఎఫ్‌ఐ (పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా)కు చెందిన ఏరియా కమాండర్ కూడా ఉన్నారు. దాచి ఉంచిన ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని బయటకు తీస్తానని చెప్పి పోలీసులను అడవిలోకి తీసుకెళ్లిన పిఎల్‌ఎఫ్‌ఐ ఏరియా కమాండర్ శ్రవణ్ దాస్, అక్కడ ఒక అధికారి నుంచి తుపాకీని లాక్కొని పోలీసులపై కాల్పులు జరిపాడు. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో అతను గాయపడ్డాడు. అనంతరం అతన్ని చికిత్స కోసం రాంచీలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఎదురుకాల్పులు తెల్లవారుజామున జరియగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిల్మి అటవీ ప్రాంతంలో జరిగాయి. పక్కా సమాచారం మేరకు, శనివారం రాత్రి జరియగఢ్ ప్రాంతంలో దాస్, అతని అనుచరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. 'విచారణ సమయంలో, అడవిలో మరిన్ని ఆయుధాలను దాచి ఉంచినట్లు దాస్ చెప్పాడు. దాంతో పోలీసులు అతన్ని అక్కడికి తీసుకెళ్లారు. అకస్మాత్తుగా, అతను ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్ నుంచి పిస్టల్‌ను లాక్కొని పోలీసులపై కాల్పులు జరిపాడు. పోలీసులు ఎదురుకాల్పులు జరపడంతో అతనికి బుల్లెట్ గాయమైందని ఖుంటీ ఎస్పీ రిషభ్ గార్గ్ పిటిఐకి తెలిపారు. కాల్పులు, నిప్పుపెట్టడం, బలవంతపు వసూళ్లకు పాల్పడుతూ జిల్లాలో భయాందోళనలు సృష్టిస్తున్న ఈ ఏడుగురు నక్సలైట్లను అరెస్టు చేశామని, ఇప్పటివరకు వారి వద్ద నుంచి నాలుగు తుపాకులు, సుమారు 30 తూటాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# తీవ్ర ఒత్తిడిలో స్టార్‌మర్ : నేడు రాజీనామా ప్రకటన!

## సహజ రాజకీయ ప్రతిభగల నేతగా తెరమీదకు బర్న్‌హాం

**లండన్:** బ్రిటన్ ప్రధానమంత్రి సర్ కీర్ స్టార్‌మర్ సోమవారం (జూన్22) రాజీనామా ప్రకటనకు సిద్ధపడుతున్నారు. దీంతో కేవలం పదేళ్ళ అతి తక్కువ రాజకీయ కాలంలో ఏడవ ప్రధానమంత్రిని చూడవలసిన దయనీయ పరిస్థితి బ్రిటన్ ప్రజలకు ఎదురవుతోంది. అంతర్జాతీయ మీడియా కథనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. లేబర్ పార్టీలో ఆండీ బర్న్‌హాం సహజసిద్ధమైన రాజకీయ ప్రతిభగల నాయకుడుగా, స్టార్‌మర్ ప్రత్యర్థిగా తెరమీదకు వచ్చారు.

అసమర్థతకు, పరాజయాలకు మారుపేరుగా ముద్రపడిన స్టార్‌మర్‌ను వ్యతిరేకించే ఎంపీలసంఖ్య అధికార లేబర్‌పార్టీలోనే గణనీయంగా పెరిగింది. ఈ ఒత్తిడి భరించలేక ఆయన దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. గార్డియన్ పత్రిక కథనం ప్రకారం, ఆయన ప్రత్యర్థిగా ఎదిగిన బర్న్‌హాంకు మద్దతు ఇచ్చే ఎంపీల సంఖ్య దాదాపు 300కు చేరింది.కానీ స్టార్‌మర్ మాత్రం, బలమైన ప్రజాతీర్పుతో తాను అధికారంలోకి వచ్చానని, రాజీనామా ప్రసక్తే లేదని, బర్న్‌హాంను పోటీలో ఎదుర్కొంటానని ఇరవైనాల్గ్గంటల క్రితం ధీమాగా చెప్పారు.

వ్యతిరేకత చేయిదాటడం, బర్న్‌హాం సునాయాసంగా గెలిచే అవకాశాలు సుస్పష్టంగా కనిపించడం, తమ నాయకుడు (స్టార్‌మర్) తనకుతాను అవమానాలకు గురికావడం ఇష్టంలేదని, ఆయన సగౌరవంగా వైదొలగడం మంచిదని మిత్రులు, అభిమానులు సహా వ్యతిరేకత ఉన్నవారు కూడా అభిప్రాయపడుతున్న దశలో ఈ వార్త వెలువడింది. నిన్నమొన్నటివరకూ స్టార్‌మర్ కొమ్ము కాసిన మిత్రులు కూడా గ్రేటర్ మాంచెస్టర్ పరిణామం తర్వాత ఆయన నిష్క్రమణ తథ్యమని భావిస్తున్నారు.

2024లో అత్యంత జనాదరణతో భారీ అంచనాలమధ్య మంచి మెజారిటీతో స్టార్‌మర్ నాయకత్వాన లేబర్‌పార్టీ అధికార పగ్గాలు చేపట్టింది. రెండేళ్ళ తక్కువ వ్యవధిలోనే స్టార్‌మర్ ఓటర్లను ఆకట్టుకునే శక్తిని కోల్పోయారన్న అపప్రథను పార్టీలో మూటగట్టుకున్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాదంలో నిందితుడు లార్డ్ మాండెల్సన్‌ను అమెరికాలో బ్రిటన్ తరపు రాయబారిగా నియమించడం ఆయనను వెనకేసుకురావడం దగ్గర నుండి 2025–2026 స్థానిక ఎన్నికల్లో ఓటమి తర్వాత వేల్స్‌లో 27 సంవత్సరాలుగా లేబర్‌పార్టీకి ఉన్న ఆధిపత్యాన్ని ఎన్నికల ఓటమితో కోల్పోవడంతో స్టార్‌మర్‌ను అందరూ ''సర్వనాశనంచేసిన'' నాయకుడుగా చూస్తున్నారు. ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్, వేల్స్‌తోపాటు ఆయన హయాంలో రిఫామ్ పార్టీ 1400 కౌన్సిల్‌ను కూడా చేజిక్కించుకుని లేబర్ పార్టీకి అతిపెద్ద ముప్పుగా మారింది. ఓడించడం అసాధ్యం అనుకున్న రిఫామ్ పార్టీకి చెందిన పచ్ఛిమితవాద అభ్యర్థి నైజెల్ ఫారెజ్‌ను మేకర్‌ఫీల్డ్ ఉప ఎన్నికలో ఓ డించి విలువైన ప్రతిభ చూపించడంతో బర్న్‌హాంపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి.



గ్రేటర్ మాంఛెస్టర్ మేయర్‌గా పరిపాలనలో తన సమర్థతను నిరూపించుకుని జనాదరణ పొందిన, లేబర్‌పార్టీ పోలింగ్ పర్సంటేజీని ప్రత్యేక ఎన్నికల్లో పదిశాతం మేరకు పెంచిన, చురుకైన నాయకుడుగా పేరొందిన ఆండీ బర్న్‌హామ్ ఎంపీగా ప్రత్యేక ఎన్నికల్లో గెలిచీ గెలవగానే స్టార్‌మర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. సోమవారంనా డు బర్న్‌హామ్ బ్రిటన్ దిగువసభలో ప్రమాణ స్వీకారం చేయడానికి సిద్ధపడుతుండగా, అదేసమయంలో స్టార్‌మర్ రాజీనామా వార్తలు వచ్చాయి.

ఐతే ప్రత్యేక ఎన్నికల్లో కేవలం 77,000 మంది ఓటర్ల సమూహం ఓటర్లతో గెలిసాధించినంత మాత్రాన ఒక నియోజకవర్గ ప్రభావాన్ని అంచనావేసి యావత్ దేశ బాధ్యతలను ఆండీ బర్న్‌హాం చేతుల్లో ఎలా పెడతారని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఆయన హయాంలో కూడా లేబర్‌పార్టీ తన దుస్థితిని మెరుగుపరచుకోలేకపోతే, అప్పుడు కూడా ఇదేవిధంగా ఒక ఉప ఎన్నిక తీర్పు వస్తే పార్టీ నేతలు ఇదేవిధంగా ఆలోచిస్తారా? అని కూడా పార్టీ వర్గాల్లో చర్చ మొదలైనట్లు బ్రిటన్ ప్రధాన స్రవంతి మీడియా ప్రత్యేక కథనం ప్రచురించింది. బర్న్‌హాం శక్తిసామర్థ్యాలను కఠిన పరీక్షకు గురిచేసేందుకు పార్టీ మరోమార్గాన్ని ఎంచుకోవాలని విశ్లేషకులు అంటున్నారు. ఉప ఎన్నిక జరిగిన ఇరవై నిమిషాల్లోనే తొందరపడి ఎలా నిర్ణయం తీసుకుంటారని స్టార్‌మర్ మిత్రులు ప్రశ్నిస్తున్నారు.

## కొలంబియా రన్నాఫ్ పోలింగ్‌లో ట్రంప్ అభ్యర్థి–లెఫ్ట్ మధ్య హోరాహోరీ



**బోగోటా:** దక్షిణ అమెరికా దేశం కొలంబియాలో అధ్యక్ష పదవికి తుది విడత ఎన్నికల పోలింగ్ (రన్నాఫ్ ఎన్నిక) తీవ్ర ఉద్రిక్తత మధ్య జరిగింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా 12,500 మంది పోలీసు, భద్రతా సిబ్బందిని మోహరించారు. వామపక్షాల ఆధిపత్యంగ ల కొలంబియాలో అధ్యక్షుడు గుస్తావో పెట్రో మరోసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజ్యాంగపరంగా అనుమతి లేకపోవడంతో పార్టీ అభ్యర్థిగా ఇవాన్ సెపెడా పోటీలో ఉన్నారు. ఎల్‌టైగ్రే లేదా ద టైగర్‌గా మరో పేరుతో ప్రసిద్ధి చెందిన మితవాద పార్టీకి చెందిన ప్రత్యర్థి అబెలార్డో డిలా ఎస్ప్రియెల్లా సెపెడాను ఈ ఎన్నికల్లో సవాలు చేశారు. తుది విడత ఎన్నికల్లో తలపడిన ఈ మితవాద అభ్యర్థికి ట్రంప్ ఆశీర్వాదాలు ఉన్నాయి. కొలంబియాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేర ముఠాలు ప్రజల మనుగడకు పెద్ద బెడదగా మారింది. కమ్యూనిస్టునేత గుస్తావో పెట్రో చర్చల ద్వారా వారిని అదుపులో ఉంచారు. ఇప్పుడు ట్రంప్ మద్దతుదారుడైన అబెలార్డో కొలంబియా నుండి ఈ ముఠాలను తరిమి కొడతామని ప్రజలకు వాగ్దానం చేశారు. మే 31న కొలంబియాలో మొదటి విడత ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎవరికీ పూర్తిస్థాయి మెజారిటీ రాలేదు. దీంతో మొదటి రెండు స్థానాల్లో ఉన్న ఇవాన్ సెపెడా–అబెలార్డో మధ్య తుదిపోరులో భాగంగా ఆదివారం పోలింగ్ పూర్తయింది. మొదటి రౌండ్‌లో ట్రంప్ మద్దతు ఉన్న అభ్యర్థికి 43 శాతం పైగా ఓట్లు, సెపెడాకు 40 శాతం పైగా ఓట్లు వచ్చాయి.

## మద్దతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ జంతర్ మంతర్ వద్ద తమ ధర్నాను కొనసాగించారు. ప్రజలందరూ జంతర్ మంతర్‌కు చేరుకోవాలని సిజెపి వ్యవస్థాపకుడు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా నీట్ రీఎగ్జామ్ అభ్యర్థులు తమ పరీక్ష పూర్తయిన తర్వాత ఆందోళనలో చేరాలని కోరారు. 'మేము ఇక్కడే ఉండి పోరాడుతున్నాము, కానీ మీ మద్దతు లేకుండా ఈ ఉద్యమం విజయవంతం కాదు' అని ఆదివారం జరిగే నిరసనలో పాల్గొనాలని ప్రజలను కోరుతూ దీప్కే అన్నారు. రైతు సంఘం మద్దతు కోరుతూ, 'భారతదేశం నలుమూలల నుండి రైతులు జంతర్ మంతర్ వద్దకు వచ్చి విద్యార్థులకు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని ఆయన అన్నారు. రైతులు తమ హక్కుల కోసం పోరాడుతున్నప్పుడు, విద్యార్థులు వారికి భుజం భుజం కలిపి నిలబడ్డారు, ఇప్పుడు విద్యార్థులకు కూడా అదే సంఘీభావం అవసరం అని ఆయన అన్నారు. అంతకుముందు, 'ఎక్స్'లో వరుస పోస్టులలో నిరసనకారులు ఎలాంటి తప్పు చేయడం లేదని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు న్యాయం మాత్రమే కోరుతున్నారని పేర్కొంటూ, జంతర్ మంతర్‌కు ప్రజలను రాకుండా ఆపవద్దని దీప్కే పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ప్రదర్శనకు అనుమతి ఉందని పేర్కొంటూ, దీప్కే, నిరసనకారులను ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయాలని ఢిల్లీ పోలీసులు శనివారం రాత్రి ఆదేశించారు. అనుమతించిన సమయానికి మించి కొనసాగించడం అనుమతి షరతులను ఉల్లంఘించడమేనని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. రాత్రి గడిచేకొద్దీ, దీప్కే, నిరసనకారులు అక్కడే ఉండిపోయారు, దీంతో ఆ ప్రదర్శన రాత్రంతా కొనసాగే ధర్నాగా మారింది. నిరసనకారులు ప్రధాన్ రాజీనామా కోరుతూ నినాదాలు చేస్తూనే ఉన్నారు. కొంతమంది నిరసనకారులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. దీంతో జంతర్ మంతర్ వద్ద వాతావరణం ఉద్రిక్తంగా కొనసాగింది. నిరసన శాంతియుతంగా కొనసాగుతుందని దీప్కే చెప్పారు. జవాబుదారీతనం నిర్ధారించి, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేస్తే చర్చలకు మార్గం తెరిచే ఉంటుందని చెబుతూ, కేంద్రంతో సంప్రదింపులు జరపాలని తన విజ్ఞప్తిని పునరుద్ఘాటించారు. భారీ పోలీసు బందోబస్తు, సిసిటివి నిఘా, బారికేడ్లు, బాడీ కెమెరాలు ధరించిన భద్రతా సిబ్బంది సమక్షంలో శనివారం మధ్యాహ్నం ఈ నిరసన ప్రారంభమైంది. 'థాలి, చమాచ్' తీసుకురమ్మన్న దీప్కే పిలుపు మేరకు వందలాది మంది మద్దతుదారులు, వారిలో అధిక శాతం యువకులు, జంతర్ మంతర్ వద్ద గుమిగూడి, ప్రధాన్ రాజీనామా కోరుతూ నినాదాలు చేస్తూ పళ్ళాలు, చెంచాలు కొట్టారు.

# అల్–జజీరా జర్నలిస్టు సహా 10 మంది మృతి

**●జర్నలిస్టులపై ఉగ్రవాద నిందలకు అల్–జజీరా ఖండన ●వాస్తవ వార్తా కథనాలను ప్రపంచం దృష్టికి తెస్తామని ప్రతిజ్ఞ ●హమాస్ మనీ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశాం: ఐడిఎఫ్**

**గాజాస్ట్రిప్:** గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో అల్–జజీరా కెమేరామన్ అహ్మద్ విషాహ్ హతుడయ్యాడు. ఆయనతో పాటు మరో ఐదుగురు కూడా ఇజ్రాయెల్ ఐ.డి.ఎఫ్ చేసిన గగనతల దాడుల్లో అక్కడికక్కడే మరణించారు. శనివారం దాడుల తర్వాత ఆదివారంనాటి కి మృతుల సంఖ్య 10 కి పెరిగింది. సెంట్రల్ గాజాలో నిబురైజ్ శరణార్థ శిబిరంలో ఉన్న ఒక ఇంటిపై ఇజ్రాయెల్ గగనతల దాడులు చేయడంతో జర్నలిస్టు అ హ్మద్ విషామ్ మరణించారు. క్షేత్రస్థాయిలో ఆయన కెమరామెన్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. మరణించినవారిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలు సహా నలుగురు ఉన్నారు. గాజా నగరం ఉత్తరాన జరిగిన దాడిలో ఒకరు మరణించగా, ఉత్తర బీట్ లహియా ప్రాంతంలో ఐడిఎఫ్ కాల్పుల్లో మరో మహిళ మరణించింది. షేక్ రద్వాన్, పశ్చిమ ఖాన్ యూనస్ ప్రాంతాలలో కూడా మరణాలు సంభవించాయి.

అల్ జజీర ముబాషర్ కరస్పాండెంట్‌ను ఉద్దేశపూర్వ కంగా చంపిన ఇజ్రాయెల్ చర్యను అల్–జజీరా మీడి యా నెట్‌వర్క్ తీవ్రంగా ఖండించింది. సత్యాన్ని స మాధి చేయడానికి చేసే వ్యవస్థీకృత నేరాలలో భాగంగా తమ జర్నలిస్టును హత్యచేశారని పేర్కొంది. తమ జర్నలిస్టులపై ఉగ్రవాద నిందలు వేయడాన్ని ఖండించింది. పాలస్తినా జర్నలిస్టులపై ఉగ్రవాద నిందలు వేయడాన్ని జర్నలిస్టుల పరిరక్షణ కమిటీ (సిపిజె) ఇప్పటికే ఖండి ంచిన విషయాన్ని గుర్తుచేసింది. గడచిన 32నెలలుగా గాజాలో 260 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారని సిపిజె చెప్పిన విషయాన్ని గుర్తుచేసింది. తమ త ప్పులను సమర్థించుకోవడానికి జర్నలిస్టులపై నిరంత రం దుష్ప్రచారం చేస్తోందని ఇజ్రాయెల్‌ను విమర్శించింది. ప్రపంచం చూస్తున్న సత్యాలను ఇలాంటి మో సాలతో ఏమార్చలేరని హెచ్చరించింది. తమ సిబ్బందిపై దాడులు చేసిన దోషులపై విచారణ చేయడానికి అందుబాటులో ఉన్న చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, సత్యాన్వేషణ ద్వారా ఈ ప్రాంతంలోని వార్తలను ప్రపంచానికి తెలియజేయడానికి అల్–జజీరా కట్టుబడి ఉందని ప్రకటన స్పష్టం చేసింది.

2023 అక్టోబరులో పాలస్తి నా జాతి నిర్మూలన యు ద్ధాన్ని ఇజ్రాయెల్ ప్రారంభించినప్పటినుండీ ఈనాటి వరకూ దీంతో 12 మంది అల్–జజీరా జర్నలిస్టులు వి ధినిర్వహణలో ప్రాణత్యాగం చేశారు. ఈ దారు ణ నేరాలకు పాల్పడిన ఇ జ్రాయెల్‌ను జవాబుదారీ చేసి శిక్షించడానికి వీలుగా అంతర్జాతీయ సమాజం, న్యాయవ్యవస్థ ఆచరణాత్మకమైన చ ర్యలు తీసుకోవాలని అల్–జజీరా మీడియా నెట్‌వర్క్ ఒక ప్రకటనలో కోరింది. గడచిన 32 నెలలుగా గాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న మారణకాండలో ఇప్పటివరకూ 73,018 మంది మరణించారు. లక్షమందిపైగా గాయపడ్డారు.



గడచిన అక్టోబరులో కాల్పు ల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత ఉల్లంఘనలకు పాల్పడి మరో 1000 మంది పాలస్తీనియన్లకు ఐడిఎఫ్ కాల్చి చంపింది.

ఇదిలా ఉండగా, ఆదివారంనాడు హమాస్ మనీ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. హమాస్ ఉగ్రవాద సంస్థ తన మనుగడ కోసం అంతర్జాతీయస్థాయిలో నిధులను అక్రమ మార్గాలలో సేకరిస్తోందని, ఈ ఫైనాన్స్ ఫండ్ నెట్‌వర్కును తాము ధ్వంసం చేశామని ఐడిఎఫ్ పేర్కొంది. ఇందులో భాగంగా ఆదివారం నాడు ఇద్దరు హమాస్ ఫైనాన్స్ ఆపరేటర్లను హతమార్చామని ప్రకటించింది. 169 మిలియన్ డాలర్లు హమాస్ దారి మళ్లించిందని పేర్కొంది.

## మరో పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నాయని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన దశల వారి ఉద్యమ కార్యాచరణను ఆయన వెల్లడించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం జూలై 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్దఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదల నుంచి దరఖాస్తులను సేకరించి జూలై 6న హైదరాబాద్ (ఇందిరాపార్క్) వేలాది మందితో ధర్నా నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పేదల నుంచి సేకరించిన దరఖాస్తులను నేరుగా సమర్పిస్తామన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి స్పందన మేరకు తమ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని వారు చెప్పారు. ఈ 'మహత్తర గుడిసెల పోరాటానికి' ఏ పేరు పెట్టాలనేది జూలై 2న సమావేశమై నిర్ణయించనున్నట్లు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు.

**అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి ఇళ్ళను కూల్చడం దుర్మార్గం**

హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలో గత 4 ఏళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి సమయంలో గ్రామంపై పడి ఎలాంటి విచక్షణ లేకుండా పేదల ఇళ్ళను కూల్చివేయడం దుర్మార్గమని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా బలవంతంగా లాగిపడేసి అడ్డంవచ్చిన యువకులు, వృద్ధుల కాళ్ళు చేతులు మడిచి మరీ బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి, సుమారు 300 నుండి 400 మందిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఒకప్పుడు అక్కడ ఉన్న 'కోమల కుంట' అనే చెరువును ప్రభుత్వం పూడ్చి, ఎస్ఆర్ఎస్‌పి కాల్వను తవ్వేందుకు సిద్ధమైందని, ఇదే క్రమంలో ఉమ్మడి రాష్ట్రంలో 2009లోనే అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి సర్వే నంబర్ 174, 175 కింద ఉన్న 56 ఎకరాల భూమిలో దాదాపు 1400 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మరో 40 మందికి ఇక్కడే పట్టాలు ఇవ్వగా ప్రస్తుతం బాధితులు కేవలం 8 ఎకరాల పరిధిలోనే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ, కాల్వ ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేకపోయినా అధికారులు అత్యుత్సాహంతో గుడిసెలు కూల్చివేశారని, ఇప్పటికే ఈ సర్వే నంబర్లలోని వందలాది ఎకరాలు ఇతరుల ఆధీనంలో ఉన్నాయని, వాటిని ఎందుకు కూల్చివేయలేదని ఆయన ప్రశ్నించారు. ఈ కూల్చివేతలకు సంబంధించి స్థానిక ఎంఎల్ఎను వివరణ కోరగా తనకు తెలియదని తప్పించుకున్నారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, సలహాదారు నరేందర్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇదే తరహాలో రెండు రోజుల కింద గోపాల్‌పూర్ ప్రాంతంలో సిపిఐ(ఎం) నాయకత్వంలో పేదలు వేసుకున్న గుడిసెలను కూడా ఎలాంటి దయాదాక్షిణ్యాలు లేకుండా కూల్చేసి, చుట్టూ ఫెన్సింగ్ వేశారన్నారు. గతంలో వెలుగుమట్లలోనూ ఇలాగే జరిగిందని, కూల్చేసిన చోటే మళ్ళీ ఇళ్ళు కట్టించి ఇస్తామని ప్రభుత్వం చెప్పడం వారి ద్వంద్వ విధానానికి నిదర్శనమని విమర్శించారు. గోపాల్‌పూర్, గుండ్ల సింగారం బాధితులకు వెలుగుమట్ల తరహాలోనే ప్రత్యామ్నాయ ఇళ్ళు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మహానగరంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో లక్షలాది మంది పేదలు 25, 30, 50 గజాల లోపు చిన్న చిన్న గుడిసెల్లో, మురికివాడల్లో నివసిస్తున్నారని వివరించారు. వీరంతా భూదాన్ భూములు, ప్రభుత్వ భూములు, మిగులు భూముల్లో దశాబ్దాలుగా ఉంటున్నారని వీరందరికి పట్టాలను ఇవ్వాలని సాంబశివరావు డిమాండ్ చేశారు.

**పేదలపై అక్రమ కేసులు అన్యాయం : అబ్బాస్**

అబ్బాస్ మాట్లాడుతూ హన్మకొండ జిల్లా గుండ్ల సింగారం, గోపాల్‌పూర్, వెలుగుమట్ల, జగిత్యాల ప్రాంతాల్లో పేదలు వేసుకున్న దాదాపు 2 వేల గుడిసెలను ప్రభుత్వం అమానుషంగా కూల్చివేయడాన్ని సిపిఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. పేదలపై అక్రమంగా కేసులు బనాయించి 40 నుండి 50 రోజుల పాటు జైళ్లలో పెట్టడం అత్యంత దారుణమన్నారు.




2007లో జరిగిన భూపోరాటంలో ముదిగొండ కాల్పుల్లో ఏడుగురు పేదలు ప్రాణాలు కోల్పోయారని, ఆతర్వాతే అప్పటి సిఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు 'ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని' ప్రారంభించారని గుర్తు చేశారు. నాడు ఆ పథకం కింద పట్టాలు పొందిన వారి ఇళ్లను కూడా నేడు ప్రభుత్వం కూల్చివేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు.

**పేద ప్రజలపై బుల్డోజర్లు ఎక్కించకండి: గోవర్ధన్**

ప్రభుత్వం పేద ప్రజలపై యుద్ధం చేయవద్దని, వారిపై బుల్డోజర్లు ఎక్కించి ఉసురు పోసుకోవద్దని కె.గోవర్ధన్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 'గుడిసె రహిత' లేదా ఇల్లు లేని కుటుంబం అంటూ ఏదీ లేకుండా, ప్రతి కుటుంబానికి నిలువ నీడ ఉండేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొంగల్లాగా, బందిపోట్లలాగా తెల్లవారుజామున వెళ్లి ఇళ్లను కూల్చడం సరైన పద్ధతి కాదన్నారు. కమ్యూనిస్టులుగా తాము ఎలాంటి గొంతెమ్మ కోరికలు కోరడంలేదన్నారు. కేవలం పేదలు తల దాచుకునేందుకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

**కబ్జాల చిట్టా ఇస్తాం.. చర్యలు తీసుకోండి: సుధాకర్**

నిలువ నీడ లేని పేదల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్ట్ పార్టీలేనని, రాష్ట్రంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయో, ఎక్కడెక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములను అక్రమించుకున్నారో ఆ వివరాలన్నీ తాము ఇస్తామని, ధైర్యముంటే వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సుధాకర్ సవాల్ చేశారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని వెలుగులోకి తెచ్చింది కమ్యూనిస్టులేనని, బడా బాబుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడుతున్నది కూడా తామేనని స్పష్టం చేశారు.

**అధికారుల అత్యుత్సాహంపై విచారణ జరపాలి : భరత్**

కొంతమంది పోలీస్ అధికారులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు కొందరు పెద్దల అండతో పేదలపై అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఇళ్లను కూల్చివేస్తున్నారని భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ఈ కూల్చివేతలు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరుగుతున్నాయా లేక అధికారులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఒక వేళ ప్రభుత్వం నుండి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా, అధికారులే సొంత నిర్ణయాలతో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ పేదలపై దాడులకు తెగబడుతున్న అధికారులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## చెట్టును ఢీకొన్న కారు... ముగ్గురు మృతి



ములకలపల్లి మాదారం అటవీ ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం....

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలం పరిధిలోని మాదారం అటవీ ప్రాంతంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతి వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాచలం శ్రీ వేంకటేశ్వర కాలనీకి చెందిన దూడల సాయి ప్రకాష్ (28), ఆయన భార్య సంధ్య (26), కుమారుడు మోక్షిత్ (4), తల్లి జ్యోతి కలిసి ఆదివారం ఉదయం ములకలపల్లిలో నివసిస్తున్న బంధువు దూడల రాము ఇంటికి వచ్చారు. మధ్యాహ్నం భోజనం అనంతరం భద్రాచలం వెళ్లేందుకు కారులో బయలుదేరారు. ములకలపల్లి మండలంలోని మాదారం అటవీ ప్రాంతంలో ప్రయాణిస్తుండగా కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు సాయి ప్రకాష్, సంధ్య, మోక్షిత్ తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ ప్రమాదంలో జ్యోతికి కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు, పోలీసులు వెంటనే ఆమెను పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న ములకలపల్లి ఎస్సై మధు ప్రసాద్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో భద్రాచలం, ములకలపల్లి ప్రాంతాల్లో తీవ్ర విషాధ ఛాయలు నెలకొన్నాయి. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బిజెపి, ఇసి లాలూచీ

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వలేదని ప్రశ్నించారు. 2023 రూల్ బుక్ అడ్డం పెట్టుకుని నత్వానికి నామినేషన్ కరెక్షన్ కోసం 24 గంటలు సమయం ఇచ్చారని, కానీ తనకు 2026 రూల్ బుక్ ప్రకారం నామినేషన్ కరెక్షన్‌కు అవకాశం ఇవ్వలేదని చెప్పారు. తనకు సంబంధం లేని కేసుతో నామినేషన్ తిరస్కరించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో 62 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని వివరించారు. రాజ్యసభ సభునిగా గెలవాలంటే 58 మంది సభ్యుల అవసరం అవుతారన్నారు. ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ గెలిచే సీటు ఇది అని స్పష్టం చేశారు. అయితే బిజెపికి సంఖ్యా బలం లేకున్నా మూడో స్థానానికి నామినేషన్ వేశారని తెలిపారు. మూడో నామినేషన్ వేశారంటేనే బిజెపి కుట్ర అర్థమవుతోందని చెప్పారు. కానీ కాంగ్రెస్ పార్టీలోని వారంతా తనతో కలిసి నడిచారని చెప్పారు. కేసు ఉన్నంత మాత్రాన నామినేషన్ తిరస్కరణ కాలేదు. బిజెపి నేతలను నామినేషన్ రూమ్‌లోకి ఎందుకు అనుమతించారని మీనాక్షి నటరాజన్ ప్రశ్నించారు. తన నామినేషన్ తిరస్కరణ కేవలం ఒక్క సీటుకు సంబంధించిన విషయం కాదని తెలిపారు. ఒకే దేశం ఒకే ఎన్నిక చేయాలని బిజెపి చూస్తోందని విమర్శించారు.

**తెలంగాణ నుంచి రాజ్యసభ సీటు తీసుకోను**

తన కోసం మరొకరితో రాజీనామా చేయించి తెలంగాణలో రాజ్యసభ సీటు తీసుకోలేనని, తన కోసం ఎవరూ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని మీనాక్షి నటరాజన్ అన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని కాబట్టే అక్కడి నుంచే సీటు కోరుకుంటానన్నారు. తన లాంటి వారి కోసం తెలంగాణ రాజ్యసభ స్థానాన్ని ఇస్తే అందుకు తాను ఒప్పుకోనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెట్టేందుకు బిజెపి అనేక అబద్ధాలను సృష్టించిందని అన్నారు. రాజ్యసభ నామినేషన్ రిజక్ట్ చేసినందుకు తనకేం బాధ లేదన్నారు. తన నామినేషన్ తిరస్కరించడం వల్ల బిజెపి బండారం బయట పడిందని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని తెలిపారు. ఇప్పుడు సోషల్ మీడియా యుగమని, అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు.

**శ్రీలతకు ఎంఎల్‌ఎ టికెట్ ఇవ్వక పోవడానికి చాలా కారణాలు**

తాను ఎప్పుడైనా బాధితుల పక్షమేనని మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. శ్రీలతకు కూడా తాను అండగా ఉన్నానని చెప్పారు. ఆమెకు ఎంఎల్‌ఎ టికెట్ ఇవ్వకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయని వివరించారు. శ్రీలతపై అనేక ఆరోపణలు ఉన్నప్పటికీ ఒక మహిళగా ఆమె అభిప్రాయం విన్నామని తెలిపారు. ఆమె బాధను అర్థం చేసుకుని డిసిసి అధ్యక్షుడిని తొలగించామని చెప్పారు.

## ఉత్ప్రేరకంగా యోగా

(మొదటి పేజీ తరువాయి)

పోర్టులో స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన మూడు నౌకాదళ నౌకల ప్రారంభోత్సవంలో మోదీ ప్రసంగించారు. వ్యక్తిగత క్రమశిక్షణ, జాతీయ సామర్థ్యం కలిసికట్టుగా ఒక బలమైన, మరింత ఆత్మవిశ్వాసం గల భారతదేశాన్ని ఎలా తీర్చిదిద్దుతాయో మోదీ నొక్కి చెప్పారు. మోదీ ఇచ్చిన ఒక సందేశం సామరస్యం, ఆరోగ్యం, శాంతిపై కేంద్రీకృతమై ఉండగా, మరొకటి భద్రత, సాంకేతిక పురోగతి, వ్యూహాత్మక ప్రభావాన్ని ఉద్ఘాటిస్తుంది. కాగా, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రెడ్‌రోడ్‌లో గుమిగూడిన వేలాది మందినుద్దేశించి ప్రసంగిస్తూ, యోగా కేవలం వ్యక్తిగత ఆరోగ్యాన్ని పెంపొందించడానికే కాకుండా ప్రపంచ శాంతికి ఒక ఉత్ప్రేరకంగా కూడా ఉపయోగపడుతుందని మోదీ అన్నారు. భగవద్గీతను ఉటంకిస్తూ, దుఃఖాన్ని అధిగమించడానికి పని, పోషణ, నిద్రలతో కూడిన సమతుల్య జీవనశైలియే కీలకం అని మోదీ పేర్కొన్నారు. ఆ సమతుల్యతే యోగాకు మూలస్తంభమని, మన జీవితాలకు కూడా అదే మూలస్తంభన్నారు. మానసిక శ్రేయస్సు, ఆత్మజ్ఞానం ద్వారా శారీరక దృఢత్వాన్ని కనుగొనడంలో యోగా ప్రజలకు సహాయపడుతుందని ప్రధాని అన్నారు. యోగాను జీవితాంతం ఆచరించాలని ప్రజలను కోరుతూ, 'యోగాను కేవలం ఒక నిర్దిష్ట రోజుకో లేదా ఒక కార్యక్రమానికో పరిమితం చేయకుండా, దానిని మన జీవితాలలో, మన కుటుంబాల జీవితాలలో, మన భవిష్యత్ తరాల జీవితాలలో ఒక భాగంగా చేసుకుందాం అని ప్రతిజ్ఞ చేద్దాం అని అన్నారు. తెల్లటి టీషర్టు, ప్యాంటు ధరించిన మోదీ, రెడ్ రోడ్‌లో జరిగిన సామూహిక యోగా ప్రదర్శనలో వేలాది మందితో కలిసి పాల్గొన్నారు. ఆయన అన్ని వయసుల పౌరులతో కలిసి యోగా చేశారు, 40 నిమిషాల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారి మధ్య నడిచారు. నియమాలను నిశితంగా గమనించారు. కొందరికి వారి భంగిమలను సరిదిద్దుకోవడంలో కూడా సహాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆర్.ఎన్. రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారి, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి చెందిన పలువురు మంత్రులతో సహా వేలాది మంది పాల్గొన్నారు.

**అభివృద్ధి, భద్రత, శ్రేయస్సు సముద్రాలతో ముడిపడి ఉన్నాయ్**

తరువాత, శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్ట్ వద్ద, మోదీ మానవ సామర్థ్యం నుండి జాతీయ సామర్థ్యం వైపు దృష్టిని మళ్లించారు. ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావానికి బలమైన సముద్ర శక్తి అవసరమని ఆయన నొక్కి చెప్పారు. ఒక దేశ ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావానికి బలమైన సముద్ర సామర్థ్యాలే నిర్ణయాత్మక అంశం అని ఆయన అన్నారు. భారతదేశం ఈ వాస్తవాన్ని అర్థం చేసుకుని, అందుకు అనుగుణంగా సన్నద్ధమవుతోందని కూడా ఆయన తెలిపారు. మోదీ స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన మూడు నౌకాదళ నౌకలు స్టెల్త్ ఫ్రిగేట్ దునగిరి, సర్వే నౌక సంశోధక్, జలాంతర్గామి వ్యతిరేక నిస్సార జల నౌక అగ్రేను ప్రారంభించారు. భారత నౌకాదళ యుద్ధనౌక డిజైన్ బ్యూరోచే రూపొందించబడి, కోల్‌కతాకు చెందిన గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ లిమిటెడ్ చేత నిర్మించబడిన ఈ నౌకలలో 75 శాతానికి పైగా స్వదేశీ పరికరాలు ఉన్నాయి. వీటి నిర్మాణంలో 200కు పైగా ఎంఎస్ఎంఇలు పాలుపంచుకున్నాయి. రక్షణ రంగంలో స్వావలంబనను నొక్కిచెబుతూ 'మన సామర్థ్యాలకు గుర్తింపు మన స్వావలంబనలోనే ఉంది, అంతేగాని ప్రపంచానికి మార్కెట్‌గా మారడంలో కాదు. ప్రపంచ రక్షణ రంగంలో భారత్ కేవలం కొనుగోలుదారుగా మాత్రమే మిగిలిపోవాలని అనుకోవడం లేదని మోదీ పేర్కొన్నారు. విమాన వాహక నౌక 'ఐఎన్ఎస్ విక్రాంత్'ను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా భారత్ తన పెరుగుతున్న సముద్ర శక్తిని ఇప్పటికే నిరూపించుకుందని ప్రధాన మంత్రి తెలిపారు. ఇటీవలి కాలంలో 40కి పైగా యుద్ధనౌకలు, జలాంతర్గాములు నౌకాదళంలో చేరాయని, ప్రస్తుతం 45 భారీ నౌకాదళ నౌకల నిర్మాణం జరుగుతోందని ఆయన చెప్పారు. సముద్ర శక్తి లేకుండా ఏ దేశమూ గొప్ప శక్తిగా ఎదగలేదని, అభివృద్ధి, భద్రత, శ్రేయస్సు అన్నీ సముద్రాలతో ముడిపడి ఉన్నాయని చెప్పారు.

# ముక్కోణపు వన్డే సిరీస్ టీమిండియాదే

## వైభవ్ విధ్వంసానికి కుదేలైన శ్రీలంక





ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత–ఏ జట్టు జయభేరి మోగించింది. దంబుల్లా వేదికగా జరిగిన ఫైనల్లో శ్రీలంక ఏ జట్టును టీమిండియా చిత్తు చేసింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(94) తుఫాన్ ఇన్నింగ్స్‌కు కుదేలైన లంక.. గట్టిగానే పోరాడింది. వనుజ సహన్(62), సమరవిక్రమ(52) లు అర్ధ శతకాలతో రాణించినా సరిపోలేదు. యశ్ ఠాకూర్(345), అనుకుల్ రాయ్(39, 242) ఆల్‌రౌండ్ షో తోడవ్వగా 66 పరుగుల తేడాతో టీమిండియా విజేతగా నిలిచింది. మూడు దేశాల వన్డే సిరీస్ ఫైనల్లో టీమిండియా–ఎ ధాటికి శ్రీలంక ఏ జట్టు చేతులెత్తేసింది. 378 పరుగుల ఛేదనను ధాటిగా ఆరంభించాలనుకున్న లంకను యశ్ ఠాకూర్(3–45) ఆదిలోనే దెబ్బకొట్టాడు. ఠాకూర్ విజృంభణతో 75కే మూడు వికెట్లు కోల్పోయిన లంకను సమరవిక్రమ(52), రవిందు ఫెర్నాండో(19) అదుకున్నారు. ఈ జోడీని తిలక్ వర్మ విడదీయగా.. సహన్ అరాచ్చిగే(38), వనుజ సహన్(62)లు కాసేపు ప్రతిఘటించారు. అయితే.. విప్రజ్ నిగమ్(), అనుకుల్ రాయ్(39, 242) ఆల్రౌండ్ షో తోడవ్వగా 66 పరుగుల తేడాతో టీమిండియా విజేతగా నిలిచింది

### వైభవ్ ఊచకోత

ఫైనల్లో భారత ఏ జట్టు మొదట కొండంత స్కోర్ కొట్టింది. శ్రీలంక బౌలర్లను భయపెడుతూ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(94) కేవలం 11 బంతుల్లోనే అర్ధ శతకంతో చెలరేగాడు. పవర్ ప్లేలోనే వైభవ్ ఊచకోతతో అలవోకగా టీమిండియా నాలుగొందలు కొడుతుందనిపించింది. కానీ, కెప్టెన్ తిలక్ వర్మ(67) మినహా ఎవరూ రాణించలేదు. .మిడిలార్డర్ వైఫల్యం, డెత్ ఓవర్లలో భారత ఆటగాళ్లను లంక పేసర్లు గొప్పగా కట్టడి చేశారు. కుమార్ కుష్రగ(39), ఆఖర్లో అనుకుల్ రాయ్(39) మెరుపులతో భారత ఏ జట్టు 9 వికెట్ల నష్టానికి 377 పరుగులతో లంకకు సవాల్ విసిరింది.

# ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్ విజేత భారత్

## మహిళల హాకీలో న్యూజిలాండ్‌పై టీమిండియా విజయం



ఆసియా క్రీడలకు ముందే భారత మహిళల హాకీ జట్టు అదరగొట్టింది. ప్రతిష్ఠాత్మక ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో తమకు తిరుగులేదని చాటుతూ ట్రోఫీని కొల్లగొట్టింది. ఆదివారం జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన భారత్ రెండోసారి కప్‌ను ఒడిసిపట్టింది. టైటిల్ పోరులో నవనీత్ కౌర్, సునేలిటా టొప్పోలు చెరొక గోల్ కొట్టగా.. 2–0తో కివీస్ మట్టికరిచింది. ఆక్లాండ్ వేదికగా జరిగిన ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో భారత జట్టు టైటిల్ పట్టేసింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో న్యూజిలాండ్‌ను టీమిండియా 2–0తో ఓడించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో నవనీత్‌కౌర్ 4వ నిమిషంలోనే తొలి గోల్ కొట్టగా భారత్ 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఖాతా తెరిచేందుకు కివీస్ జట్టు ఎంతగానో ప్రయత్నించినా భారత డిఫెండర్లు ఏమాత్రం అవకాశమివ్వలేదు. ప్రత్యర్థికి షాకిస్తూ సునేలిటా టొప్పో 15వ నిమిషంలో గోల్‌తో టీమిండియా స్పష్టమైన ఆధిపత్యం చెలాయించింది. ఫైనల్లో రాణించిన ఫార్వర్డ్ లల్రేమ్సియామి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికైంది. టోర్నీ ఆసాంతం రాణించిన దీపిక ఆరు గోల్స్‌తో అమెరికా ప్లేయర్ అష్లే సెస్సాతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును పంచుకుంది.

# ఆరోగ్యం

## అప్రమత్తత అవసరం



### 'సప్లిమెంట్స్' నష్టాలు ఎన్నో

ఇటీవలి కాలంలో ఆరోగ్యం పట్ల అవగాహన పెరగడంతో విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్ పౌడర్లు, కొల్లాజెన్, హెర్బల్ ఉత్పత్తులు వంటి సప్లిమెంట్ల వినియోగం గణనీయంగా పెరిగింది. సోషల్ మీడియా ప్రకటనలు, ఇన్ఫ్లుయెన్సర్ల సిఫార్సులు.. 'ఫలానా సప్లిమెంట్ తీసుకుంటే ఆరోగ్యం మెరుగవుతుంది' అంటూ ప్రచారం కారణంగా చాలా మంది ప్రతిరోజూ అనేక రకాల సప్లిమెంట్లను తీసుకుంటున్నారు. అయితే నిపుణుల హెచ్చరిక ఏమిటంటే, అవసరం లేకుండా అనేక సప్లిమెంట్లను కలిపి తీసుకోవడం ఆరోగ్యానికి మేలు కంటే హాని ఎక్కువ చేయవచ్చు. సప్లిమెంట్లు నిజంగా కొన్ని సందర్భాల్లో ఉపయోగకరమే. విటమిన్ లోపాలు, ఐరన్ కొరత, గర్భధారణ, వృద్ధాప్యం లేదా కొన్ని ప్రత్యేక ఆరోగ్య పరిస్థితుల్లో వైద్యుల సూచన మేరకు తీసుకుంటే అవి ప్రయోజనకరంగా ఉంటాయి. కానీ వాటిని ఆహారానికి ప్రత్యామ్నాయంగా భావించడం ప్రమాదకరం. సమతుల ఆహారం ద్వారా లభించే పోషకాలు సప్లిమెంట్ల ద్వారా పూర్తిగా భర్తీ కావు. ముఖ్యంగా విటమిన్ 'ఎ', అశ్వగంధ, గ్రీన్ టీ ఎక్స్‌ట్రాక్ట్, గ్లూటమైన్ వంటి పదార్థాలను అధిక మోతాదులో తీసుకోవడం వల్ల కాలేయానికి నష్టం కలగవచ్చు. కొన్ని పరిశోధనల ప్రకారం కాలేయ నష్టానికి సంబంధించిన కేసుల్లో గణనీయమైన భాగం హెర్బల్, ఆహార సప్లిమెంట్ల వినియోగంతో సంబంధం కలిగి ఉంది. మరో సమస్య ఏమిటంటే, చాలామంది ఒకేసారి అనేక సప్లిమెంట్లను తీసుకుంటూ ఒకే పోషక పదార్థాన్ని రెండుసార్లు లేదా మూడుసార్లు తీసుకుంటుంటారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి మొదటి ప్రాధాన్యం సమతుల ఆహారానికే ఇవ్వాలి. కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, పప్పులు, పాలు, చేపలు వంటి సహజ ఆహారాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఏదైనా పోషక లోపం ఉందని అనుమానం ఉంటే స్వయంగా సప్లిమెంట్లు కొనుగోలు చేయకుండా ముందు గా వైద్యులను సంప్రదించాలి. ఏదిఏమైనా సప్లిమెంట్లు అవసరమైనపుడు ఉపయోగకరమైనవే అయినప్పటికీ, ఎక్కువ తీసుకుంటే ఎక్కువ ఆరోగ్యం అనే భావన తప్పు. సరైన వైద్య సలహా లేకుండా అనేక సప్లిమెంట్లను కలిపి తీసుకోవడం కాలేయం, మూత్రపిండాలు, జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావాలు చూపవచ్చు. ఆరోగ్యానికి ఉత్తమమైన మార్గం ఇప్పటికీ సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, వైద్యుల సూచనలే.




దేశంలో రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా వంటి దోమ ల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేసింది. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలు పెరగడం వల్ల దోమల సంతతి వేగంగా విస్తరిస్తుంది. ఫలితంగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, జలుబు, దగ్గు, తలనొప్పి, కలరా తదితర కేసులు అధికమయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రాలు ముందస్తు చర్యలను ముమ్మరం చేయాలని కేంద్ర ఆరోగ్య అధికారులు సూచించారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, రక్త నిల్వలు, వెంటిలేటర్లు, ఇతర వైద్య పరికరాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. వ్యాధుల నియంత్రణలో భాగంగా దోమల పెరుగుదలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. నిల్వ నీటిని తొలగించడం, లార్వా నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించడం, ఫాగింగ్ చేయడం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయనున్నారు. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచిస్తున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను పూర్తిగా నివారించాలంటే ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరం. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమతెరలు ఉపయోగించడం, పూర్తి చేతుల దుస్తులు ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ముందస్తు సన్నద్ధత, సమర్థవంతమైన ఆరోగ్య వ్యవస్థ, ప్రజల భాగస్వామ్యం ద్వారా వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిని గణనీయంగా తగ్గించవచ్చు.

### కాంగోలో ఎబోలా భయం..

కాంగో ప్రజాస్వామ్య గణరాజ్యం (డిఆర్‌సి) ప్రస్తుతం ఎబోలా వైరస్ వ్యాధి వేగంగా విస్తరిస్తున్నది. ఈ తాజా వ్యాధి వ్యాప్తిలో వందలాది కేసులు నమోదవగా, పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఎబోలా అత్యంత ప్రమాదకరమైన వైరల్ వ్యాధి. ఇది మనుషుల మధ్య శరీర ద్రవాల ద్వారా వ్యాపిస్తుంది. జ్వరం, తీవ్రమైన బలహీనత, వాంతులు, విరేచనాలు, అంతర్గత, బాహ్య రక్తస్రావం వంటి లక్షణాలు కనిపించవచ్చు. సరైన చికిత్స అందకపోతే మరణాల శాతం చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నిశితంగా పర్యవేక్షిస్తోంది. వ్యాధి నియంత్రణ, రోగుల సంరక్షణ, వైరస్ వ్యాప్తి నివారణ కోసం తాజాగా ఫిలోవైరస్‌ల క్లినికల్ నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎబోలా వైరస్ కూడా ఫిలోవైరస్ కుటుంబానికి చెందినదే. ఈ మార్గదర్శకాల్లో రోగులను త్వరగా గుర్తించడం, తగిన ఐసోలేషన్ చర్యలు చేపట్టడం, ద్రవాలు, పోషకాహారం అందించడం, సంక్రమణ నియంత్రణ చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే ఆరోగ్య సిబ్బంది రక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు సూచించారు. ఎబోలా వ్యాప్తి కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాదని, అది సామాజిక, ఆర్థిక రంగాలపై కూడా తీవ్ర ప్రభా వం చూపుతుందని డబ్ల్యుహెచ్ఒ హెచ్చరిస్తున్నది. అందువల్ల వేగవంతమైన గుర్తింపు, సమర్థవంతమైన వైద్య సేవలు, ప్రజల్లో అవగాహన పెంపు మరియు అంతర్జాతీయ సహకారం ద్వారా మాత్రమే ఈ వ్యాధిని అదుపులోకి తీసుకురావడం సాధ్యమవుతుంది. డబ్ల్యుహెచ్ఒ సూచనలు ఈ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. .

# కార్మికులకు కనీస వేతనం రూ.26వేలివ్వాలి

## ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎఐటియుసి మండల నిర్మాణ మహాసభలు ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. మహాసభలకు ముఖ్య అతిథిగా బాలరాజు హాజరై ఎఐటియుసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బాలరాజు కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు శ్రమ దోపిడీని మరింత పెంచుతున్నాయని విమర్శించారు. దశాబ్దాల పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల ప్రయోజనాలను పక్కన పెడుతోందని మండిపడ్డారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో తీసుకొచ్చిన విధానాలు యాజమాన్యాలకు అధిక అధికారాలు కల్పించగా, కార్మికులను బానిసల మాదిరిగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మిక వర్గానికి శాపంగా మారిందన్నారు. ఈ కోడ్‌లను వెంటనే రద్దు చేసి కార్మికులకు భద్రత, హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల కోసం సమగ్ర చట్టం అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థలను రద్దు చేసి శాశ్వత ఉద్యోగాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశంలో ఇద్దరు గుజరాతీలు దేశాన్ని అమ్ముతూ ఉంటే మరో ఇద్దరు గుజరాతీలు కొనుకుంటున్నారని విమర్శించారు. ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు కె.రామస్వామి మాట్లాడుతూ కార్మికులందరికీ ఇఎస్ఐ, పిఎఫ్ ఉద్యోగ భద్రత గ్రాటివిటీ సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని అదేవిధంగా భవన నిర్మాణ రంగా కార్మికులు ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు తీసుకోవాలని లేబర్ అడ్డాల దగ్గర ఐదు రూపాయలకే భోజన వసతి కల్పించాలని లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాలు కల్పించాలని మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభలలో చేవెళ్ల నియోజకవర్గంలో నాలుగు మండలాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని రామస్వామి ప్రకటించారు. చేవెళ్ల మండల ఎఐటియుసి అధ్యక్షుడిగా బాబురావు, ప్రధాన కార్యదర్శిగా ఈ కృష్ణ, షాబాద్ మండల ఎఐటియుసి అధ్యక్షుడిగా నక్క జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, మొయినాబాద్ మండల అధ్యక్షుడిగా మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా సతీష్, శంకర్‌పల్లి మండల ఎఐటియుసి అధ్యక్షుడిగా బాబురావు, ప్రధాన కార్యదర్శిగా వి.బ్రహ్మచారి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. మహాసభలలో ఎఐకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ప్రభులింగం, ఎం.సాబు, జిల్లా అధ్యక్షుడు ఎండి. మక్బూల్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, శంకర్‌పల్లి మండల కార్యదర్శి సుధీర్, ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు వడ్ల మంజుల, నారాయణ నియోజకవర్గ ఇన్‌చార్జి దప్పు శివయ్య, భవన నిర్మాణ రంగ కార్మికులు అనెక్స్ గ్లాస్ కంపెనీ కార్మికులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గీత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో సంఘం సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బొమ్మగాని ధర్మబిక్షం నేతృత్వంలో అనేక పోరాటాలు చేసి పెన్షన్, లైసెన్స్, ఎక్స్‌గ్రేషియాలు సాధించుకున్నామని, అది ధర్మబిక్షం పోరాట ఫలితమైన అని కొనియాడారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించకుండా కాలయాపన చేస్తూ గీత కార్మికులపై సవితి తల్లి ప్రేమను చూపిస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో వారికి రావల్సిన రూ.10కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన హెచ్చరించారు. పెన్షన్ పొందుతున్న గీత కార్మికుడు చనిపోతే ఆ పెన్షన్ ఇతర పెన్షన్ల మాదిరిగా భార్యకు వచ్చేటట్లు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. రేగటి లింగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు, రాష్ట్ర కోఆర్డినేటింగ్ సెక్రటరీ బొమ్మగాని నాగభూషణం, జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ కోటయ్య, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, నియోజకవర్గ కార్యదర్శి బండారం లక్ష్మయ్య, తొట్ల ప్రభాకర్, బూర వెంకటేశ్వర్లు, తొట్ల వెంకన్న, బూర సైదులు, రేగటి సాంబయ్య, పందుల జానయ్య, ఎడెల్లి శ్రీకాంత్, అయితగాని కామేష్, రెడ్డిమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యువజన హక్కులకు ఉద్యమిద్దాం



## సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**ప్రజాపక్షం/హుజురాబాద్ :** యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధనకు పోరాటాలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎఐవైఎఫ్ హుజురాబాద్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఇందిరానగర్‌లో పోలోజు రంజిత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని, మేము వస్తే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని మాట ఇచ్చి తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఏటా కోటి ఉద్యోగాలన్న మోదీ నేటికి దాని అమలు పరచకపోవడం సిగ్గుచేటన్నారు. యువజన వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని యువతకు పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపెల్లి యుగంధర్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు నెలకు రూ.3000లు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. గతంలో నిరుద్యోగులు ఉపాధి చేసుకోవడం కోసం రుణాలు ఇచ్చేవారని, ఇప్పుడు ఆపథకాన్ని నీరుగార్చారన్నారు. గ్రామాల్లో యువతను ఐక్యంచేసి సంఘటిత పోరాటాలకు సిద్ధం చేయాలని యుగంధర్ కోరారు. సమావేశంలో రత్నాకర్, జెట్టి లావణ్య, మోడెం శివకుమార్, సదానందం, ఫర్జాన, రామంచ శ్రావణ్, అకినపల్లి సందీప్, కోల సుమన్ పాల్గొన్నారు.

## నాడు ఫార్మా, నేడు ఫ్యూచర్ సిటీ పేరుతో

# గిరిజన జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

### గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నాడు ఫార్మాసిటీ, నేడు ఫ్యూచర్ సిటీ పేరుతో ఆ ప్రాంత గిరిజనులు జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా మూడవ మహాసభ రాజేంద్రనగర్‌లోని ఎఆర్ దేవరాజ్ భవన్‌లో గిరిజన సమాఖ్య నాయకుడు సక్రు నాయక్ అధ్యక్షతన జరిగింది. మహాసభకు అంజయ్య నాయక్, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజయ్యనాయక్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలకులు చేసిన తప్పిదాలనే ప్రస్తుత కాంగ్రెస్ నేతృత్వంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తుందన్నారు. భూమిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నటువంటి గిరిజనులు కుటుంబాలను గతంలో కెసిఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో గిరిజన భూములను అక్రమంగా ఆక్రమించుకొని అరకొర నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటే అనేకమంది భూములు కోల్పోయిన గిరిజన రైతులు ఆందోళన చెంది పట్టణాలకు వలసలు పోయి కూలీలుగా జీవనం గడుపుతునాన సంఘటనలు ఉన్నాయన్నారు. నేడు రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో కొనసాగుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా పేరు మార్చి ఫ్యూచర్ సిటీ పేరుతో గిరిజన ఆవాసాలను, గిరిజన భూములను తక్కువ ధరలకు ఆక్రమించుకొని భూముల నుంచి గెంటేస్తున్నారని విమర్శించారు. పాలకులు మారిన వారి స్వభావం మారలేదని దీనికి నిదర్శనం అన్నారు. రంగారెడ్డి జిల్లాలో అక్రమ వెంచర్లు చేసి గిరిజన తాండాలను ఆక్రమించుకొని వ్యాపారం సాగిస్తున్న కార్పొరేట్ వ్యవస్థలకు అడ్డుకట్టెయ్యాల్సినటువంటి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం బాధాకరం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను చేవెళ్ల డిక్లరేషన్ గిరిజనులకు అమలు చేయాలని అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజ్ రవీంద్రచారి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలని, గిరిజన హక్కుల కోసం సమాఖ్య ఆధ్వర్యంలో కార్యాచరణను రూపొందించుకొని సాగాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా పేరుకు ఆర్థిక వనరులు ఉన్న జిల్లా అయినప్పటికీ వివిధ ప్రాంతాల నుంచి వచ్చి బతుకుతెరువు కోసం జిల్లాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసముంటున్న గిరిజనులను గుర్తించి పక్కా ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు. గిరిజనలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని, ఆ పోరాటాలకు సిపిఐ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సభ లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, పుస్తకాల నర్సింగరావు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, బాలాపూర్ మండల కార్యదర్శి శేఖర్ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ నాయకులు క్రాంతి, బిచ్చునాయక్, రెడ్యానాయక్, జి.రవి, శారద, ఊర్మిళ, పి.బుజ్జి, సురేష్, లచ్చు నాయక్, భాను, మహేష్, పాండునాయక్, శంకర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ యుగంలో వార్తలపై విశ్వాస సంక్షోభం

## భారతదేశంలో 52 శాతం మంది వార్తలకే దూరం!




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచవ్యాప్తంగా వార్తల వినియోగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అచ్చు పత్రికల నుంచి టెలివిజన్, అక్కడి నుంచి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల వైపు ప్రజలు వేగంగా మళ్లుతున్నప్పటికీ, వార్తలపై విశ్వాసం మాత్రం క్రమంగా క్షీణిస్తోంది. రాయిటర్స్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ జర్నలిజం, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ సంయుక్తంగా విడుదల చేసిన 'డిజిటల్ న్యూస్ రిపోర్ట్ 2026' ప్రపంచ మీడియా రంగంలో ఆందోళన కలిగించే అంశాలను వెలుగులోకి తెచ్చింది. ప్రపంచంలోని 48 దేశాల్లో లక్ష మందికి పైగా పాఠకులు, వీక్షకులు, శ్రోతలపై నిర్వహించిన సర్వేలో మూడు ప్రధాన ధోరణులు వెల్లడయ్యాయి. వార్తా వినియోగం క్రమంగా పూర్తిగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకే పరిమితమవుతుండగా, ఆన్‌లైన్ వీడియోలు, క్రియేటర్లు, ఇన్‌ఫ్లూయెన్సర్ల ప్రభావం పెరుగుతోంది. అయితే వార్తలపై నమ్మకం మాత్రం నిరంతరం తగ్గిపోతోంది.

**విశ్వాస సంక్షోభంలో వార్తా ప్రపంచం**
'వార్త యందు జగము వర్ధిల్లుచుండు' అని తెలుగు సాహిత్యంలో పేర్కొన్నప్పటికీ, నేటి పరిస్థితుల్లో వార్తలపై ప్రజల విశ్వాసం క్షీణించడం, డిజిటల్ వేదికల ఆధిపత్యం పెరగడం, సమాచారాన్ని నిజమా కాదా అని నిర్ధారించలేని పరిస్థితి ఏర్పడడం ప్రపంచ మీడియా రంగానికి తీవ్రమైన సవాల్‌గా మారిందని 'రాయిటర్స్ ఇనిస్టిట్యూట్ డిజిటల్ న్యూస్ రిపోర్ట్2026' స్పష్టం చేసింది.

**డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లదే పైచేయి**
కోవిడ్ అనంతరం అచ్చు పత్రికల సర్క్యులేషన్ తగ్గిపోగా, టెలివిజన్ వార్తల వినియోగం పెరిగింది. ప్రస్తుతం రెండో దశ మార్పులో భాగంగా టెలివిజన్‌పై కూడా ఆసక్తి తగ్గి, ప్రజలు డిజిటల్ వేదికల వైపు మళ్లుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా మొత్తం వార్తా వినియోగదారుల్లో 54 శాతం మంది ప్రధానంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారానే వార్తలను అనుసరిస్తున్నారు. టెలివిజన్, ప్రింట్ మీడియా క్రమంగా వెనుకబడుతున్నాయి.

**వీడియో కంటెంట్, ఇన్‌ఫ్లూయెన్సర్ల ప్రభావం పెరుగుతోంది**
ఆన్‌లైన్ వీడియోలకు ఆదరణ పెరగడంతో కంటెంట్ క్రియేటర్లు, ఇన్‌ఫ్లూయెన్సర్ల ప్రాధాన్యత కూడా గణనీయంగా పెరుగుతున్నట్లు నివేదిక పేర్కొంది. సంప్రదాయ మీడియా కంటే యూట్యూబ్, సోషల్ మీడియా వేదికల ద్వారా సమాచారం పొందే వారి సంఖ్య పెరుగుతోంది.

**వార్తలపై తగ్గుతున్న విశ్వాసం**
సర్వే నిర్వహించిన 48 దేశాల్లో 29 దేశాల్లో వార్తలపై విశ్వాసం తగ్గినట్లు సర్వే వెల్లడించింది. మొత్తం ప్రపంచవ్యాప్తంగా కేవలం 37 శాతం మంది మాత్రమే వార్తలను విశ్వసిస్తున్నామని పేర్కొన్నారు. గత 15 ఏళ్లలో ఇదే అత్యల్ప స్థాయి. ఒకప్పుడు పత్రికల్లో లేదా టెలివిజన్‌లో వచ్చిన వార్తలను నిజమని నమ్మే పరిస్థితి ఉండగా, ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

**భారతదేశంలో 52 శాతం మంది వార్తలకు దూరం**
భారత్‌కు సంబంధించి విడుదల చేసిన నివేదికలో మరింత ఆందోళనకర పరిస్థితి కనిపించింది. దేశంలో 52 శాతం మంది తాము వార్తలను ఉద్దేశపూర్వకంగా దూరంగా పెడుతున్నామని తెలిపారు. అంటే రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాలపై ఆసక్తి చూపకుండా ఇతర వినోదాత్మక కంటెంట్‌ను ఎక్కువగా వీక్షిస్తున్నట్లు తేలింది.

**వార్తల కోసం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకే మొగ్గు**
వార్తలను అనుసరించే వారిలో 54 శాతం మంది ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను ఆశ్రయిస్తుండగా, 44 శాతం మంది టెలివిజన్‌ను, 35 శాతం మంది పత్రికలను అనుసరిస్తున్నారు. సోషల్ మీడియా వేదికల్లో వార్తల కోసం యూట్యూబ్‌ను 58 శాతం మంది, వాట్సాప్‌ను 56 శాతం మంది, ఇన్‌స్టాగ్రామ్‌ను 45 శాతం మంది, ఫేస్‌బుక్‌ను 39 శాతం మంది, టెలిగ్రామ్‌ను 23 శాతం మంది వినియోగిస్తున్నారు.

**భారతదేశంలోనూ తగ్గిన విశ్వాసం**
గత ఏడాదితో పోలిస్తే భారతదేశంలో వార్తలపై నమ్మకం నాలుగు శాతం పాయింట్లు తగ్గింది. ప్రస్తుతం కేవలం 39 శాతం మంది మాత్రమే వార్తలను విశ్వసిస్తున్నామని చెప్పారు. అంటే వార్తలను చదివే, చూసే, వినే వారిలో 61 శాతం మంది వాటి విశ్వసనీయతపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి మీడియా సంస్థలు రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు లేదా నిర్దిష్ట సిద్ధాంతాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయనే అభిప్రాయం పాఠకులు, వీక్షకుల్లో పెరుగుతున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**పత్రికా స్వేచ్ఛలోనూ భారత్ వెనుకబాటు**
పత్రికా స్వేచ్ఛకు సంబంధించి అంతర్జాతీయ సంస్థ 'రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్' విడుదల చేసిన తాజా సూచీలో 180 దేశాల్లో భారత్ 157వ స్థానంలో నిలిచింది. భావ ప్రకటనా స్వేచ్ఛ, మీడియాపై ఒత్తిళ్లు, జర్నలిస్టులపై పెరుగుతున్న పరిమితులు వంటి అంశాలు ఈ పరిస్థితికి కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**విశ్వాస సంక్షోభంలో వార్తా ప్రపంచం**
'వార్త యందు జగము వర్ధిల్లుచుండు' అని తెలుగు సాహిత్యంలో పేర్కొన్నప్పటికీ, నేటి పరిస్థితుల్లో వార్తలపై ప్రజల విశ్వాసం క్షీణించడం, డిజిటల్ వేదికల ఆధిపత్యం పెరగడం, సమాచారాన్ని నిజమా కాదా అని నిర్ధారించలేని పరిస్థితి ఏర్పడడం ప్రపంచ మీడియా రంగానికి తీవ్రమైన సవాల్‌గా మారిందని 'రాయిటర్స్ ఇనిస్టిట్యూట్ డిజిటల్ న్యూస్ రిపోర్ట్2026' స్పష్టం చేసింది.

# రానున్న వారం రోజులు వర్షాలు

## హైదరాబాద్ వాతావరణ కేంద్రం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు విస్తృతంగా కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. పలు జిల్లాల్లో భారీ వర్షాలు కూడా పడే సూచనలు ఉన్నాయన్నారు. అదే సమయంలో కొన్ని ఉత్తర, తూర్పు జిల్లాల్లో వడగాలుల పరిస్థితులు కొనసాగవచ్చుని హెచ్చరించారు. వాతావరణ కేంద్రం ఆదివారం మధ్యాహ్నం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ వరకు పలు జిల్లాల్లో గంటకు 50–60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. సోమవారం, మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మంగళవారం, బుధవారం వరకు వర్షాల ప్రభావం కొనసాగనుందన్నారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. బుధ, గురువారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గురువారం, శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాల సూచనలు ఉన్నాయన్నారు. ఈనెల 26 నుంచి 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉంటే, రాష్ట్రంలో ప్రస్తుతం నమోదవుతున్న గరిష్ట ఉష్ణోగ్రతలు రానున్న నాలుగు రోజుల పాటు 2 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, కరీంనగర్, ఖమ్మం, కొమురంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్ తదితర జిల్లాల్లో ఆదివారం 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండగా, అనంతరం చాలా జిల్లాల్లో అవి 36 నుంచి 40 డిగ్రీల మధ్యకు తగ్గనున్నట్లు అంచనగా ఉందన్నారు. హైదరాబాద్ సహా మిగతా చాలా జిల్లాల్లో వచ్చే ఐదు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల మధ్య ఉండే అవకాశముందన్నారు. రాష్ట్ర ప్రజలు వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని, ఉరుములుమెరుపులు, ఈదురుగాలుల సమయంలో చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని వాతావరణ కేంద్రం అధికారులు సూచించారు.



# యోగా.. ప్రపంచానికి అందించిన వారసత్వం

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యోగా అనేది భారత దేశం ప్రపంచానికి అందించిన శాశ్వతమైన నాగరికతా అని, దానిని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లి అంతర్జాతీయ ఉద్యమంగా మలిచిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దక్కుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహంగా జరుపుకుంటున్న ఈ సందర్భంలో యోగా ప్రాముఖ్యత మరింత పెరిగిందన్నారు. యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మానసిక ఆరోగ్యాన్ని, శారీరక శ్రేయస్సును బలోపేతం చేసే సంపూర్ణ జీవన విధానమని వివరించారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రజలు ఒత్తిడి, నిరాశ, జీవనశైలి సంబంధిత అనారోగ్య సమస్యలను ఎక్కువగా ఎదుర్కొంటున్నారని, అలాంటి పరిస్థితుల్లో యోగా సహజమైన, శక్తివంతమైన పరిష్కారంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపిలు ఆర్.కృష్ణయ్య, డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ గౌతం రావు, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు భారత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.69 కోట్ల బదిలీపై విచారణ జరపాలి

## మంత్రి వివేక్‌పై టిసిఎ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి విమర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)లో గత 15 ఏళ్లలో రూ.600 కోట్లకు పైగా ఆర్థిక అక్రమాలు జరిగాయని, హెచ్‌సిఎ నిధుల నుంచి విశాఖ ఇండస్ట్రీస్‌కు రూ.69 కోట్ల బదిలీ ప్రయత్నంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి డిమాండ్ చేశారు. టిసిఎ నిర్వహించాలనుకున్న మీడియా సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, హెచ్‌సిఎపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. సికింద్రాబాద్‌లో టిసిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి అనుమతి నిరాకరించడంతో నాయకులు రోడ్డుపైనే మీడియాతో మాట్లాడాల్సి వచ్చిందని ధరం గురువారెడ్డి తెలిపారు. ప్రజాస్వామ్యంలో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అణచివేయడం సరికాదని, తాము లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మంత్రి వివేక్ ఇటీవల 'టీసీఏ ఎక్కడ ఉంది?' అని చేసిన వ్యాఖ్యలు ఆయన అవగాహన లేమికి నిదర్శనమని అన్నారు. 2018లో వివేక్ హెచ్‌సిఎ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో, అలాగే 2021లో కూడా టిసిఎతో కలిసి పని చేయాలని బీసీసీఐ సూచించిందని గురువారెడ్డి గుర్తు చేశారు. 2004 నుంచి 2026 వరకు హెచ్‌సీఏ వ్యవహారాలపై వివేక్ కుటుంబ ప్రభావం అధికంగా ఉందని, ఆయన సోదరుడు వినోద్ పలు మార్లు అధ్యక్షుడిగా, వివేక్ కీలక పదవుల్లో ఉన్న సమయంలోనే అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. టిజి20 లీగ్ నిర్వహణపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. లీగ్‌కు బిసిసిఐ అనుమతి ఉందని హెచ్‌సిఎ చెబుతున్నప్పటికీ, ఇప్పటివరకు అధికారిక అనుమతి పత్రాన్ని బహిర్గతం చేయలేదన్నారు. తెలంగాణ జిల్లాల పేరుతో నిర్వహిస్తున్న లీగ్‌లో స్థానిక క్రికెటర్లకు సరైన ప్రాతినిధ్యం కల్పించడం లేదని, కొందరి వ్యాపార, రాజకీయ ప్రయోజనాల కోసం యువ క్రికెటర్ల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. టిసిఎ ఫిర్యాదులపై తెలంగాణ లోకాయుక్త ఇప్పటికే సీఐడీకి నిర్దిష్ట గడువులో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించిందని ధరం గురువారెడ్డి తెలిపారు. హెచ్‌సిఎలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవినీతి, ఆర్థిక అక్రమాలపై పూర్తి నిజాలు వెలుగులోకి వచ్చేవరకు న్యాయపోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ క్రికెటర్ల హక్కుల పరిరక్షణ, పారదర్శక క్రికెట్ పరిపాలన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని చెప్పారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతీ పౌరుడు కంకణబద్ధుడు కావాలి

## తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి పౌరుడు కంకణబద్ధుడు కావాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య పిలుపునిచ్చారు. నేటి యువత దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలక శక్తి అని, వారు మాదక ద్రవ్యాలపై మళ్లకుండ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరముందన్నారు. డ్రగ్స్ ఫ్రీయంగ్ ఇండియా లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, ఈగల్ ఫోర్స్ సహకారంతో ఆదివారం హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియం తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు సందీప్ శాండిల్య, తెలంగాణ బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి.హనుమంతరావు, మాజీ ఎంపి గిరీష్ సంఘీ, టిపిసిసి మైనారిటీ లింగ్విస్టిక్ సెల్ అధ్యక్షులు రాజేష్ అగర్వాల్ ఈగల్ ఫోర్స్ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణామూర్తి గుప్తా, శపథ్' నిర్వహణ కమిటీ అధ్యక్షులు రామ్ నివాస్ బన్సల్, ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవేంద్ర శాస్త్రీ, శపథ్' పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ సునీల్ అగర్వాల్, సలహాదారులు రాజీవ్ అగర్వాల్, విశాల్ కేడియా, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అనిల్ సింగ్, ప్యాట్రన్లు అనిరుధ్ గుప్తా, నరేంద్ర గోయల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందీప్ శాండిల్య మాట్లాడుతూ తెలంగాణలో డ్రగ్స్ వినియోగం ఆందోళనకరమైన స్థాయికి చేరుకుందని, ఈ మహమ్మారిని ఎదుర్కొనేందుకు సమాజంలోని వివిధ కుల సంఘాలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు అందరూ బాధ్యతగా ముందుకు వచ్చి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడానికి నడుం బిగించాలని సందీప్ శాండిల్య పిలుపునిచ్చారు. 2019లో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎఐఐఎంఎస్), కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన సర్వే వివరాల ప్రకారం గంజా యి వినియోగంలో దేశంలోనే తెలంగాణ 28వ స్థానం, ఓపియాయిడ్స్‌లో 23వ స్థానం, అపస్మారక మందులు 19వ స్థానం, కొకైన్ వినియోగంలో 10వ స్థానం, హాలూసినోజెన్స్‌లో 3వ స్థానం, నేరుగా శరీరంలోకి డ్రగ్స్ ఇంజెక్ట్ చేసుకునే వారిలో 5వస్థానంలో ఉండటం అత్యంత కలవరపరిచే అంశమన్నారు. రాష్ట్రంలోని 4 కోట్ల జనాభాలో, గుట్కా, సిగరెట్లు, మద్యం మినహాయించి కేవలం డ్రగ్స్‌కు బానిసలైన వారే దాదా పు 50 లక్షల వరకు ఉండే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా గిరీష్ సంఘీ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా అగర్వాల్ సమాజ్ చేపపడుతున్న ఈ కార్యక్రమానికి ఆర్థికం, అన్నివిధాలుగా సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. హనుమంతరావు మాట్లాడుతూ కాన్సర్‌కంటే ప్రమాదకరంగా మారిన డ్రగ్స్ భూతాన్ని తరిమి కొట్టడానికి ఒక పోలీసు శాఖ శక్తి సరిపోదని, సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు.

# కెటిఆర్ అబద్ధాలను ప్రజలు నమ్మరు

## ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కె.తారక రామారావు అబద్దాలను ప్రజలు నమ్మరని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్న బిఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు రోజుకో మీటింగ్ పెట్టి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆదివారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ మానసిక స్థితి సరిగ్గా లేదని, ఆయనకు ప్రభుత్వ ఖర్చుతో వైద్యం చేయించాలని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న దళితుల భూములను రాబందుల్లా దోచుకున్న 'భారత రాబందుల సమితి' అని ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల ద్వారా ప్రభుత్వానికి రూ.9 వేల కోట్లు వస్తే సిఎం రేవంత్ రెడ్డికి పేరు వస్తుందనే ఈర్ష్యతోనే బిఆర్‌ఎస్ కోర్టుల చుట్టూ తిరుగుతూ నీచ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. మూసీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 83 ఎకరాలు ఇవ్వడం బిఆర్‌ఎస్‌కు ఇష్టం లేకనే కెటిఆర్ ప్రజలను రెచ్చగొడుతున్నారని, కానీ ప్రజలు ఆయన అబద్ధాలను నమ్మరని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ లాంటి బాధ్యతారాహిత్యమైన ప్రతిపక్షం ఉంటే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని ప్రజలంతా గమనించాలని కోరారు.

# అట్టహాసంగా 'మహతీ సాహితీ కవి సంగమం' ఆరో వార్షికోత్సవం



**ప్రజాపక్షం/రవీంద్రభారతి :** మహతీ సాహితీ కవి సంగమం ఆరో వార్షికోత్సవ వేడుకలు, కవి సమ్మేళనం ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా జరిగాయి. ఈ కవి సమ్మేళనంలో యోగా దినోత్సవం సందర్భంగా 'యోగా సంగమం' అనే అంశంపై సుమారు 80 మంది తెలుగు కవులు కవితా పఠనం చేశారు. ఈ వేడుకల్లో మహతీ సాహితీ వ్యవస్థాపక అధ్యక్షులు డా.అడిగొప్పుల సదయ్య 'మహతి కవి బ్రహ్మ', 'మహతి కవి విభూషణ', 'మహతీ కవి భూషణ' , 'మహతీ కవి శ్రీ' బిరుదులతో సుమారు 30 మంది కవులను, శ్రీ పరాభవ నామ ఉగాది పురస్కారం, మహతీ జీవన సాఫల్యం పురస్కారం, మహతీ వార్షికోత్సవ పురస్కారాలతో సుమారు 20 మంది కవులను సన్మానించారు. డా.డిఎస్‌సి మహాలక్ష్మి 'కవితా దీప్తి', తనూజ వెంకట్ 'మౌనం రాసిన అక్షరాలు' జన్ను ఈశ్వరమ్మ 'జ్ఞాపకాల ముడి' పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యాఖ్యాతలు డా.నాయకంటి నరసింహ శర్మ, కుందారపు గురుమూర్తి, మహతీ సాహితీ ఉపాధ్యక్షులు ముక్కా సత్యనారాయణ, కార్యదర్శులు కె.గీతా శైలజ, దొంతరాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఫామ్-16లతో కార్ లోన్లు

## ఫెడరల్ బ్యాంకుకు రూ.1.32 కోట్ల టోకరా




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నకిలీ ఫామ్ 16లు, జీత స్లిప్పులు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, ఉద్యోగ నియామక పత్రాలు సమర్పించి కార్ లోన్లు పొందిన 12 మంది రుణగ్రహీతలపై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మోసాల కారణంగా ఫెడరల్ బ్యాంకుకు రూ.1.32 కోట్లకు పైగా బకాయిలు మిగిలినట్లు తేలింది. సికింద్రాబాద్ ప్యారడైజ్‌లోని ఫెడరల్ బ్యాంక్ శాఖ తరపున బ్యాంకు ఉద్యోగి వంశీ హరింద్ర కమిశెట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిసిఎస్ డిడి పోలీసులు క్రైమ్ నంబర్ 127/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసును ఈవోడబ్ల్యూ టీమ్7 ఎస్ఐ ఆర్.శ్రవణ్ కుమార్‌కు అప్పగించారు.

**అంతర్గత ఆడిట్‌లో బయటపడిన మోసం..** ఏప్రిల్ 2022 నుంచి డిసెంబర్ 2022 మధ్య సికింద్రాబాద్ శాఖ నుంచి కార్ లోన్లు తీసుకున్న పలువురు రుణగ్రహీతలు నకిలీ ఫామ్16లు, తారుమారు చేసిన జీత స్లిప్పులు, మార్పులు చేసిన బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్లు, నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు సమర్పించినట్లు బ్యాంకు నిర్వహించిన అంతర్గత ఆడిట్‌లో గుర్తించారు. ఆదాయపు పన్ను శాఖ పోర్టల్‌లో ఉన్న వివరాలకు వీరు సమర్పించిన పత్రాలు సరిపోలకపోవడంతో మోసం వెలుగులోకి వచ్చింది.

**12 మందిపై కేసు నమోదు..** ముకీత్ మొహియుద్దీన్, మహ్మద్ అస్లాం, పల్లా సంధ్యారాణి, బుచ్చంపల్లి దత్తు రెడ్డి, మహ్మద్ అబ్దుల్ ముకీమ్, గుండోజు శిరీష, పబ్బాల సురేష్, షైమా, తొగట మహాలక్ష్మి, గంధం రామకృష్ణ, మహంకాళి రాధిక, కుంటముక్కల పల్లవిలు నకిలీ పత్రాల ఆధారంగా వివిధ కార్ల కోసం రూ.7.5 లక్షల నుంచి రూ.23 లక్షల వరకు రుణాలు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**చాలా ఖాతాలు ఎన్‌పిఎగా మారినట్లు వెల్లడి..** లోన్లు పొందిన వారిలో ఎక్కువ మంది రుణాలు చెల్లించకపోవడంతో ఖాతాలు ఎన్‌పీఏలుగా మారినట్లు బ్యాంకు తెలిపింది. కొందరు తాము పేర్కొన్న ఉద్యోగాల్లో పనిచేయలేదని, మరికొందరి వద్ద రుణంతో కొనుగోలు చేసిన వాహనాలే లేవని విచారణలో బయటపడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మోసాలన్నింటినీ భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం ఇప్పటికే నివేదించినట్లు ఫెడరల్ బ్యాంకు తెలిపింది. మొత్తం రూ.1,32,47,088 బకాయిలు ఉన్నాయని పేర్కొంటూ సంబంధిత రుణగ్రహీతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. ఫిర్యాదు ఆధారంగా సిసిఎస్ పోలీసులు ఐపీసీ సెక్షన్లు 420 (మోసం), 468 (ఫోర్జరీ), 471 (నకిలీ పత్రాలను అసలైనవిగా వినియోగించడం) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కెటిఆర్ పని పాట లేకుండా పర్యటనలు చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పని పాట లేకుండా పర్యటనలు చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మార్చారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి ప్రజల ఆదరణతో ముఖ్యమంత్రి పదవిని అధిరోహించారని, దీనిని జీర్ణించుకోలేక బిఆర్‌ఎస్ నేతలు విమర్శలకు దిగుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. రేవంత్ రెడ్డిని రెన్యూవల్ సిఎంగా కెటిఆర్ వ్యాఖ్యానించడంపై స్పందిస్తూ, ప్రజల మద్దతుతో ప్రతి ఎన్నికల్లో విజయాన్ని సాధిస్తూ ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించి మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రతిపక్షంగా బిఆర్‌ఎస్ నిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన బాధ్యత ఉందని, కానీ అసహనం, అహంకారంతో విమర్శలు చేయడం మానుకోవాలని మేడిపల్లి సత్యం సూచించారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించడం లక్ష్యంగా తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ, అనుబంధ విభాగం తెలంగాణ ఈవెంట్ ఫెసిలిటేటర్స్ అసోసియేషన్‌తో కలిసి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ సుందరమైన సరస్సు తీరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించింది. నేహా శుక్లా ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఆ తర్వాత వివేక్ దేపల్లె నేతృత్వంలో ధ్యానం, శ్వాసక్రియ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.వెంకటరమణ మాట్లాడుతూ, ఒత్తిడితో కూడిన ఈ ప్రపంచంలో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ సమతుల్యత అత్యవసరం అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బలరాం బాబు, జనరల్ సెక్రటరీ రవి బురా, కోశాధికారి తౌఫిక్ ఖాన్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, తెలంగాణ ఈవెంట్ ఫెసిలిటేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్ రాజా, అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 కన్వీనర్ అజ్మత్ అలీ, కో కన్వీనర్ జిజ్ఞా మెహతా తదితరులు పాల్గొన్నారు.

# 'న్యాయమూర్తుల' నియామకాల్లో తెలంగాణ న్యాయవాదులను పరిగణలోకి తీసుకోండి

## ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షంగా ఒత్తిడి తీసుకురండి

## తెలంగాణ హైకోర్ట్ న్యాయవాదుల సంఘం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో కేవలం తెలంగాణ రాష్ట్రానికి చెందిన న్యాయవాదుల పేర్లనే పరిగణనలోకి తీసుకోవాలని,సామాజిక న్యాయాన్ని పాటిస్తూ, సమాజంలోని అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం తీర్మానించిందని ఆ సంఘం అధ్యక్షుడు ఎస్.సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ తీర్మాన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, వీటిని అమలు చేసే విధంగా ప్రధానప్రతిపక్షంగా ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకురావాలని ఆయన బిఆర్‌ఎస్‌ను కోరారు. ఈ మేరకు ఎస్.సురేందర్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్, నందినగర్‌లో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావును ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ హైకోర్టు నియామకాల్లో ఇతర ప్రాంతాలకు చెందిన వారు స్థానికతను తప్పుగా చూపుతూ, అవకాశాలను దక్కించుకుంటున్నారని, తద్వారా తెలంగాణకు చెందిన అర్హులైన న్యాయవాదులకు అన్యాయం జరుగుతోందని సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇటీవల హైకోర్టులో నిరసన ప్రదర్శన నిర్వహించామని గుర్తు చేశారు. న్యాయవాదులకు తమ పూర్తి అండగా ఉంటామని కెటిఆర్ హామీనిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘంఉపాధ్యక్షులు డి.ఎల్. పాండు, కార్యదర్శులు పి.శ్రవణ్ కుమార్ గౌడ్, నిరంజన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ కుమారి పి.కృష్ణ కీర్తన, కోశాధికారి బాలాజీ బానోత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల సాకారం



ప్రజాపక్షం/నవాబ్‌పేట్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని భీమ్ భరత్ అన్నారు. ఆదివారం నవాబ్ పేట్ మండలం నారేగూడ గ్రామంలో సర్పంచ్ దీపికదశరథ్ ఆధ్వర్యంలో బేగరి అమృతరత్నం నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ భీమ్ భరత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇల్లు లేని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు మంజూరు చేసి సొంతింటి కల నెరవేర్చడమే సిఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని,లబ్ధిదారులు సకాలంలో ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, నాయకులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతగా ముగిసిన నీట్ ఎగ్జామ్



ప్రజాపక్షం/వికారాబాద్ : జిల్లా కేంద్రంలో నీట్ ఎగ్జామ్ ప్రశంతంగా ముగిసిందని జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా అయనమాట్లాడుతూ ఐదు సంటర్లో 1215 మంది అభ్యర్థులకు గాను 1088మంది హజరైయ్యారని తెలిపారు, ఇందులో 27మంది గైరాహజరు కావడం జరిగిందన్నారు. 89.55శాతం హజరు కావడం జరిగిందన్నారు. ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా ఎస్పిఅదేశాల మేరకు డిఎస్పి అంజయ్య అధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిలత,తాహసీల్దార్లు విజయ్‌కుమార్ , లక్ష్మి నారాయణ, మున్నేర్ ,మనెహర్‌చక్రర్తి ,అనంద్‌రావు తదితరులు పాల్గోన్నారు.

## ఎన్నికల హామీలు నెరవేర్చుతున్న సిఎం



ప్రజాపక్షం/శామీర్‌పేట : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తెలంగాణ రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డి దశల వారిగా నెరవేర్చుతున్నాడని జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అలియాబాద్ మున్సిపాలిటికి చెందిన బైండ్ల దేవమ్మ, మహేష్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని రిబ్బన్ కట్‌చేసి ప్రారంబించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని వారికి రూ.5 లక్షలు ఇస్తుందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ నిరంతరంగా ఉంటుందని ఇళ్లులేని వారు ప్రతి ఒక్కరు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన సిఎం రేవంత్‌రెడ్డికి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు లబ్దిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, కౌన్సిలర్లు జశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : గత 17 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్ రైల్వే వంతెన నిర్మాణ పనులను వెంటనే వేగవంతం చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. నందం గణేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజకీయాలకు అతీతంగా రైల్వే వంతెన ప్రాంగణంలో ఆదివారం సమావేశమైన గ్రామస్తులు బకాయిలు విడుదలైనప్పటికీ పనుల్లో పురోగతి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.గత రెండు సంవత్సరాలుగా ప్రజల పోరాటంతో సుమారు నాలుగు కోట్ల రూపాయలు కాంట్రాక్టర్‌కు విడుదలైనప్పటికీ నిర్మాణం నత్తనడకన సాగుతోందని విమర్శించారు. వెంటనే పనులు ప్రారంభించకపోతే గవర్నర్,ముఖ్యమంత్రికి,మంత్రులకు, అధికారులకు, వినతిపత్రాలు ఇవ్వడంతో పాటు రహదారి దిగ్బంధం అధికార కార్యక్రమాల బహిష్కరణ ఎన్నికల బహిష్కరణ వంటి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వంతెన నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మారం లక్ష్మారెడ్డి,బచ్చు నాగేష్‌గుప్త,బండారి శ్రీనివాస్ గౌడ్,బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి, బర్ల ఆంజనేయులు,బచ్చు ప్రమోద్ గుప్త, ఎబివిపి అంకం శ్యామ్‌కిరణ్, అంకం సురేష్ యాదవ్,మేకల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కె.ఎం ప్రతాప్ జన్మదిన వేడుకలు




ప్రజాపక్షం/నిజాంపేట్:రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కె.ఎం.ప్రతాప్ జన్మదినం సందర్భంగా, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, కార్మిక నాయకులు, కర్షకులు, అభిమానులు తదితరులు, కుత్బుల్లాపూర్ గ్రామంలోని సి.పి. ఆర్. కాలనీలో గల ప్రతాప్ నివాసం వద్ద పుట్టినరోజు కేకును కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. జన్మదిన వేడుకలలో భాగంగా, హెచ్.ఎం.టి. కాలనీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి రషీద్,ఎండి సిరాజ్ ఆధ్వర్యంలో నిర్మాణ్ డిసేబుల్డ్ ఒకేషనల్ ట్రైనింగ్ కం ప్రొడక్షన్ సెంటర్‌లో విద్యార్థులకు పండ్లు,పాలు, బ్రెడ్‌ను పంచిపెట్టారు. కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో శ్రీ రామాంజనేయ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీలా, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాపక్షం /పరిగి : మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో నస్కల్ గ్రామంలో కౌన్సిలర్ లక్ష్మి చంద్రయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ , విద్యార్థులు బాగా చదువుకొని అందరి మన్నలను పొందాలని సూచించారు.

# ప్రజల వెన్నంటి నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులే

- కమ్యూనిస్టుల ఆవశ్యకతను ప్రజలకు తెలపాలి
- ఇకపై పార్టీ నేతలు బస్తీల్లో తిరిగాలి
- పార్టీని బలోపేతం చేయాలి
- ప్రభుత్వాలను ప్రశ్నించేది కమ్యూనిస్టులే




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ప్రజల హక్కులు, సమస్యల కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులే అని, కమ్యూనిస్టుల ఆవశ్యకతను ప్రజలు తెలుసుకుంటున్న విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్తించి దానికి అనుగుణంగా ముందుకు సాగాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపిచ్చారు. ఆదివారం ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో జరిగిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయి సిపిఐ నాయకుల రాజకీయ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు ప్రజల ఆకాంక్షల మేరకు తమకు తాము తీర్చి దిద్దుకొని కమ్యూనిస్టు ప్రజా ప్రతినిధులను, ప్రభుత్వాల ఏర్పాటు దిశగా పని చేయాలన్నారు. వరంగల్‌లో గుడిసెలు కూల్చేస్తే బాధితుల పక్షాన నిలిచి పోరాడిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమే అని, ఈ విషయంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ కనీస ధర్మంగా అయినా వారి చెంతకు రాలేదన్నారు. సిపిఐ చేసిన పోరాటాలను పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్న దినపత్రికలు కనీసం వార్తా కథనాలతో పాఠకులకు చేరవేయలేదన్నారు. అయినప్పటికి పార్టీ ఏ మాత్రం వెనకడుగు వేయదని, గతంలో అనేక సందర్భాల్లో ప్రజా పోరాటాలతో విజయాలు సాధిస్తూనే ఉంటుందన్న విషయం అనేక సందర్భాల్లో నిరూపితమైందన్నారు. కార్మికుల హక్కుల కోసం, ఇండ్లు లేని నిరుపేదల కోసం, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం, పెన్షన్ల కోసం, రేషన్ కార్డుల కోసం ఇలా ఎలాంటి ప్రజా సంబంధిత సమస్యలనైనా సిపిఐ భుజాలపై వేసుకొని తమ బాధ్యతగా పని చేస్తుందని కూనంనేని తెలిపారు. సిపిఐ నాయకులు ఇక నుండి బస్తీలు, కాలనీల్లో తిరుగుతూ స్థానిక సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారం కోసం పని చేయటం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కమ్యూనిస్టులు లేక పోతే ప్రభుత్వాలను ప్రశ్నించే వారే దేశంలో ఉండరని, దీని వల్ల దేశానికి, ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, సమాజంలో అసమానతలు ఉన్నంత కాలం కమ్యూనిస్టుల ఆవశ్యకత ఉంటుందని ఆయన స్పష్టం చేసారు. అసమానతలు, పెట్టుబడిదారుల దోపిడీ పోవాలంటే ప్రజల్లో మరింత చైతన్యం రావాలన్నారు. ఎస్ఐఆర్ (సర్) పేరిట బిజెపికి వ్యతిరేకంగా ఉన్న వాళ్ల ఓట్లు తొలగించే దుష్టపన్నాగానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ తెరలేపిందని, దీన్ని అడ్డుకోవటంలో సిపిఐ బాధ్యత ప్రాధాన్యత ఎంతైనా ఉందన్నారు. దీని కోసం రాజకీయ పార్టీలను కలుపుకొని పోరాటాలకు పిలుపిచ్చిందని, వాటిని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కూనంనేని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసూఫ్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, సైకాలజిస్ట్ హరీష్ ఆజాద్, పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, కార్యవర్గ సభ్యులు దామోదర్‌రెడ్డి, సాయిలు గౌడ్, స్వామి, లక్ష్మి , ధర్మేంద్ర, శంకర్‌రావు, సత్యప్రసాద్, కిషన్, హరినాథ్, నర్సింహ, శ్రీనివాస్, యాదయ్య గౌడ్, మహిళా సమాఖ్య అధ్యక్షులు హైమావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రజా నాట్యమండలి కళాకారులు తమ పాటలతో ఉత్తేజితులను చేసారు.

# అటవీ భూముల్లో తవ్వకాలు

- అందిన కాడికి దోచుకుంటున్న అక్రమదారులు
- పక్కదారి పడుతున్న పకృతి సంపద
- బృహత్ పల్లె పకృతి వనంలో చెట్లను తొలగించి మట్టి తవ్వకాలు



ప్రజాపక్షం/బంట్వారం : బంట్వారం మండల కేంద్రంలో యథేచ్ఛగా మొరం తవ్వకాలు, ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టలు ప్రభుత్వ, అటవీ భూములను తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లు జెసిబిల ద్వారా రేయింబవళ్లు అధికారుల కనుసైగల్లో పదవులను అడ్డు పెట్టుకోని అధికారం ఉందని సొంత లాభాలకు మొరం తవ్వకాలను కొనసాగిస్తున్నారు. అందుకు సహకరిస్తున్న పాలకులకు ఇచ్చిన కాడికి తీసుకోని, అవసరమైనవారికి వేల రూపాయాలకు మొరం అమ్ముకోని సోమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి లీజు, పన్ను చెల్లించకుండానే రోడ్డు కాంటక్టర్లకు, ప్లాట్లకు మట్టిని తరలిస్తున్నారు. ఓ ప్రజా ప్రతినిధి తాను చేసిందే న్యాయం అంటూ, రోడ్డు కాంట్రాక్ట్ పనుల కోసం తన ఇష్టానుసారంగా అధికారం తన చేతులో ఉంది. నాకు ఎవ్వడు అడ్డు చెప్పేదని, ప్రభుత్వ పల్లె పకృతి వనంలో నాటిన చెట్లు తొలగించి మొరం తవ్వి, అక్రమంగా మట్టి తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. ఫారెస్టు అధికారులు మా త్రం ఒక రైతు తన పాడి ఎద్దుల అరుక కోసం కట్టెలు తీసుకుందామంటే, గోడ్డలి చేతుల్లో ఉంటే చాలు.. కేసు వెస్తామని బెదిరించిన దాఖాలాలు ఎన్నో ఉన్నాయి. కానీ అధికారం బలం ఉన్న సర్పంచులకు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ భూముల నుంచి గుట్టలు తవ్వి పకృతి సంపదను నాశం చేసేందుకు అధికారులు సహకరిస్తూన్నారు. మండల కేంద్రంలో ఉన్నటువంటి బడెసవులా గుట్ట అనుకోని సర్వే నెంబర్ 360లో ఎన్ఆర్ఇజిఎస్ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో లక్షలు వెచించి బృహత్ పల్లె పకృతి వనంలో చెట్లను నాటడం జరిగింది. పార్కు కోసం కేటాయిం చిన రెవెన్యూ, అటవీ భూమిలో అక్కడక్కడ చెట్లను తోలగించి మరి మొరం తవ్వకాలను అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు కనుసైగల్లో తవ్వకాలు జరుపుతున్నారు. మట్టి తవ్వకాలను కోనసాగిస్తున్నా అక్రమార్కులు, స్థానిక ప్రజా ప్రతినిధుల ప్రధాన అనుచరులమని చెప్పుకుంటూ ఈ దందాను యధేచ్ఛగా కోనసాగిస్తున్నట్లు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి రవాణా రాత్రుల్లో జరుగుతున్నప్పటికి సంబంధిత యంత్రంగం నిద్ర మత్తులో ఉంటుందే తప్ప పకృతి సంపదను కాపాడేందకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైన అటవి భూములను కాపాడేందుకు రెవెన్యూ, అటవీ, గనులు భూగర్భ శాఖ, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా చర్యలు చేపడితే తప్ప ఈ అక్రమాలను అడ్డుకట్ట వేయడం సులువు కాదు. సంబంధిత శాఖ నిద్రమత్తు వీడి అక్రమార్కుల నుండి పకృతి సంపద ను కాపడాల్సిన బాధ్యత అధికారులదేనని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తహసీల్దార్ విజయ్ కూమార్ వివరణ

అక్రమ మొరం మట్టి తరలిస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని, వస్తే చర్యలు తీసుకోవడంతో పాటుగా సంబంధిత అధికారులకు, మైనింగ్ అధికారులకు నివేదిక పంపించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతందని స్థానిక తహసీల్దార్ విజయ్ కూమార్ పేర్కోన్నారు.

## ఉద్యమకారుడు విష్ణువర్ధన్‌గౌడ్‌కు కన్నీటి వీడ్కోలు



ప్రజాపక్షం/శామీర్‌పేట : తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి తెలంగాణ సాధనకు కృషి చేసిన నేమూరి విష్ణువర్ధన్‌గౌడ్ ఆకస్మికంగా తుది శ్వాస విడిచాడు. మూడుచింతలపల్లి మున్సిపల్ ఉద్దెమర్రి గ్రామానికి చెందిన నేమూరి విష్ణువర్ధన్‌గౌడ్ గత వారం రోజుల క్రి తం బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతు యశోధ ఆస్పత్రిలో చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందాడు. దీంతో ఉమ్మడి శామీర్‌పేట మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన భౌతికకాయానికి జిల్లా కాం గ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎంఎల్‌ఎ మలిపెద్ది సుదీర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి, అలియాబాద్ మాజీ స ర్పంచ్ కమతం కృష్ణారెడ్డిలతో పాటు ఉమ్మడి మండలానికి చెందిన మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, బంధువులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి విష్ణువర్ధన్‌గౌడ్ కు ఘనంగా నివాళ్లర్పించారు. ఆయన కుటుంబానికి తమ ప్రఘాడ సానుభూతిని తెలిపారు.

## రైతు సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రజాపక్షం/నవాబ్ పేట్ : రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బిఆర్ఎస్ పార్టీ నవాబ్ పేట్ మండలం అధ్యక్షుడు దయాకర్ అన్నారు. శనివారం నవాబ్ పేట్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు దయాకర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయడంలో రేవంత్ రెడ్డి సర్కారు ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేసి, పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు సక్రమంగా అమలు కావడంలేదని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 25న చేవెళ్లలో ఎస్ఐఆర్ నిర్వహించనున్న కార్యక్రమం, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలనీ చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య సొంత మండలంలోనే రహదారుల సమస్యను పరిష్కరించలేకపోవడం బాధాకరమని విమర్శించారు. ఇప్పటికైనా మండలంలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులను వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ముందుగా ప్రొఫసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన ఫోటోకు పూలమాలవేసి నివాళులర్పించి ఆయన గురించి పలు విషయాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు పట్లోళ్ల భరత్ రెడ్డి, సయ్యద్ గౌస్, శాంత్ కుమార్, మహేశ్వర్ రెడ్డి, పురుషోత్తం, నాయకులు గోపాల్, సంతోష్ కుమార్, మల్లేశం, గోవర్ధన్, ముకుంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపులు రాజకీయ శక్తిగా ఎదగాలి

రాష్ట్ర మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పటేల్



ప్రజాపక్షం/శామీర్‌పేట : మున్నూరుకాపులు పార్టీలకతీతంగా రాజకీయ శక్తిగా ఎదగాలని అన్ని రంగాల్లో యువత రాణించాలని రాష్ట్ర మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పటేల్ అన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని శుభం గార్డెన్‌లో మేడ్చల్ మల్కాజ్‌గిరి మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన మేడ్చల్ జిల్లా యువక మండలి ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పటేల్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా కులాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కుల ఐఖ్యత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ హాయాంలో కుల సంఘానికి బిఆర్ఎస్ పార్టీ ఐదు ఎకరాల భూమి కేటాయించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్‌కు రూ.5 కోట్లు ఇచ్చారని తెలిపారు. కులం బలంగా ఉంటేనే రాజకీయ అవకాశాలు వాటంతట అవే వస్తాయని చెప్పారు. అనంతరం జిల్లా యువక మండలి అధ్యక్షుడుగా ఎన్నికైన ఆకుల యశ్వంత్ పటేల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పటేల్, ఉపాధ్యక్షులుగా బోగారం నరేష్ పటేల్ పూజారి మహేష్ పటేల్ తదితరులకు నియామక పత్రాలు అందజేసి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం పటేల్, జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగారవు పటేల్, ఆకుల సత్యనారాయణ పటేల్, జిల్లా బిజెపి అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ పటేల్, కటికం రాజు పటేల్, తదితరులు పాల్గొన్నారు. కాగా మున్నూరుకాపు యువక మండలి ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా నాయకుడు ఆకుల సత్యనారాయణ పటేల్ మూడుచింతలపల్లి మున్సిపాలిటి లక్ష్మాపూర్ గ్రామంలోని మున్నూరుకాపు భవనం నిర్మాణం కొరకు రూ. 30 వేలు విరాళం సంఘం అధ్యక్షుడు లగిశెట్టి దయానంద్ పటేల్‌కు చెక్ రూపంలో అందజేశారు.

# అత్యంత ప్రభావవంతమైన సాధనం యోగా



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/జవహర్‌నగర్ : వారసత్వంగా భారతదేశానికి దక్కిన యోగా కేవలం శారీరక వ్యాయామానికి మాత్రామే కాకుండా మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను సాధించే సమగ్ర జీవన విధానమని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ చంద్రకళ పేర్కొన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఆల్వాల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయటం ద్వారా ఒత్తిడి, ఆందోళన, నిద్ర లేమి వంటి సమస్యలను తగ్గించుకోవచ్చని, మధుమేహం, రక్త పోటు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు సైతం నివారణకు మార్గమవుతుందన్నారు. ప్రస్తుత వేగవంతమైన జీవన శైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని, ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 30 నిమిషాల పాటు యోగా సాధన చేయటం వల్ల శారీరక ధృఢత్వం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ సమతుల్యతను పొందవచ్చన్నారు. యోగాసనాలు, ప్రాణాయమం, ధ్యాన విధానాలను ప్రదర్శించిన ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖాకు చెందిన వైద్యులు లావణ్యరెడ్డి, శ్రీదేవి, నాగరాజు, బోగేశ్వర్, గోలి శ్రీకాంత్, ఆయుష్ వైద్యురాలు శ్రీదేవి, హోమియో వైద్యుడు ఆనఫ్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. జవహర్‌నగర్‌లోని ఫ్లవర్ గార్డెన్స్‌లో హఠ యోగ ఆశ్రమ యోగ గురు శంకరాచారి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక యోగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శంకర్‌గౌడ్, శాంతి కోటే, మేకల కావ్య, శ్రీకాంత్ యాదవ్, సదానందం, గణేషాచారి, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**దమ్మాయిగూడలో** : యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. దమ్మాయిగూడలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ శాంతికోటేష్‌గౌడ్,నాయకులు శంకర్‌గౌడ్, మల్లేష్‌యాదవ్,జీవన్‌రెడ్డి,పాండాల యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



### నాగారం సెరినిటీ స్కూల్ యోగా దినోత్సవం



యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని సెరినిటీ పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు దరిచేరవని సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు,యోగా గురువులు తదితరులు పాల్గొన్నారు.

### అనురాగ్‌లో యోగా సందడి

అనురాగ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026ను ఘనంగా నిర్వహించారు.జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలకు అనుగుణంగా జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఇంజినీరింగ్ విద్యా విభాగం డీన్ డాక్టర్ వి.విజయ కుమార్ ప్రారంభించారు.కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది,జాతీయ సేవా పథకం వాలంటీర్లు జాతీయ కేడెట్ దళం సభ్యులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




**దుండిగల్‌లో:**అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ బాలుర ప్రత్యేక సదనము గాజులరామారం హైదరాబాద్ కు ముఖ్యఅతిథిగా మెంబర్ సెక్రెటరీ తెలంగాణ లీగల్ సర్వీస్ అథారిటీ సిహెచ్ పంచాక్షరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హోం సూపరెంట్ సుజాత గౌతమి, డిప్యూటీ సూపెంట్ వై.కాశీ విశ్వనాథ్, అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

### జైలులో యోగా దినోత్సవం

ఖైదీలలో శారీరక దృఢత్వం,మానసిక ఆరోగ్యం,భావోద్వేగ సమతుల్యత,ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో 10వ తేదీ నుండి రాష్ట్రంలోని అన్ని జైళ్లలో యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా తెలిపారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి యోగా పీఠ్,బ్రహ్మకుమారీస్,యోధా అకాడమీ,ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఐడ్రీమ్ యోగా సెంటర్,తత్వమసి ఫిట్‌నెస్ క్లబ్,వైదిక యోగాపీఠ్ ట్రస్ట్,అల్పోర్స్ విద్యా సంస్థల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.



## జయశంకర్ ఆశయాలను సాధిద్దాం



ప్రజాపక్షం/మల్కాజిగిరి : తెలంగాణా సిద్దాంత కర్తగా ఖ్యాతి గాంచిన ఆచార్య ప్రొఫెసర కొత్తపల్లి జయశంకర్ ఆశయాల మేరకు కృషి చేద్దామంటూ బిఆర్ఎస్ శ్రేణులు ఆదివారం ప్రతిన పూనారు. జయశంకర్ 15వ వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గం గౌతంనగర్ డివిజన్‌తో పాటు మల్కాజిగిరి చౌరాస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు బద్దం పరశురాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, ఖలీల్, నర్సింగ్, ఉపేందర్, నీలం సతీష్, సైదులు,ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

### నిజాంపేట్ సర్కిల్ పరిధిలో...

ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆదివారం నిజాంపేట్ సర్కిల్ పరిధిలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై, బిఆర్ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరెడ్డి ఆధ్వర్యంలో ప్రగతి నగర్ అలీఫ్ సర్కిల్ వద్ద, రాజు గృహకల్పలో, బిక్షపతి సాయినగర్‌లో, సింహపురి కాలనీలో ఏర్పాటు చేసిన జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాలాజీ నాయక్, మధుసూదన్, తాళ్లూరి ప్రదీప్, కురుమూర్తి, జయరాజ్, చందు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
సోమవారం
22-06-2026
www.prajapaksham.in

“ శ్రీ విష్ణు హీరోగా నటించిన తాజా చిత్రం కామ్రేడ్ కళ్యాణ్. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో, కోన వెంకట్ సమర్పణలో, స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ ఎల్ పి బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. ”


రీల్

## మోస్ట్ వాంటెడ్ యాక్టర్ రాజీవ్

### ‘హ్రీం’ టీజర్ లాంఛ్ ఈవెంట్‌లో నిర్మాత అచ్చి రెడ్డి



పవన్ తాతా, చమింద వర్మ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా ‘హ్రీం‘. ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, బెనర్జీ, భద్రమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీమతి సుజాత మల్లాల సమర్పణలో శివ మల్లాల నిర్మిస్తున్నారు. హారర్, మిస్టికల్ థ్రిల్లర్ స్టోరీతో దర్శకుడు రాజేష్ రావూరి రూపొందిస్తున్నారు. ‘హ్రీం‘ సినిమా టీజర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, ప్రముఖ నిర్మాత అచ్చిరెడ్డి చేతుల మీదుగా ఈ చిత్ర టీజర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ అచ్చిరెడ్డి మాట్లాడుతూ నిర్మాతగా శివ మల్లాల ఫ్యాషన్ తెలుస్తోంది. హీరోయిన్ చమింద వర్మకు ఈ సినిమాతో పేరు రావాలి. రాజీవ్ కనకాల హీరో కావాల్సినవాడు. క్యారెక్టర్ యాక్టర్ గా ఇప్పుడు ఇండస్ట్రీకి మోస్ట్ వాంటెడ్ గా మారాడు. తనికెళ్ల భరణి కూడా ఒక మంచి ఇంపార్టెంట్ రోల్ చేశారు అన్నారు. ఎప్పుడు వచ్చినా ఈ మూవీ మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ మార్కస్ మాట్లాడుతూ ఈ సినిమాకు ఒక జానర్ అనుకుని ఫిక్స్ అయి ఆ కాన్సెప్ట్ మీద మ్యూజిక్ చేసుకుంటూ వెళ్లాం. హ్రీం సినిమా మ్యూజిక్ మీ అందరినీ ఆకట్టుకుంటుందనే ఆశిస్తున్నా. అన్నారు .డైరెక్టర్ రాజేష్ రావూరి మాట్లాడుతూ నేను కొత్త డైరెక్టర్ అయినా ఈ సినిమాలో నటించిన చాలా మంది సీనియర్ నటులు నాకు కో–ఆపరేట్ చేశారు. మా హీరో హీరోయిన్స్ పవన్, చమింద బాగా పర్ఫార్మ్ చేశారని చెప్పారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ శివ ఈ సినిమాకు ఏ మంత్రం నేర్చుకున్నాడో గానీ మూవీ కాస్టింగ్‌లో ఒకరిగా మారిపోయాను. ఈ సినిమాలో నా క్యారెక్టర్ డిఫరెంట్ గా చాలా బాగుంటుంది అన్నారు.



తమిళ్ హీరో విశాల్ ప్రస్తుతం ‘మకుటం’ చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ మూవీతో విశాల్ దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాకు రవి అరుసు కథను అందించారు. విశాల్ 35వ చిత్రంగా రాబోతోన్న ఈ ‘మకుటం’ని సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్ మీద దివంగత ఆర్ బి చౌదరి 99వ చిత్రంగా భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. విశాల్ సరసన ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ నటిస్తున్నారు.విశాల్ ఈ చిత్రంలో మూడు డిఫరెంట్ లుక్స్‌లో కనిపించబోతోన్నారు. తాజాగా విశాల్ ఈ సినిమాలో లింగా అనే పవర్ ఫుల్ పాత్రకు సంబంధించి ‘రైజ్ ఆఫ్ లింగా’ అనే పాటను విడుదల చేశారు. ‘రైజ్ ఆఫ్ లింగా’ పాటని విశాల్, జివి ప్రకాష్ సంయుక్తంగా ఆలపించారు. జూలైలో మూవీని రిలీజ్ చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ఎన్.బి. శ్రీకాంత్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. దురైరాజ్ కళా దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ రిచర్డ్ ఎం. నాథన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు.

### ‘రైజ్ ఆఫ్ లింగా’ పాట విడుదల

## ‘కామ్రేడ్ కళ్యాణ్’ లో ఒక కొత్త భాష మాట్లాడాను: హీరో శ్రీ విష్ణు



శ్రీ విష్ణు హీరోగా నటించిన తాజా చిత్రం కామ్రేడ్ కళ్యాణ్. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో, కోన వెంకట్ సమర్పణలో, స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ ఎల్ పి బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. 1992 నాటి ఆంధ్రఒడిశా సరిహద్దు నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఇందులో మహిమ నంబియార్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాలోని మొదటి పాట ‘ఒరియా పిల్ల’ను విడుదల చేశారు. ఈ పాట ఒక సున్నితమైన ప్రేమకథను ప్రజెంట్ చేసింది. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ మెలోడీ, ఆకట్టుకునే ట్యూన్‌తో పాటు హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలను పలికించింది. వింటేజ్ మాధుర్యాన్ని గుర్తు చేసే ఈ గీతానికి సిద్ శ్రీరామ్ తన మంత్రముగ్ధం చేసే వాయిస్‌తో ప్రాణం పోశారని చెప్పవచ్చు. ప్రేమలో మొదటి సారి కలిగే ఆనందం, అమాయకత్వం ఆయన తన స్వరంతో అద్భుతంగా పలికించారు.భాస్కరభట్ల అందించిన సాహిత్యం ఓ ఒరియా యువతిపై ప్రేమలో పడిన యువకుడి భావాలను ఎంతో అందంగా ఆవిష్కరించింది. ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ ఛాయాగ్రహణం అందించగా, విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూర్చారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్ గ పని చేశారు. ఈవెంట్లో హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ 90 లో జరిగిన ఒక సంఘటనలు ఆధారంగా తీసుకుని, దానికి ఫిక్షన్ జోడించి కోన వెంకట్ ఒక అద్భుతమైన కథతో నా దగ్గరకు వచ్చారు. స్క్రిప్ట్ అద్భుతంగా వచ్చిన తర్వాతే షూటింగ్ ప్రారంభించాం.‘ఒరియా పిల్ల’ అనే పదంతో పాట చేయాలనే ఆలోచన కూడా నాదే. విజయ్ ఆ ఆలోచనను అద్భుతంగా మ్యూజికల్ రూపంలో అందించాడు. ఈ చిత్రంలో చాలా పెద్ద స్టార్ కాస్ట్ నటిస్తోంది. ‘కామ్రేడ్ కళ్యాణ్’ నూటికి నూరు శాతం విజయాన్ని సాధిస్తుందని నమ్ముతున్నాను అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు జానకిరామ్, నిర్మాత వెంకట కృష్ణ కర్నాటి, షైన్ టామ్ చాకో , సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్, లిరిక్ రైటర్ భాస్కర భట్ల, ఎడిటర్ చోటా కె. ప్రసాద్, రచయిత బివిఎస్ రవి పాల్గొన్నారు.

## మణిశర్మ పూర్వ వైభవం ప్రదర్శించే చిత్రమిది



### జిగితార పాట విడుదలలో అనంత్ శ్రీరామ్

తిరుపతిలో భారీ జన సందోహం మధ్య గ్రాండ్ గా హీరో కిరణ్ అబ్బవరం ‘చెన్నై లవ్ స్టోరీ‘ మూవీ మ్యూజికల్ ఫెస్ట్ జరిగింది. ఈ ఈవెంట్ లో మూవీ నుంచి థర్డ్ సింగిల్ ’జిగితార..’ రిలీజ్ చేశారు. మణిశర్మ కార్యక్రమంలో ఉర్రూతలూగించాయి. ఈ ఈవెంట్ లో ప్రదర్శించిన ’జిగితార..’ సాంగ్ అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గేయ రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ అల్లసాని పెద్దన శైలి జిగి బిగి అని ప్రసిద్ధి. ఆ పదమే జిగితార పాట రాసేందుకు స్ఫూర్తిగా నిలిచింది. ఒకప్పుడు గీతాంజలి, అభినందన వంటి గొప్ప ప్రేమ కథలు వచ్చాయి. ఆ సినిమాలకు మేము పాటలు రాసే అవకాశం దక్కలేదు అని బాధపడుతుంటాం. ప్రేమను తప్ప ప్రేయసి నుంచి ఏ నిజమైన ప్రేమికుడూ మరేదీ ఆశించడు. కానీ ఈ చిత్రంలో హీరో హీరోయిన్ నుంచి కనీసం ఆ ప్రేమను కూడా ఆశించనంత నిస్వార్థంగా ప్రేమిస్తాడు. మణిశర్మ మరోసారి తన పూర్వ వైభవం ప్రదర్శించే చిత్రమిది. ఈ జిగితార పాట సంగీత ప్రియుల మనసులో పగలూ రాత్రీ వెలుగుతూనే ఉంటుంది అని అన్నారు. డైరెక్టర్ రవి నంబూరి మాట్లాడుతూ జిగితార పాట సినిమా ప్రారంభమైన 30 నిమిషాలకు వస్తుంది. ఈ పాట మా అందరికీ చాలా స్పెషల్. పాటను కంపోజ్ చేసే టైమ్ లో మణితో, అలాగే పాట రాసేప్పుడు అనంత శ్రీరామ్‌తో ఆమూ వ్‌మెంట్స్‌ంజాయ్ చేశాం. 20 రోజుల షూటింగ్ తర్వాత నివి పాత్రలో గౌరిని తప్ప మరొకరిని ఊహించుకోలేకపోయాను అన్నారు. ప్రొడ్యూసర్ ధీరజ్ మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ హీరో కిరణ్ జూలై 24న సినిమా ప్రారంభమైన 30వ నిమిషం జిగితార సాంగ్ వస్తుంది. ఆ సాంగ్ కు ముందు లీడ్ మీకు గూస్ బంప్స్ తెప్పిస్తుంది. చెన్నై లవ్ స్టోరీ సినిమాలోని కాన్వర్జేషన్స్ చాలా ఏళ్లు మీకు గుర్తుండిపోతాయని అన్నారు. చిత్ర కథా రచయిత, ప్రొడ్యూసర్ సాయి రాజేష్ , ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్ కూడా మాట్లాడారు .

“

## 26న 4కేలో ‘ఒక్కడు’ రీ– రిలీజ్



సుమంత్ ఆర్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎమ్మెస్ రాజు నిర్మాతగా దర్శకుడు గుణశేఖర్ దర్శకత్వంలో 2003లో మహేష్ బాబు హీరోగా ప్రేక్షకులకు ముందుకు వచ్చిన చిత్రం ఒక్కడు. సుమారు 23 సంవత్సరాల తర్వాత ఆంధ్ర, తెలంగాణతో పాటు భారతదేశవ్యాప్తంగా 4కేలో టెక్నాలజీతో తెలుగులో విడుదలవుతుంది. కర్నూలు కొండారెడ్డి బురుజు అంటే ఒక్కడు సినిమా అన్నట్లు ఒక మార్క్ సృష్టించి ఇండస్ట్రీ అంతా షేక్ చేసే విధంగా అద్భుతమైన విజయం సాధించిన ఈ చిత్రం రాధా మాధవి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ సమర్పణలో రామ కృష్ణ జూన్ 26వ రీ రిలీజ్ చేయనున్నారు. గుణ శేఖర్ కెరియర్‌లో అలాగే మహేష్ బాబు కెరియర్‌లో ఒక మైల్ స్టోన్‌గా నిలిచిన ఈ చిత్రం ప్రేక్షకులందరికీ మరోసారి అలరించేందుకు రానుంది. భూమిక చావ్లా హీరోయిన్‌గా నటించిన చిత్రంలో ప్రకాష్ రాజ్ విలన్ పాత్రలో నటించారు. ముఖేష్ రిషి, తెలంగాణ శకుంతల, అజయ్, గీత, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, రాజన్, అచ్యుత్ తదితరులు కీలకపాత్రను పోషించారు. ఈ సందర్భంగా దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ ఒక్కడు ప్రతి సంవత్సరం మరింత క్రేజ్ పెంచుకుంటూ ఇప్పటికే ఎన్నో సార్లు రీ–రిలీజ్ అయినప్పటికీ మరోసారి రీ–రిలీజ్ కు సిద్ధమైంది. ఈ నెల 26వ తేదీన సినిమాను 4కెలో విడుదల కానుంది. అందరిలాగా నేను కూడా ఈ సినిమాను చూసేందుకు చాలా ఆసక్తిగా ఉన్నాను. ప్రేక్షకులంతా ఈ సినిమాను మరోసారి చూసి అభినందించాలని కోరుకుంటున్నాను అన్నారు.

## ‘దేశ సంచారి’ పాటను ఆవిష్కరించిన హీరో సత్యదేవ్



మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో నటుడు సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న సైకాలజికల్ థ్రిల్లర్ ’రావు బహదూర్’ ఈ చిత్రాన్ని ఎ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే విడుదలైన ‘ఓ సుందరి’ పాట, టీజర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. తాజాగా బృందం రెండో పాట ‘దేశ సంచారి’ విడుదల చేశారు. ‘దేశ సంచారి’ పాట ఆల్బమ్‌కు సంగీత దర్శకుడు స్మరణ్ సాయి అందించిన ఈ కంపోజిషన్ చేశారు.రెహమాన్ అందించిన సాహిత్యం, హేమచంద్ర, ప్రియాంక గజానన్ పాడిన తీరు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వారి స్వరాలు పాటలోని ఫీల్‌ను మరింత బలంగా ప్రజెంట్ చేశాయి.ఈ చిత్రంలో దీపా థామస్ కథానాయికగా నటిస్తుండగా, వికాస్ ముప్పాల, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాకా, మాస్టర్ కిరణ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కార్తీక్ పరమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, స్మరణ్ సాయి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. రోహన్ సింగ్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఈ సినిమాను జూలై 3న థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## దక్షిణ మధ్య రైల్వేలో యోగా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ‘ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా‘ అనే ఈ ఏడాది థీమ్‌కు అనుగుణంగా జరిగిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, స్కౌట్స్ అ్‌డ గైడ్స్‌తో పాటు పెద్ద సంఖ్యలో యోగా ఔత్సాహికులు పాల్గొని యోగాభ్యాసాలు చేశారు.ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హైదరాబాద్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్, ప్రముఖ యోగా గురువు మురారి మోహన్ పర్యవేక్షణలో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, వివిధ శాఖాధిపతులు, అధికారులు, సిబ్బంది, స్కౌట్స్ అ్‌డ గైడ్స్ సభ్యులు, పాఠశాల విద్యార్థులు, యోగా ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమానుషం

(మొదటి పేజీ తరువాయి)

తెల్లవారుజామున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్ అధికారులు ఒక్కసారిగా జెసిబితో చొరబడి పేదల ఇళ్లను కూల్చివేయడం దారుణమన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇదే గుండ్ల సింగారం కోమల్ల కుంట పరిధిలో 40 మందికి ఇండ్ల పట్టాలు ఇచ్చారు.

బీఆర్ఎస్ హయాంలోనూ పేదలకు ఇక్కడే ఇండ్లు నిర్మించి ఇచ్చారు. అప్పుడు లేని అభ్యంతరం, ఇప్పుడు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలపైనే ఎందుకు?‘ అని ఆయన ప్రశ్నించారు. గుండ్ల సింగారంలో ఇండ్లు కోల్పోయిన 360 మంది పేదలకు తిరిగి అక్కడే ఇండ్ల పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**సురవరం భవన్ కూల్చివేతపై సిఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి!**

గుండ్ల సింగారంలో మాజీ ఎంపి సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి పేరుతో నిర్మించుకున్న కాలనీ భవనాన్ని కూడా అధికారులు కూల్చివేయడంపై పల్లా వెంకటరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సురవరం సుధాకర్ రెడ్డిని గౌరవిస్తాను‘ అని చెప్పే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన పేరు మీద ఉన్న భవనాన్ని కూల్చివేయడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## చర్చలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఎలాటి చర్యలు తీసుకుంటోందో తెలుసుకోదలిచామని, తమ బాధ్యతలను ఏ విధంగా నెరవేర్చాలనుకుంటున్నారో స్పష్టత అవసరమని చెప్పారు. బర్గెన్‌స్టాక్‌లో అమెరికా–ఇరాన్‌తోపాటు పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులతో చతుర్ముఖ సమావేశం జరుగుతుందని అంతకుముందు చెప్పారు. ఇరాన్ స ర్వోన్నత నాయకుడు మొజ్తాబా ఖమేనీ సలహాదారు డు మహ్మద్ మోఖ్‌బర్ ఆదివారం ఒక హెచ్చరిక చేస్తూ, ఇజ్రాయెల్ వట్టి కాగితపు ఒప్పందాలను విశ్వసించబోదని, అమెరికా అంగీకరించిన కట్టుబాట్లను అమలు చేయాలన్నారు. కాగా, అన్నీ సక్రమంగా సాగుతున్నాయని విట్‌కాఫ్–కుష్నెర్‌లను ఉటంకిస్తూ జె.డి.వాన్స్ ఫాక్స్ న్యూస్‌కు చెప్పారు. అణుసమస్య, లెబనాన్‌లో దాడులపై చర్చల్లో పురోగతి సాధిస్తామని ఆశిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా మధ్యవర్తిగా పాకిస్థాన్ తన పాత్ర నిర్వహిస్తుందని ఆ దేశ విదేశీ వ్యవహారాల కార్యాలయం ప్రకటించింది. దీంతోపాటు ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్విట్జర్లాండ్ విదేశాంగమంత్రి ఇగ్నాజియో కాసిస్‌తో ద్వైపాక్షిక సంబంధాలపై ఆదివారం విడిగా సంప్రదింపులు జరిపారు.

జులై 18వ తేదీ నాటికి అమెరికా–ఇరాన్ మధ్య ప్రాథమిక ఎంఓయు ఒప్పందంపై సంతకాలు పూర్తయిన తర్వాత లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు మరింత తీవ్రరూపం దాల్చాయి. బుధవారం ఫ్రాన్స్‌లో జరిగిన జి–7 సదస్సులో ఈ ఒప్పందంపై ఎలక్ట్రానిక్ పద్ధతిలో ట్రంప్ సంతకాలు చేయడం, ఆ తర్వాత మధ్యవర్తిదేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కూడా దీనిని ధృవీకరిస్తూ సంతకం చేయడంతో జూన్ 18వ తేదీ తెల్లవారు ఝాము నాటికి ప్రాథమిక ఒప్పంద ప్రక్రియ అధికారికంగా అమలులోకి వచ్చింది. అప్పటినుండీ 60 రోజులపాటు అమెరికా–ఇరాన్ ప్రతినిధులమధ్య తదుపరి సమస్యల పరిష్కార చర్చలకు కూడా కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. నిర్ణీత ప్రకారం ఈ చర్చలు జూన్ 19న స్విట్జర్లాండ్‌లో ప్రారంభం కావాల్సి ఉండగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇరాన్ ప్రతినిధులు స్విట్జర్లాండ్‌కు వెళ్ళలేదు. ఆదివారంనాటికి గడచిన మూడు రోజులుగా దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేసిన దాడులలో మొత్తం 90 మంది మరణించారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడుల నిలిపివేత కూడా ఒప్పందంలో ఒక భాగంగా ఉందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ముందుగానే ప్రకటించారు. ఇజ్రాయెల్ దాడులను ఒప్పంద ఉల్లంఘనగా పరిగణించిన ఇరాన్ పాలకులు అమెరికాకు తొలి హెచ్చరికలు చేయడంకోసమే స్విట్జర్లాండ్ చర్చలకు తమ ప్రతినిధులను పంపింది.

### లెబనాన్‌లో మరో ఏడుగురు మృతి

**బీరూట్:** లెబనాన్‌లో ఇజ్రాయెల్ ఆదివారం చేసిన దాడుల్లో ఏడుగురు మరణించారు. శనివారం నాడు చేసిన దాడుల్లో మృతుల సంఖ్య 83 పెరగడంతో మొత్తం మృతులసంఖ్య మూడు రోజుల్లో 90కి చేరుకుంది. మార్చి రెండో తేదీన ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్‌లోకి అడుగుపెట్టి యుద్ధం ప్రారంభించిన తర్వాత ఈనాటి వరకూ మరణించినవారి సంఖ్య 4000కు చేరుకుందని లెబనాన్ మీడియా తెలియజేసింది.అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్ తీవ్ర తప్పిదాలకు పాల్పడుతోందని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని ఇరాన్ హెచ్చరిక చేసింది. ఐఆర్‌జిసి,హెజ్బొల్లా కూడా ఇదేవిధమైన హెచ్చరికలు చేశాయి.

## ‘సుప్రీం’ను ఆశ్రయిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ లోని సచివాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు దనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వర రావు, వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఉన్నతాధికారులు కూడా సమావేశానికి హాజరై ,వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ చట్టం అమలుతో గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్థానిక సంస్థలు, వ్యవసాయ రంగంపై కలిగే ప్రభావాలపై సబ్ కమిటీ విస్తృతంగా చర్చించింది. క్షేత్రస్థాయి పరిస్థితులు, గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు, కూలీల జీవనోపాధిపై చట్టం ప్రభావం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించింది. ముఖ్యంగా ఉపాధి హామీ పనులను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాల్సిన అవసరంపై సభ్యులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. కొత్త చట్టంలో ప్రతిపాదించిన 60 రోజుల ఉపాధి విరామం గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేయడం సాధ్యం కాదని,తద్వారా కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు కూలీ రేట్లపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం సముచితం కాదని,దేశ గ్రామీణ పేదలకు ఉపాధి హక్కును అందించిన చారిత్రాత్మక పథకానికి ‘గాంధీ’ పేరును కొనసాగాలని సభ్యులు తెలిపారు. తెలంగాణ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి వెళుతున్న ప్రతి రూపాయికి తిరిగి 40 పైసలే రాష్ట్రానికి వెనక్కి వస్తుందని, ఇలాంటి నేపథ్యంలో విబిజి రామ్‌జీ పేరుతో 40 శాతం నిధుల భారాన్ని రాష్ట్రంపై మోపడం ఆమోదయోగ్యం కాదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

**సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం**

రాజ్యాంగంలోని సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్ర ప్రభుత్వం 40 శాతం నిధుల భారాన్ని రాష్ట్రాలపై మోపడం అప్రజాస్వామికమని రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయపడింది. రాజ్యాంగంలోని సహకార సమాఖ్య సూత్రాలకు అనుగుణంగా రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని సభ్యులు అన్నారు. ఆర్టికల్ 258(3) ప్రకారం..రాష్ట్రాలపై కేంద్రం అదనపు భారం మోపితే రాష్ట్రాలకు జరిగే నష్టాన్ని కేంద్రం భర్తీ చేయాల్సి ఉంటుందని రాజ్యంగం స్పష్టం చేస్తుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వానికి సమగ్ర సిఫార్సులు అందించేందుకు అంశాల వారీగా అధ్యయనం కొనసాగించాలని,గ్రామీణ సంక్షేమం, ఉపాధి భద్రత, రాష్ట్రాల హక్కుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని తుది నివేదిక రూపొందించాలని మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు తెలిపారు.మరో రెండు మూడు, రోజుల్లో సబ్ కమిటీ మరోసారి సమావేశమై తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనుంది. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్,ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి , జాయింట్ కమిషనర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పునఃపరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఢిల్లీలోని ఓఖ్లాలో ఉన్న ఎన్‌టిఎ ప్రధాన కార్యాలయంలో నీట్ పునఃపరీక్ష సజావుగా జరిగేలా చూసేందుకు చేసిన ఏర్పాట్లను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమీక్షించారు. పరీక్షను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి చేసిన లాజిస్టికల్, సాంకేతిక ఏర్పాట్ల గురించి ఎన్‌టిఎ మంత్రికి వివరించినట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ పరీక్ష మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు జరిగింది. అదనపు సమయం పొందేందుకు అర్హత ఉన్న దివ్యాంగ అభ్యర్థులుసాయంత్రం 6:20 గంటల వరకు పరీక్ష రాసేందుకు అనుమతించారు. కోల్‌కతాలో, గాయపడిన ఒక అభ్యర్థికి పరీక్షా కేంద్రంలో ప్రత్యేక గదిని కేటాయించడంతో పాటు, వైద్య సహాయం, అంబులెన్స్ సదుపాయాన్ని కూడా కల్పించారు. అయితే, కొంతమంది అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంలో రవాణా పరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. భోపాల్‌లో, ఆలస్యంగా రావడంతో ఇద్దరు విద్యార్థులకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి నిరాకరించారు. కోల్‌కతా, దాని పరిసర ప్రాంతాలలో భారీ వర్షాలు కురవడంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ట్రాఫిక్ అంతరాయం కలిగింది. పునఃపరీక్ష కోసం పరీక్షా కేంద్రాలకు వెళ్తున్న నీట్ అభ్యర్థులకు ఇబ్బందులను కలిగించాయి. ముంబయిలో, తమ ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో, బృహన్ ముంబయి ఎలక్ట్రిక్ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్ట్ (బెస్ట్) సంస్థ పునఃపరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. ఢిల్లీలో, ట్రాఫిక్ ఆంక్షల కారణంగా నీట్ పునఃపరీక్ష అభ్యర్థులు అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోల్‌కతా నుంచి ఐజిఐ విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత తన నివాసానికి ప్రయాణాన్ని వాయిదా వేశారు. ఇదిలా ఉండగా, గుజరాత్ వ్యాప్తంగా 211 కేంద్రాల్లో జరిగిన పునఃపరీక్షకు దాదాపు 79,400 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష విస్తృత భద్రతా ఏర్పాట్ల మధ్య జరిగింది. పరీక్ష సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూసేందుకు రాష్ట్ర పోలీసులు కేంద్రాల వద్ద డ్రోన్‌లను, అదనపు సిబ్బందిని మోహరించారు. జాతీయ రాజధానితో అధికారులు తెలిపారు. ఒక మీడియా నివేదిక ప్రకారం, రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో బురఖా ధరించిన ఒక నీట్ అభ్యర్థిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదని ఆమె ఆరోపించారు. అభ్యర్థి కుల్సుమ్ బానో, తాను గతంలో జరిగిన పరీక్షకు కూడా ఇదే దుస్తులు ధరించి హాజరయ్యానని పేర్కొన్నారు.

## అమ్మోనియా లీక్

(మొదటి పేజీ తరువాయి)

వెంకటేశ్వర ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు డిసి కవిత ఫ్యాక్టరీ ప్రాంగణాన్ని సందర్శించి, ఆసుపత్రులలోని రోగులను కలిశారు. వాల్వ్ వైఫల్యానికి గల కచ్చితమైన కారణాన్ని నిర్ధారించడానికి, ఎగుమతి యూనిట్‌లో సంభావ్య భద్రతా లోపాలను దర్యాప్తు చేయడానికి అధికారిక విచారణకు ఆదేశించారు. ఇదిలా ఉండగా, గ్యాస్ లీక్ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డిఆర్‌ఎఫ్), సదరు రొయ్యల ఫ్యాక్టరీకి వెళ్లి సహాయక, భద్రతా చర్యలు చేపట్టింది. మరోవైపు, పోలీసులు ఈ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించారు. తొలి అడుగుగా, ఈ ఘటనలో ప్రమేయం ఉన్న ఫ్యాక్టరీ మేనేజర్‌ను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఫ్యాక్టరీ యజమాని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇక, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ముఖ్యమంత్రి విజయ్ ఆదేశించారు. ప్రమాదంపై 24 గంటల్లో మధ్యంతర నివేదిక, మూడు రోజుల్లో పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అలాగే, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారందరికీ నాణ్యమైన చికిత్స అందేలా చూడాలని మంత్రులకు ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. అలాగే, జిల్లా కలెక్టర్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని బాధితులకు సహాయం చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఐటి మంత్రి, తిరువళ్లూరు పర్యవేక్షణ మంత్రి, పర్యవేక్షణ అధికారి డాక్టర్ కె.పి. కార్తికేయన్‌తో కలిసి తిరువళ్లూరుకు వెంటనే వెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

## రూ.5 కోట్ల మోసం

(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బంజారా హిల్స్‌లోని శివగంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ తరఫున అధీకృత ప్రతినిధి గోవింద్ ఇనానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిసిఎస్ డిడి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 126/2026 నమోదు చేశారు. కేసు దర్యాప్తును ఇఒబ్ల్యూ టీమ్4 ఎసిపి ఎస్. రామచంద్రరెడ్డికి అప్పగించారు.

**అసలేం జరిగింది?**

ఫిర్యాదు ప్రకారం, ఉజ్వల్ ఉపాధ్యాయ్ నేతృత్వంలోని నిత్తై మిశ్రా, గౌరవ్ బవారియా, ఆదిత్య కేశ్రీ, అంబికా కుమారి, అర్పితా డే, గౌరవ్ ఉపాధ్యాయ్, సౌగత్ ఉపాధ్యాయ్, సంగీతా ఉపాధ్యాయ్‌లు కలిసి కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల్లో బొగ్గు సరఫరా కాంట్రాక్టులు ఇప్పిస్తామని శివగంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ యాజమాన్యాన్ని నమ్మించారు. ప్రభుత్వ శాఖలతో తమకు బలమైన సంబంధాలు ఉన్నాయని, టెండర్లపై ముందస్తు సమాచారం ఉందని చెప్పి నకిలీ పత్రాలు, ఒప్పందాలు చూపిస్తూ విశ్వాసం కల్పించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 2024 జూలై 15న ఎంఓయూ కుదుర్చుకుని, ఒప్పందం అమలు కాకపోతే పరిహారంగా రూ.5 కోట్ల విలువైన ఐదు చెక్కులను భద్రతగా ఇచ్చినట్లు తెలిపారు. అయితే కాంట్రాక్టులు ఇప్పించకపోగా, తీసుకున్న డబ్బును తిరిగి చెల్లించకుండా తప్పించుకుంటూ వచ్చారని ఆరోపించారు.

ఢిల్లీ హోటల్‌లో ఎంఓయూ చింపేసినట్టు ఆరోపణ వివాదాన్ని పరిష్కరిస్తామని చెప్పి 2026 జనవరి 30న ఢిల్లీలోని తాజ్ ఛాంబర్స్ హోటల్‌కు పిలిపించి, అసలు ఎంఓయూను పరిశీలన పేరుతో తీసుకుని తమ ఎదుటే చింపేసి ధ్వంసం చేశారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. అనంతరం కేసులు పెడతామని, ప్రాణహాని కలిగిస్తామని బెదిరించినట్లు కూడా ఆరోపించారు.వాట్సాప్ చాట్లు, కాల్ రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, ఫోటోలు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లు తదితర ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని దర్యాప్తు అధికారులకు అందజేస్తామని ఫిర్యాదుదారు తెలిపారు. ఫిర్యాదు ఆధారంగాసిసిఎస్ పోలీసులు బిఎన్ఎస్ సెక్షన్లు 318(4), 319, 336(3), 340(2), 351(3), 61(2) కింద కేసు నమోదు చేసి, మోసం, నకిలీ పత్రాల సృష్టి, సాక్ష్యాల ధ్వంసం, బెదిరింపులు, క్రిమినల్ కుట్ర తదితర కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com